PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 133 | విజయవాడ, బుధవారం 17 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Wednesday 17 December 2025 | Rs



బహుముఖ ప్రజ్ఞావంతుడు ఆరుద్ర

- శతజయంతి స్టాంపు విడుదలలో వెంకయ్య నాయుడు

7

కుర్రాళ్లు కేక

- రూ.14.20కోట్లు చొప్పున ప్రశాంత్, కార్తీక్ చెన్నై చెంతకు
- రికార్డు ధర పలికిన గ్రీన్
- రూ.25.20కోట్లకు కోల్‌కతా సొంతం
- ముగిసిన ఐపిఎల్ 2026 మినీ వేలం



8



కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, వేదికపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత, డిజిపి హరీష్ కుమార్ గుప్తా

నిబద్ధతతో పనిచేయండి

- విధుల్లో చేరుతున్న పోలీస్ కానిస్టేబుళ్లకు సిఎం పిలుపు
- స్టైఫండ్ రూ.12,500కు పెంపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విధుల్లో చేరుతున్న పోలీస్ యువకిశోరాలు నిబద్ధతతో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. మంగళగిరి ఎపిఎస్‌పి బెటాలియన్ పెరేడ్‌గ్రౌండ్‌లో నూతనంగా ఎంపికైన కానిస్టేబుళ్లకు నియామకపత్రాలు అందజేసే కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఎం మాట్లాడుతూ రికార్డు సమయంలో పరీక్షలు నిర్వహించి రిక్రూట్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. డిజిటల్ మీటర్లు, టెక్నాలజీతో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపట్టామన్నారు. ఉద్యోగాలు పొందిన ప్రతి ఒక్కరూ విధుల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. సైబర్‌క్రైమ్, డ్రగ్స్ నియంత్రణ, మహిళలపై నేరాలు లాంటి వాటిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. శాంతి భద్రతలు ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని,అప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. ‘విజిబుల్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీస్’ అనే విధానం ఇప్పుడు అవసరమని చెప్పారు. నేరాలను అంచనా వేసి వాటిని అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. రాజకీయ ముసుగులో నేరాలు చేసే రాజకీయ రౌడీలు తయారయ్యారన్నారు. పోలీస్ వ్యవస్థ జాగ్రత్తగా ఉండాలని, వారి నీడను వారు కూడా నమ్మకుండా ఉండాలన్నారు. శిక్షణలో ఉండే కానిస్టేబుల్స్‌కు ప్రస్తుతం ఇస్తున్న స్టైఫండ్‌ను రూ.4,500నుంచి రూ.12,500కు పెంచుతున్నట్లు సిఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు.

కానిస్టేబుల్సే మూలస్తంభాలు : పవన్‌కల్యాణ్

పోలీస్ శాఖలో కానిస్టేబుల్స్ మూల స్థంభాలని, తన తండ్రి కూడా ఓ కానిస్టేబుల్‌గానే జీవితాన్ని ప్రారంభించారని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. క్రమశిక్షణ నైతిక విలువలు చాలా కీలకమన్నారు. ఖాకీ డ్రస్ సమాజానికి రక్షణ కవచంలాగా నిలబడాలన్నారు. పోలీస్ స్టేషన్‌కువెళ్తే న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కలిగించాలన్నారు. మాజీ సిఎం వైఎస్ జగన్ పోలీస్ అధికారులకు నేరుగా హెచ్చరికలు జారీచేస్తున్నారని, పోలీస్‌శాఖను కూడా బెదిరిస్తారా అని ఆయన ప్రశ్నించారు.

బాబూరావు స్వగ్రామానికి బిటి రోడ్డు

నూతనంగా కానిస్టేబుల్‌గా ఎంపికైన లాకే బాబూరావు తన సక్సెస్ స్టోరీ చెప్పే సమయంలో తన స్వగ్రామమైన అల్లూరి సీతారామరాజు జిల్లా జికె వీధిమండలం దేవరపల్లి పంచాయతీపరిధిలోని తెనుములబండకు రహదారి సౌకర్యం కల్పించాలని సిఎంను కోరడంతో వెంటనే పక్కనే ఉన్న డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు సమస్యను పరిష్కరించమని సూచించారు. వెంటనే స్పందించిన పవన్‌కల్యాణ్ రూ.2కోట్లతో 2 కిలోమీటర్ల రహదారి తెనుములబండ నుంచి ఎలుగురాతి బండ వరకు బిటి రోడ్డు నిర్మాణానికి ఆదేశాలిస్తున్నట్లు సిఎంకు తెలపడంతో ఆయన సభలోనే ప్రకటన చేశారు.

వృద్ధి, పెట్టుబడులపైనే...

నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మరోసారి వృద్ధి, పెట్టుబడులే ప్రధాన అంశంగా మరోసారి కలెక్టర్ల సదస్సు జరగనుంది. రాష్ట్ర సచివాలయంలో బుధ, గురువారాల్లో జరగనున్న ఈ సదస్సుకు భారీ అజెండా సిద్ధమైంది. జిఎస్‌డిపి, కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్లు, పెట్టుబడులపైనే ఎక్కువగా దృష్టి సారించనున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ అంశాలపైనే కేంద్రీకృతం చేస్తున్న సంగతి తెలిసిందే. . 2029, 2047 సంవత్సరాలకు లక్ష్యంగా జిఎస్‌డిపిపై అధికారులు, శాఖలకు దిశా నిర్దేశం చేసి, ఆ లక్ష్యాలను సాధించేందుకు ప్రయత్నించాలని పదేపదే సూచనలు చేస్తున్నారు. అది కూడా ఏకంగా ఏటా 15 శాతం వృద్ధి సాధించాలన్న లక్ష్యం భారీగా నిర్దేశించడంతో అధికారులు కూడా పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఇదే జిఎస్‌డిపిని జిల్లాల వారీగా కూడా నిర్దేశించడంతో ఇక కలెక్టర్లకు కూడా ఈ బాధ్యతలు అప్పగించనున్నారు. పెట్టుబడులపైనా జిల్లా కలెక్టర్లకు లక్ష్యాలను నిర్దేశించనున్నారు. తాజాగా నిర్వహించిన పెట్టుబడుల సదస్సులు, ఇప్పటివరకు నిర్వహించిన 13 రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో ఆమోదించిన సమావేశాల ద్వారా వచ్చినట్లు చెబుతున్న 20 లక్షల కోట్ల పెట్టుబడులు క్షేత్ర స్థాయిలో అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యతలను కలెక్టర్లకు అప్పగించనున్నారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై ప్రజల్లో సంతృప్తి పెరిగేలా తీసుకోవాల్సిన చర్యలపైనా దిశా నిర్దేశం చేయనున్నారు. వీటికి అదనంగా పేదరిక నిర్మూలనకోసం అమలు చేస్తున్న పి-4 విధానంపై కూడా సమీక్ష నిర్వహించనున్నారు.

‘ఉపాధి’కి రాంరాం !

గాంధీజీపై విద్వేషం .. నిరుపేదలపై కక్షసాధింపు

‘ఎంజిఎన్ఆర్ఇజిఎ’ స్థానంలో విబి జి రామ్ జి బిల్లు

తీవ్రంగా ప్రతిఘటించిన ప్రతిపక్షాలు • పార్లమెంటు ఆవరణలో ఆందోళన

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెడుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజిఎన్ఆర్ఇజిఎ) చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఈ చట్టం పేరు మార్చే సాకుతో పేదల ‘ఉపాధి’ ఉసురు తీసేందుకు కుట్ర పన్నుతోంది. ఎంజిఎన్ఆర్ఇజిఎ రద్దు కోసమే ఉద్దేశించిన బిల్లుగా ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న ‘విబి-జి రామ్ జి’ బిల్లును ప్రతిపక్షాల నిరసనల మధ్యనే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టారు. దీంతో ప్రతిపక్షాల సభ్యులు లేచి ముక్తకంఠంతో వ్యతిరేకించారు. జాతిపిత మహాత్మాగాంధీని అవమానించడానికి వీలు లేదని నినాదాలతో హోరెత్తించారు. గాంధీజీ చిత్రపటాలు చేబూని సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. దీంతో సభా కార్యకలాపాలు మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదాపడ్డాయి.

నిరుపేదలపై కక్షసాధింపు...

గాంధీపై ద్వేషంతో పేరు మార్చారని, నిరుపేదలకు మొండి చేయి చూపేందుకు చట్టంలో మార్పులు చేశారని ప్రతిపక్షాలు విమర్శించారు. ప్రతిపక్ష ఎంపిలు టిఆర్ బాలు, ప్రియాంక గాంధీ, శశిథరూర్, సౌగత రాయ్, సుప్రియాసూలే, ధర్మేంద్ర యాదవ్ తదితరులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ పట్ల కోపం, ద్వేషమే ఈ చట్టం పేరు మార్చడానికి కారణమని సభ్యులు విమర్శించారు. ‘మహాత్మా గాంధీ మొత్తం దేశానికి ఆస్తి. జాతిపిత పేరును మార్చడానికి కేంద్రప్రభుత్వం చూపుతున్న ఉత్సాహం ఆమోదయోగ్యం కాదు. దేశంలోని పేదలకు, నిరుపేదలకు ఆధారం, ఆశ్రయంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని దెబ్బతీసే బిల్లు తీవ్ర పరిణామాలను కలిగి ఉంటుంది. ఉపాధి హామీ రోజులను 125 రోజులకు పెంచినట్లు ప్రభుత్వం పేర్కొంది. నిజానికి ఈ కొత్త బిల్లులో చట్టాన్ని బలహీనపరచి తొలగించడానికి నిబంధనలు ఉన్నాయి’ అని తెలిపారు. బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రతిపక్ష ఎంపిలు డిమాండ్ చేశారు. ఈ అంశంపై మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ ‘బాపూజీ కల రామరాజ్యం, ఆ పథకానికి రామ్ అని పేరు పెట్టడంలో తప్పేంటి’ అని అన్నారు. బిల్లుపై వివరణాత్మక చర్చ జరుగుతుందని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఈ చట్టాన్ని దెబ్బతీసే చర్యకు వ్యతిరేకంగా సభ వెలుపల వామపక్ష ఎంపిలు నిరసన తెలిపారు. సిపిఎం లోక్ సభాపక్ష నాయకుడు కె.రాధాకృష్ణన్, రాజ్యసభ పార్టీ నాయకుడు జాన్ బ్రిట్టాస్, ఎంపిలు అమ్రారామ్, వి.శివదాసన్, ఎస్.వెంకటేశన్, ఆర్.సచ్చిదానందం, సిపిఐ ఎంపిలు పిపి సునీర్, పి.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పార్లమెంటు వెలుపల గాంధీ విగ్రహం వద్ద ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలిపారు.



పార్లమెంట్ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష పార్టీల ఎంపీలు

బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలు

- ప్రతిపక్షాల ఆందోళన మధ్య బిల్లు ఆమోదం

7

విశాఖలో ఏవియేషన్ ఎడ్యుసిటీ

- దేశంలోనే మొట్టమొదటిది
- కేంద్ర, రాష్ట్ర మంత్రుల సమక్షంలో జిఎంఆర్-మాన్సాస్ సంస్థల మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలతో జిఎంఆర్ - మాన్సాస్ సంస్థల ప్రతినిధులు జిబిఎస్.రాజు, అశోక్ గజపతిరాజు, చిత్రంలో రామ్మోహన్‌నాయుడు, అయ్యన్నపాత్రుడు, లోకేష్ తదితరులు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

దేశంలోనే మొట్టమొదటి ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్ ఎడ్యుసిటీకి విశాఖలో మంగళవారం అంకురార్పణ జరిగింది. దీనిని భోగాపురం సమీపంలోని విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరం వద్ద 136 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. అందుకు సంబంధించిన ఒప్పందం జిఎంఆర్-మాన్సాస్ సంస్థల మధ్య జరిగింది. విశాఖలోని రాడిషన్ బ్లూ రిసార్టులో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ఐటి, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఇరు సంస్థలు ఒప్పంద పత్రాలు మార్చుకున్నాయి. ఈ సందర్భంగా గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ప్రసిద్ధిగాంచిన వ్యవస్థల రాకతో ఉత్తరాంధ్రలో అభివృద్ధి దిశగా కీలక అడుగులు పడుతున్నాయన్నారు. అల్లూరి సీతారామరాజు జన్మించిన పాండ్రంగి గ్రామం భోగాపురం ఎయిర్ పోర్టుకు సమీపంలోనే ఉందని, అలాంటి మహనీయుని పేరు మీద విమానాశ్రయం రావడం ఎంతో హర్షణీయమని, ఇది భావితరాలకు గొప్ప సందేశంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భారతదేశం యువ దేశమని, టీమ్ వర్క్ ద్వారా అనేక గొప్ప ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. జిఎంఆర్ సంస్థతో కలిసి పని చేయడం ఆనందంగా ఉందన్నారు. దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో షార్ (ఇస్రో కేంద్రం) ఉందని, ఉత్తర ఆంధ్రప్రదేశ్‌లో ఏవియేషన్ ఎడ్యు సిటీ ఏర్పాటు చేసి ఒక సమగ్ర ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయగలిగితే ఉత్తరాంధ్ర అభివృద్ధిని ఎవ్వరూ ఆపలేరని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర యువత వలస పోకుండా స్వస్థలంలోనే ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పటిష్టమైన విద్యా వ్యవస్థ రూపుదిద్దుకుంటుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఏవియేషన్ ఎడ్యుసిటీ చారిత్రాత్మకమైనదిగా నిలువనుందన్నారు. ప్రస్తుతం దేశంలో సుమారు 800 విమానాలు సేవలందిస్తుండగా, మరో 1,700 విమానాలకు ఆర్డర్లు ఉన్నాయని తెలిపారు. ఒక్కో

మిగతా 7లో

అధ్వాన్న రూపాయి..

- డాలర్‌తో పోల్చితే 91కి క్షీణత
- చరిత్రలోనే రికార్డ్ కనిష్టం

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ అధ్వాన్న స్థాయికి పడిపోయింది. పతనంలో మరో నూతన రికార్డ్‌ను చవి చూసింది. భారతదేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 91 మార్క్‌కు పతనమయ్యింది. అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పంద అనిశ్చితి, విదేశీ సంస్థగత మదుపర్లు తమ నిధులను తరలించుకు పోవడం, పడిపోతోన్న రూపాయిని కాపాడటంతో మోడీ సర్కార్, రిజర్వ్ బ్యాంక్ విఫలం కావడంతో రూపీ ఆల్‌టైం కనిష్ట స్థాయిని చవి చూసింది.

డిసెంబర్ 16న డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 23 పైసలు కోల్పోయి 91.01కి దిగజారింది. ఫారెక్స్ ఎక్చేంజీ మార్కెట్‌లో ఉదయం 90.87 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 36 పైసలు కోల్పోయి 91.14కి చేరి.. ఇంట్రాడేలో ఆల్‌టైం కనిష్టాన్ని చవి చూసింది. ఇంతక్రితం సోమవారం 29 పైసలు తగ్గి 90.78 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 0.61 తగ్గి 60.19 డాలర్లుగా నమోదయ్యింది. మార్కెట్ల వరుస పతనం, తరలిపోతున్న విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు భారత కరెన్సీని దిగజారేలా చేస్తోన్నాయి. సోమవారం సెషన్‌లో భారత స్టాక్ మార్కెట్ల నుంచి రూ.1,468.32 కోట్ల ఎఫ్ఐఐలు తరలిపోయాయి.

గడిచిన 10 సెషన్లలో డాలర్‌తో రూపాయి 90 నుంచి 91కి క్షీణించింది. క్రితం ఐదు సెషన్లలోనే భారత కరెన్సీ 1 శాతం విలువ కోల్పోయింది. రూపాయి విలువ పతనం అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతులను తీవ్ర భారం చేయనున్నాయి. మరోవైపు విదేశీ చెల్లింపుల భారం అమాంతం పెరిగిపోనుంది. భారత్‌పై అమెరికా వేసిన భారీ టారిఫ్‌లకు తోడు, విదేశీ నిధుల బయటకు తరలిపోవడం, డాలర్ల కొనుగోళ్లకు దిగుమతిదారులు మొగ్గు చూపడం, రూపాయి పతనాన్ని కట్టడి చేయడంలో మోడీ సర్కార్ విఫలం కావడం తదితర పరిణామాలు దేశీయ కరెన్సీని అగాథంలోకి నెట్టుతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆర్థిక వ్యవస్థకు తీవ్ర ప్రమాదమేనని హెచ్చరిస్తున్నారు. రూపాయి ప్రతికూల సంకేతాలతో మంగళవారం బిఎస్ఇ సెన్సెక్స్ 533.50 పాయింట్లు లేదా 0.63 శాతం పతనమై 84,680కి దిగజారింది. నిఫ్టీ 167 పాయింట్ల నష్టంతో 25,860కి పరిమితమయ్యింది.

పోలవరం - నల్లమలసాగర్‌పై

సుప్రీంలో తెలంగాణ పిటిషన్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

పోలవరం-బనకచర్ల స్థానంలో గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ నిర్మిస్తున్న పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్ట్‌ను ఆపాలని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ ఈ పిటిషన్ వేశారు. పోలవరం-బనకచర్లపై సుప్రీంకోర్టులో వేసిన కేసుపై ఇటీవల ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పలుమార్లు అభిషేక్ మను సింఘ్వీతో భేటీ అయి కోర్టులో లేవనెత్తాల్సిన అభియోగాలపై చర్చించారు.

ఈ క్రమంలో తెలంగాణ సర్కార్ తాజాగా పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించే ప్రయత్నం చేస్తున్నారంటూ పిటిషన్‌లో పేర్కొంది. ప్రాజెక్టు నిర్మాణంలో ఎపి ప్రభుత్వం ముందుకు వెళ్లకుండా అడ్డుకోవాలని కోరింది.

‘గీతం’పై అంత ప్రేమెందుకు?

- డిస్కమ్ అధికారులకు తెలంగాణ హైకోర్టు ప్రశ్న


ప్రజాశక్తి- హైదరాబాద్

హైదరాబాద్‌లోని గీతం యూనివర్సిటీ 2008-09 నుంచి ఇప్పటి వరకు పేరుకుపోయిన రూ.118.13 కోట్ల విద్యుత్తు బకాయిలను ఎందుకు వసూలు చేయలేదని డిస్కమ్ అధికారులను తెలంగాణ హైకోర్టు మంగళవారం ప్రశ్నించింది. పేద, మధ్యతరగతి వారు వెయ్యి రూపాయలు బకాయి ఉన్నా నోటీసు కూడా ఇవ్వకుండానే విద్యుత్తు కనెక్షన్ కట్ చేస్తారని, గీతం యూనివర్సిటీపై అంత ప్రేమ ఎందుకని ప్రశ్నించింది. దీర్ఘకాలంగా బకాయిలు ఉన్నా విద్యుత్తు సరఫరా ఎందుకు నిలిపివేయలేదో చెప్పాలని సంగారెడ్డి సర్కిల్ డిస్కమ్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌ను ప్రశ్నించింది. దీనిపై విచారణకు ఈ నెల 22న హాజరు కావాలని జస్టిస్ నగేశ్ భీమపాక ఆదేశించారు. విద్యుత్తు బిల్లుల బకాయిలు చెల్లించాలని డిస్కం అధికారులు ఇచ్చిన తాజా నోటీసును గీతం యూనివర్సిటీ సవాల్ చేసిన పిటిషన్ విచారణ సమయంలో న్యాయమూర్తి ఈ ఆదేశాలు జారీ చేశారు. విచారణ ఈ నెల 22కి వాయిదా వేశారు.

జగనన్న కాలనీల్లో

ఖాళీ స్థలాలపై సర్వే

- వివరాల సేకరణలో అధికార యంత్రాంగం నిమగ్నం
- కొత్తగా ఇళ్ల స్థలాలు పంపిణీకి ఖరారు కాని విధి విధానాలు



నడింపాలెంలో కేటాయించిన స్థలాల్లో బేస్‌మెంట్ లోనే ఆగిపోయిన ఇళ్లు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలాలు ఇచ్చేందుకు భూములను గుర్తించేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొత్తగా భూ సేకరణ చేయకుండా అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఇందులో భాగంగా తొలుత రాష్ట్ర వ్యాప్తంగా 2020-21లో ఎంపిక చేసిన జగనన్న కాలనీల్లో ఉన్న స్థలాలపై జిల్లాల వారీగా ప్రభుత్వం సమాచారం సేకరిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 32 లక్షల మందికి ఇళ్ల స్థలాల పంపిణీ జరిగింది. పట్టణాల్లో సెంటు (48 గజాలు), గ్రామాల్లో సెంటున్నర (72 గజాలు) చొప్పున పంపిణీ చేశారు. ఇళ్ల నిర్మాణానికి దశల వారీగా అనుమతి ఇచ్చారు. 2021 నుంచి 2024 మధ్య కాలంలో దాదాపు 5.60 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. గత ఏడాదిన్నర కాలంలో మరో మూడు లక్షల ఇళ్లు పూర్తి చేశారు. ఇళ్ల స్థలాలను (జగనన్న కాలనీలను) పట్టణాలకు దూరంగా ఎంపిక చేయడంతో చాలామంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి మొగ్గుచూపలేదు. గుంటూరు జిల్లాలో మొత్తం 2.32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా, 60 వేల ఇళ్ల నిర్మాణం మాత్రమే ప్రారంభమైంది. గుంటూరు నగరంలో 60 వేల మందికి

మిగతా 7లో

జనవరి 11, 12లో

ఆసియా నీటి పక్షుల గణన

- రాష్ట్రంలో విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పెద్దయెత్తున నీటి పక్షుల గణన చేపట్టేందుకు అధికారులు నిర్ణయించారు. ఆసియా ఖండం స్థాయిలో ఈ గణన జరగనుంది. అంతర్జాతీయ వెట్ ల్యాండ్ సెన్సస్ ఆధ్వర్యాన నిర్వహించే ఈ సెన్సస్‌ను జనవరి 11, 12 తేదీల్లో రాష్ట్రంలో కూడా నిర్వహించనున్నారు. కాకినాడ అటవీ డివిజన్ పరిధిలోని గోదావరి పరివాహక ప్రాంతంలోని మడ అడవుల్లో ఈ సర్వే కీలకంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ గణనలో అటవీ సిబ్బందితోపాటు పక్షి ప్రేమికులను కూడా భాగస్వామ్యులను చేయాలని నిర్ణయించారు. గణనలో ఉత్సాహంగా పాల్గొనేందుకు ఆసక్తి గలవారు జనవరి ఐదో తేదీలోగా ముందుకు రావాలని అటవీ కాకినాడ డిఎఫ్ఒ ఎన్ రామచంద్రరావు కోరారు.

ఎన్ఐఎ పరిధిలోకి

కరడుగట్టిన నేరస్తుల కేసులు

సుప్రీం సూచన



న్యూఢిల్లీ : వ్యవస్థీకృతమైన, వృత్తిరీత్యా, కరడుగట్టిన నేరస్తులతో సంబంధమున్న, కేంద్ర చట్టాల కింద విచారించబడిన కేసులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) స్వాధీనం చేసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. ఈ కేసులను ఢిల్లీలో ఎన్ఐఎ కేసులను విచారించే ప్రత్యేక కోర్టులకు బదిలీ చేయవచ్చని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చిలతో కూడిన బెంచ్ సూచించింది. దేశ సార్వభౌమాధికారం, భద్రత, సమగ్రతలను ప్రభావితం చేసే నేరాల దర్యాప్తు, ప్రాసిక్యూషన్‌లను రాష్ట్రాల నుంచి ఎన్ఐఎ స్వాధీనం చేసుకోవచ్చని జస్టిస్ బాగ్చి తెలిపారు. ఎన్ఐఎ చట్టం, 2008లోని సెక్షన్ 6 కింద ఎన్ఐఎకు ఆ అధికారం వుందన్నారు. ఇటువంటి కేసులు వివిధ రాష్ట్రాల్లోని పలు కోర్టుల్లో విచారణలో వున్నాయని, వాటిని ఒక గొడుగు కిందకు తీసుకురావాల్సి వుందని సుప్రీం పేర్కొంది. ఒక రాష్ట్రంలో జరిగిన నేరం తాలుకూ పర్యవసానాలు మరో రాష్ట్రంలో వుండవచ్చని, అప్పుడు ప్రాదేశిక పరిధి సమస్య తలెత్తవచ్చని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. క్రిమినల్ విచారణ ఆలస్యం కావడానికి ఇది కూడా ఒక అంశమవుతుందన్నారు. దీనివల్ల క్రిమినల్‌కు లబ్ధి కలుగుతుందని, కానీ ఇది దేశ, సమాజ భద్రతా ప్రయోజనాలకు ఏ మాత్రమూ శ్రేయస్కరం కాదని సిజెఐ వ్యాఖ్యానించారు. ప్రస్తుతమున్న చట్ట వ్యవస్థను గరిష్ట స్థాయిలో ఉపయోగించుకునే రీతిలో కేంద్రం చట్టాలను రూపొందించి, దీనిపై పరిశీలన చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. వివిధ రాష్ట్రాల్లో అనేక ఎఫ్ఐఆర్‌లు వుంటాయి, వాటన్నింటినీ ఎన్ఐఎ తన ఆధీనంలోకి తీసుకోవచ్చన్నారు. ఇటువంటి కరడుగట్టిన నేరస్తుల కేసులన్నింటినీ ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకువచ్చి, ఒకే సంస్థ దర్యాప్తు చేయడం, ఒక ప్రత్యేక కోర్టు విచారించడం వల్ల పరస్పర విరుద్ధమైన తీర్పులను నివారించవచ్చని సుప్రీం పేర్కొంది. పైగా సాక్ష్యాధారాలను కాపాడుకోవడంలో కూడా సాయపడుతుందని తెలిపింది. ప్రత్యేక ఎన్ఐఎ కోర్టులను తగినన్ని నెలకొల్పే విషయాన్ని పరిశీలిస్తామని పేర్కొంది.

సెంట్రల్ బ్యాంక్ వార్షికోత్సవ వాకథాన్

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 21 డిసెంబర్ 2025న 115వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంటోందని పేర్కొంది. ఈ సందర్భంగా మంగళవారం "భూమిని రక్షించండి, ఆరోగ్యంగా ఉండండి' అనే నినాదంతో కడప ప్రాంతీయ కార్యాలయం నగరపాలెంలో వాకథాన్‌ను నిర్వహించినట్లు తెలిపింది. ఇది సెంట్రల్ బ్యాంక్ ప్రాంతీయ అధిపతి ఇ.వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగిందని ఆ బ్యాంక్ చీఫ్ మేనేజర్ రాకేష్ రంజన్ తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై రాజీ వద్దు

- మంత్రి డోలా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రతపై రాజీ వద్దని అధికారులకు ఆ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచించారు. రాష్ట్ర సచివాలయంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని, అన్ని సంక్షేమ వసతి గృహాలు, అంబేద్కర్ గురుకులాల్లో ముస్తాబు కార్యక్రమం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంతో పిల్లల్లో మంచి ఆరోగ్యంతోపాటు, వ్యక్తిగత పరిశుభ్రత అలవడుతుందన్నారు. విద్యార్థులకు ఈ నెలాఖరులోపు కాస్మోటిక్ కిట్స్ అందజేయాలన్నారు. పిఎం అజయ్ పథకంలో భాగంగా నిర్మిస్తున్న నూతన వసతి గృహాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

3,500 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

- ఇప్పటి వరకు 25.04 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ
- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 3,500 ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 3,96,854 మంది రైతుల నుంచి రూ.5,938.20 కోట్ల విలువైన 25.04 లక్షల మెట్రిక్ టన్నులను సేకరించినట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో ఇప్పటి వరకు 3,79,538 మంది రైతులకు రూ.5,682.77 కోట్లు నేరుగా వారి అకౌంట్లలో జమ చేశామన్నారు. మిగిలిన రూ.255.43 కోట్లను బ్యాంకు బ్యాచ్ ప్రాసెస్‌లో రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. రైతులు తమ ధాన్యం విక్రయంలో ఏమైనా ఇబ్బందులుంటే విజయవాడలోని ప్రధాన కార్యాలయం కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబరు 1967ను సంప్రదించవచ్చన్నారు. దళారులను ఆశ్రయించి మద్దతు ధర కన్నా తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారానే తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

కోటి సంతకాల పేరుతో డ్రామా

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య కళాశాలల పిపిపి విధానంపై ప్రజా మద్దతు లభించకపోవడంతో, రాజకీయ ఉనికి కోసం వైపిసి అధినేత వైఎస్ జగన్ కోటి సంతకాల డ్రామా ఆడుతున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. ప్రజారోగ్యాన్ని, విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని 10 వైద్య కళాశాలలను పిపిపి విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయిస్తే, ప్రైవేటుపరం చేస్తున్నారని జగన్ ప్రచారం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో పిపిపి విధానం పెను విప్లవాన్ని సృష్టించబోతుందని పేర్కొన్నారు. సంపద సృష్టికి పిపిపి విధానాన్ని ఒక సాధనంగా వాడుకోవడంలో ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. నీతి ఆయోగ్ ఈ విధానాన్ని అమలు చేయడంలో తప్పులేదని స్పష్టం చేసిందన్నారు. రక్షణ రంగంలోనూ పిపిపి విధానంలో పలు ప్రాజెక్టులు చేపడుతున్నట్లు తెలిపారు. 10 వైద్య కళాశాలలపై యాజమాన్య హక్కులు ప్రభుత్వం వద్దనే ఉంటాయన్నారు.



తాళ్లరేవులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధి కార్మికులు,



విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం వెంకునాయుడు బంద వద్ద బిల్లు ప్రతులను దగ్ధం చేస్తున్న ఉపాధి కూలీలు

'ఉపాధి' నిర్వీర్యంపై నిరసనాగ్రహం

- బిల్లు ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి- తాళ్లరేవు (కాకినాడ జిల్లా), శృంగవరపుకోట (విజయనగరం జిల్లా)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) పేరును వికసిత భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) మారుస్తూ పార్లమెంటులో కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై ఉపాధి కార్మికుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. మంగళవారం ఈ బిల్లు ప్రతులను దగ్ధం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కాకినాడ జిల్లా తాళ్లరేవులో ప్రజా సంఘాల భవనం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో 20 కోట్ల మంది గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెట్టడానికి తెచ్చిన ఉపాధి చట్టం పీకనులమడానికి కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కొత్త బిల్లు తెచ్చిందన్నారు. 200 ఏళ్ల బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహాత్మా గాంధీ పేరును తీసేసి గాంధీని చంపిన గాడ్సే పేరును పెట్టడానికి బిజెపి ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. వామపక్షాల కృషి, అనేక ఉద్యమాలు ఫలితంగా వచ్చిన ఉపాధి చట్టాన్ని నీరుగార్చినా, చట్టాన్ని రద్దు చేసినా రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఆయా ప్రభుత్వాలకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఈ బిల్లుకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో టిడిపి, జనసేన, వైసిపి ఓటు వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కోటి మంది వ్యవసాయ కార్మికుల పక్షాన ఉంటారా? మతోన్మాద బిజెపి వైపు ఉంటారా? అనేది ఆ పార్టీలు తేల్చుకోవాలన్నారు.

విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం వెంకునాయుడు బంద వద్ద నిరసన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు చట్టంలో అనేక మార్పులు చేస్తూ వచ్చిందన్నారు. రెండు పూటలా పని పెట్టడం, నెలల తరబడి కూలి చెల్లించకుండా కాలయాపన చేయడం, ఫేస్ యాప్ పెట్టడం, పనిముట్లకు చెల్లించే అలవెన్సులకు కోతపెట్టడం వంటి నిబంధనలు తెచ్చిందన్నారు. ఉపాధి హామీ చట్టానికి ఏడాదికి 2.50 లక్షల కోట్లు కేయించాల్సి ఉండగా, రూ.80 వేల కోట్లు మాత్రమే కేటాయిస్తోందన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులు తగ్గించేందుకు కార్యాచరణ

- ఏడాదిలోగా డిజిటల్ హెల్త్ రికార్డులు
- డబ్ల్యుహెచ్ఓ నిర్దేశిత అంశాలు అమలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజారోగ్య పరిరక్షణకు మెరుగైన సేవలు అందించేందుకు అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించుకోవడంతోపాటు, ప్రజలపై వైద్య ఖర్చుల భారాన్ని తగ్గేలా కార్యాచారణ రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్య శాఖపై సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వైద్యారోగ్య రంగంలోని నిపుణులతో కూడిన 10 మంది సభ్యుల బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. వైద్యారోగ్య రంగంలో వివిధ ప్రమాణాలను అందుకునేలా డబ్ల్యుహెచ్ఓ వంటి సంస్థల నిర్దేశిత అంశాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను సంజీవిని ప్రాజెక్టు ద్వారా రూపొందిస్తున్నామని, గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పంలో డిజిటల్ సర్వే సెంటర్ ద్వారా ఈ వివరాలను సేకరించి ఇంటిగ్రేట్ చేశామని తెలిపారు. రియల్ టైమ్‌లోనే వారి వివరాలు తెలుసుకునేలా సంజీవిని ప్రాజెక్టు పని చేస్తుందని, వివిధ అంశాల్లో ప్రజలకు సంబంధించిన ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రాజెక్టును అమలు చేస్తామని చెప్పారు. 2047 స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం యోగాతోపాటు నేచురోపతిని ప్రోత్సహించాల్సి ఉందన్నారు. ప్రివెంటివ్ వెల్ సెస్, హెల్త్ ఫైనాన్సింగ్ రిఫార్మ్స్ వంటి కీలకమైన అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్రంలో మెడ్ టెక్ పార్కు ద్వారా అధునాతన వైద్య పరికరాలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఏడాదిలోగా ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను సిద్ధం చేస్తామన్నారు. స్క్రీనింగ్‌లో టాప్ 10లో ఉన్న రోగాలను గుర్తించి విశ్లేషించేందుకు ప్రయతిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల గిరిజన ప్రాంతాల్లో విద్యార్థుల వ్యక్తిగత శుభ్రతను నేర్చేలా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ సందర్భంగా వర్చువల్‌గా పాల్గొన్న నిపుణుల బృందంతోనూ ముఖ్యమంత్రి మాట్లాడారు. వైద్యారోగ్య రంగంలో వైద్యులు, నర్సులు అందుబాటులో ఉండటం ఎంత ముఖ్యమో, పౌష్టికాహారం అనేది ముఖ్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ సీనియర్ శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్ తెలిపారు. వాయు, జల, భూ కాలుష్యాలతో ప్రజారోగ్యం ఇబ్బందుల్లో పడుతుందన్నారు.

కారణాలను అన్వేషిస్తే ముందుగానే రోగాల బారిన పడకుండా నియంత్రణ చర్యలు చేపట్టొచ్చని మాజీ ఐఎఎస్ అర్తీ అహుజా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా యువతలో డయాలసిస్ పేషెంట్లు పెరుగుతున్నారని, దీనికి కాలుష్యమే ప్రధాన కారణమన్నారు. ఈ సందర్భంగా కమిటీలోని ఇతర సభ్యులు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో గ్లోబల్ స్థాయి ప్రమాణాలతో వైద్యారోగ్య నిపుణులు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి గేట్స్ ఫౌండేషన్ పని చేస్తోందని, ఆ సంస్థ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ వెల్లడించారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం హెల్త్ సెక్రటేరియట్ ఏర్పాటుచేసుకుని పర్యవేక్షించేలా కార్యాచరణ రూపొందిస్తామని ఆమె స్పష్టం చేశారు. వైద్యారోగ్య రంగాన్ని మరింత విప్లవాత్మకంగా మార్చేందుకు అవసరమైన సూచనలను నిపుణుల బృందం చేసిందని, వారి సిఫార్సులు హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధనకు ఉపకరిస్తుందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. నిపుణుల సలహాలను మరింత లోతుగా చర్చించి వాటిని రాష్ట్రంలో అమలు చేస్తామని చెప్పారు. ఇకపై ఏడాదిలో రెండు పర్యాయాలు నిపుణుల బృందంతో భేటీ కావాలని ముఖ్యమంత్రి సూచించారు. నిపుణులు ఇచ్చిన సలహాలను, సూచనలను క్రోడీకరించి యాక్షన్ ప్లాన్ తయారుచేసే బాధ్యతను గేట్ ఫౌండేషన్ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్‌కు సిఎం అప్పగించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్ పూర్వ నాయకులు సాంబశివరావు మృతి

ప్రజాశక్తి-గుంటూరు



పోస్టల్ అండ్ టెలికం డిపార్ట్‌మెంట్ (పిఎటి), బిఎస్‌ఎన్‌ఎల్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో యూనియన్ నాయకులుగా పనిచేసిన వెల్లలచెరువు సాంబశివరావు (81) మంగళవారం హైదరాబాద్‌లో మరణించారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుదీర్ఘకాలంపాటు గుంటూరులోని పిఎటిలో, బిఎస్‌ఎన్‌ఎల్‌లో ఉద్యోగిగా ఆయన ఉన్నారు. సిఐటియు జిల్లా కోశాధికారిగా, ఆడిట్ కమిటీ బాధ్యులుగా పనిచేశారు. గత కొంతకాలంగా హైదరాబాద్‌లో ఆయన తన కుమారుడు టివి-9 మేనేజింగ్ ఎడిటర్ రజనీకాంత్ వద్ద ఉంటున్నారు. సాంబశివరావు మృతికి సిపిఎం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సాంబశివరావు మంచి వ్యక్తిత్వం కలవారని, ఉపన్యాసకులు అని, గుంటూరులో ప్రజాతంత్ర ఉద్యమం విస్తరణకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. సాంబశివరావు భౌతికకాయాన్ని గుంటూరు టెలికం నగర్ ఏడవ లైన్‌లోని ఆయన స్వగృహంలో ఉంచారు. బుధవారం ఉదయం కొరిటపాడు మహాప్రస్థానంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉధృత పోరాటం

- పలు జిల్లాల్లో పిఎసిఎస్ ఉద్యోగుల ఆందోళన
- ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త సమ్మె : సంఘాల హెచ్చరిక

ప్రజాశక్తి - యంత్రాంగం



కశింకోటలోని జిల్లా సహకార అధికారి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పిఎసిఎస్ ఉద్యోగులు

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పిఎసిఎస్ ఉద్యోగులు మంగళవారం పలు జిల్లాల్లో ధర్నాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సమాఖ్య (ఎపిపిఎసిఎస్) ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆయా కార్యాలయాలు, కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు చేశారు. జిఒ నెంబరు 36ను వెంటనే అమలు చేసి డిఎల్‌ఎస్ఎస్ ఏర్పాటుతో జీతభత్యాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులకు ఐదేళ్లకొకసారి వేతన సవరణ చేయవలసి ఉండగా 2019, 2024లో చేయలేదని, వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేయాలని, అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని కోరారు. అనంతరం అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందజేశారు.

శ్రీకాకుళంలో జిల్లా సహకార అధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పి.తేజేశ్వరరావు, పిఎసిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గిరిబుచ్చి రంగనాథ్ మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా సహకార అధికారి బి.మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కాకినాడ జిల్లా సహకార కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ నెల 22న డిసిసిబి వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఆదినారాయణ పిలుపునిచ్చారు. కర్నూలు కలెక్టరేట్ నుంచి ధర్నా చౌక్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. నంద్యాలలో జిల్లా సహకార సంస్థ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. జిల్లాలోని అన్ని సహకార సంఘాల నుంచి ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా జిల్లా సహకార సంఘం అధికారి మురళీకృష్ణకు యూనియన్ నేతలు, ఉద్యోగులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర నాయకులు కె.రాజా రామ్మోహన్‌రాయ్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణశాస్త్రి, కోశాధికారి ఇ.పెద్దిరాజు, జిల్లా కన్వీనర్ పి.నరసింహరాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమస్యల పరిష్కారానికి ముందుకు రాకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు సిద్ధం కావాలని నేతలు పిలుపునిచ్చారు. దీనిపై స్పందించిన మురళీకృష్ణ మాట్లాడుతూ సమస్యలను పైఅధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఉద్యోగులు ధర్నా విరమించారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ సహకార రంగంలో రైతులకు, ప్రజలకు సేవలందిస్తున్న సహకార సంఘం ఉద్యోగుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు తక్షణం అమలు చేయాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎఐటియుసి నాయకులు శ్రీనివాస్ డాంగే మాట్లాడారు. అనంతరం జిల్లా సహకార శాఖ అధికారి అరిమిల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. యూనియన్ నాయకులు పి.కామేశ్వరరావు, రామానాయుడు, నారాయణరావు మాట్లాడారు. అనకాపల్లి జిల్లా, కశింకోటలోని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి కార్యాలయం వద్ద పిఎసిఎస్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మద్దతు తెలిపి మాట్లాడారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని జిల్లా సహకార అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగస్తుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుప్పం రెడ్డిబాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సి.వి.సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు.

పరకామణిలో ఎఐ వినియోగించండి : టిటిడికి హైకోర్టు సూచన

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల పరకామణిలో దొంగతనాలను నివారించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వంటి సాంకేతికతను అందిపుచ్చుకోవాలని హైకోర్టు సూచించింది. పరకామణిలో దొంగతనాలు పూర్తిగా కట్టడి చేసేందుకు ఎఐ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొంది. పరకామణిలో దొంగతనాలను నివారించేందుకు సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పింది.

పరకామణిలో గతంలో కూడా చోరీలు జరిగాయని, స్వామి వారికి ఎంతో మంది కానుకలు సమర్పిస్తుంటారని, వాటిని రక్షించడం ద్వారా యాత్రికుల మనోభావాలను కాపాడాల్సిన అవసరం ఉందని చెప్పింది. కానుకల లెక్కింపు ప్రక్రియలో మానవ ప్రమేయం లేకుండా సాంకేతికతను అందిపుచ్చుకోవాలంది. పరకామణిలో కానుకల లెక్కింపునకు యంత్రాలను ఉపయోగించేందుకు వీలుగా ఎఐను వాడుకలోకి తేవాలని టిటిడికి సూచించింది. స్వామి వారి కానుకల లెక్కింపునకు వచ్చే యాత్రికులను డ్రాయర్లతో తనిఖీలు నిర్వహించడం సరికాదని, జుగుప్సాకరమైన ఈ చర్య యాత్రికులను అవమానించడమేనని అభిప్రాయపడింది. కానుకల లెక్కింపు సేవలకు వచ్చే యాత్రికులను దొంగల్లా అనుమానించడం సరికాదని వ్యాఖ్యానించింది. టిటిడిలో శాశ్వత ఉద్యోగులుంటే పరిస్థితులు అదుపులో ఉంటాయని అవుట్‌సోర్సింగ్ స్టాఫ్ నియామకం వల్ల కూడా ఇబ్బందులు ఉన్నాయని అభిప్రాయపడింది. మానవ వనరులను తగ్గించి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచితేనే పరకామణిలో నేరాల సంఖ్య అనూహ్యంగా తగ్గుతుందని చెప్పింది. పరకామణిలో సంస్కరణలపై ఇరుపక్షాలు తగిన సూచనలు చేయాలని ఆదేశించింది.

'ఉపాధి'కి గాంధీ పేరు మార్పు తగదు

- ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించాలనుకోవడం దేశ ద్రోహ చర్యగా ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల అభివర్ణించారు. ఇది గాంధీకి బిజెపి ప్రభుత్వం చేస్తున్న తీరని ద్రోహమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పథకానికి రామ్ జి (రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్) పేరు పెట్టి గాంధీని అవమానించాలని కుట్ర చేస్తున్నారన్నారు. ఈ పథకాన్ని ఆర్ఎస్ఎస్ స్కీమ్‌గా మార్పు చేస్తున్నారని చెప్పారు. ఈ చర్యకు పాల్పడిన ప్రధాని మోడీ అభినవ గాడ్సే అని అభివర్ణించారు. ఉపాధి హామీ పథకానికి ఉన్నపళంగా పేరు మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. 100 రోజుల పని దినాల నుంచి 125 పెంపునకు గాంధీజీ పేరు మారుస్తారా? అని ప్రశ్నించారు. కేంద్రం చేస్తున్న ఈ యత్నాలను తిప్పికొట్టాలని కోరారు. రాష్ట్ర ఎంపిలందరూ ఈ బిల్లును వ్యతిరేకించాలని సూచించారు.

ఉపాధి హామీ చట్టం రద్దుకు కుట్ర : సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ చట్టం రద్దుకు కేంద్రం కుట్ర చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు వెల్లడించారు. ఉపాధి హామీ చట్టం పేరు మారుస్తూ.. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపునివ్వనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ చట్టానికి జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించడం విద్రోహ చర్యగా అభివర్ణించారు. చట్టాన్ని ఎత్తేసి పథకంగా మార్చడం ప్రజలకు పనిచేసే హక్కును తిరస్కరించడమేనన్నారు.

సీడ్ యాక్సెస్ రోడ్డులో స్టీలు బ్రిడ్జి తాత్కాలికమే

- సిడిఓ అనుమతి లేని కొండవీటివాగు పంపింగ్‌స్టేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని నిర్మాణంలో భాగంగా 16వ నెంబరు జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న సీడ్ యాక్సెస్‌రోడ్డులో కృష్ణాపశ్చిమకెనాల్‌పై సీతానగరం వద్ద నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి తాత్కాలికమేనని అధికారులు నివేదిక ఇచ్చారు. దీనిపై డ్రాఫ్ట్‌ప్లానులోనూ టెంపరరీ(తాత్కాలిక) వంతెనగా పేర్కొన్నారు. మొత్తం సీడ్ యాక్సెస్‌రోడ్డు పూర్తయ్యేంత వరకూ దీన్ని వినియోగిస్తామని సిఆర్‌డిఏ అధికారులు జలవనరులశాఖకు తెలిపినట్లు తెలిసింది. రెండేళ్ల తరువాత తొలగిస్తామని చెప్పినట్ల సమాచారం. దీనికి కూడా సిడిఓ అనుమతి తీసుకోలేదు. అలాగే కొండవీటివాగు నీటిని ఎత్తిపోసేందుకు నిర్మిస్తున్న పంపింగ్‌స్టేషన్‌కూ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ నుండి అనుమతులు తీసుకోలేదని తెలిసింది. వీటికి సంబంధించి ఇటీవల చర్చ జరిగింది. ప్రస్తుతం స్టీలు బ్రిడ్జిని ఉండవల్లి సమీపంలోని పంపింగ్ స్టేషన్ వద్ద ఉన్న కొండవీటివాగు డైవర్షన్ కెనాల్ వంతెన పక్క నుండి కెఎల్‌రావు కాలనీ సమీపంలో పాత జాతీయ రహదారికి అనుసంధానం చేస్తున్నారు. దీనికోసం అక్కడ నివాసాలను కూడా తొలగించారు. కృష్ణానదిలో ఇన్‌లాండ్‌వాటర్‌వేస్ కింద అనుమతి వచ్చిన ప్రాజెక్టులో పశ్చిమకెనాల్ కూడా ఉంది. భవిష్యత్‌లో వాటిపై వంతెనలు, లేదా ఇంకా ఏదైనా నిర్మాణాలు చేపట్టాలనుకుంటే ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అనుమతి అవసరం ఉంటుంది. ప్రస్తుతం స్టీలు బ్రిడ్జికి అటువంటి అనుమతి లేనట్లు తెలిసింది. అయితే జలవనరులశాఖ నుండి అనుమతి అంశాన్ని పక్కనబెట్టి తాము తాత్కాలిక వంతెన నిర్మిస్తున్నామని నిర్మాణ సంస్థ ఎన్‌సిసి ప్రతినిధులు స్పష్టం చేశారు. తక్కువ ఎత్తులో నిర్మించడం వల్ల ఇబ్బంది వస్తుందని చెప్పగా అటువంటిదేమీ లేకుండా తాము చూసుకుంటామని హామీఇచ్చారు. కనీసం వంతెన నిర్మాణ సమయంలో కాలువలో పడిన మట్టినన్నా తొలగించేలా చూడాలని జలవనరులశాఖ అధికారులు కాంట్రాక్టు కంపెనీని కోరారు. అలాగే కొండవీటివాగు ఎత్తిపోతలకు సంబంధించి కూడా సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ నుండి అనుమతులు తీసుకోలేదని తెలిసింది. వాస్తవంగా ముంపు నీటిని ఎత్తిపోసే సమయంలో ఎంత నీరు వస్తుంది, కృష్ణానదిలోకి వరద వచ్చే సమయంలో ఇటువైపు నీటిని ఎత్తిపోయడం సాధ్యమవుతుందా ఒకవేళ ఎత్తిపోస్తే ఎన్ని క్యూసెక్కులు, దీనివల్ల అదనపు ఇబ్బంది ఏమైనా వస్తుందా అనే అంశాలపై అధ్యయనం చేసి సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ ఒక నివేదిక ఇచ్చి దాని ప్రకారం ప్లానుకు అనుమతి ఇస్తుంది. ఇప్పటి వరకూ దీన్ని నిర్మిస్తున్న అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ దీనికి సంబంధించి అనుమతులు ఇంకా తీసుకోలేదని తెలిసింది. కరకట్ట విస్తరణ, కొండవీటివాగు స్లూయిస్ నిర్మాణాలకు సంబంధించిన సమగ్రప్లానును కాంట్రాక్టు సంస్థ తీసుకుంది. జలవనరులశాఖ నిబంధనల ప్రకారం తాము స్లూయిస్ గేట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అంతకుముందు మెగా సంస్థ ఆధ్వర్యాన నిర్మించిన తొలి పంపింగ్ స్టేషన్‌కు సిడిఓ అనుమతి తీసుకున్నారు.



సైకిల్ యాత్రలో పాల్గొన్న డిఐజి, కలెక్టర్, ఎమ్మెల్యేలు తదితరులు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

- యువతకు డిఐజి గోపినాథ్ జట్టి పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి పిలుపునిచ్చారు. గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా పాయకరావుపేటలో ప్రారంభించిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర' సోమవారం శ్రీకాకుళం నగరానికి చేరింది. నగరంలోని రామలక్ష్మణ జంక్షన్ నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్, బగ్గు రమణమూర్తి సైకిల్ తొక్కుతూ యాత్రలో భాగస్వామ్యమయ్యారు. సూర్యమహల్ కూడలి, జి.టి రోడ్డు, ఏడు రోడ్ల కూడలి మీదుగా ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో డిఐజి మాట్లాడుతూ... మత్తు పదార్థాల నియంత్రణకు పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతున్నామన్నారు. గతేడాది కాలంలో విశాఖ రేంజ్ పరిధిలో సంకల్పం మిషన్, కమ్యూనిటీ ఔట్రీచ్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 21,206 అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. గంజాయి నిర్మూలనకు కొత్త కోణంలో చేపట్టిన అభ్యుదయం సైకిల్ యాత్ర 35 రోజులుగా విజయవంతంగా కొనసాగుతోందన్నారు.

సహకార స్ఫూర్తిని దెబ్బతీస్తున్న కేంద్రం

- ఎపిఎస్‌సియుబి అండ్ సిఎస్‌ఎఫ్‌ఎల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


సహకార అర్బన్ బ్యాంకుల్లో డైరెక్టర్ల నియామకానికి అర్హతలను విధిస్తూ.. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నిబంధనలు సహకార స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ అధ్యక్షులు చిట్టూరి రవీంద్ర తెలిపారు. విజయవాడలోని గాంధీనగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 44 సహకార అర్బన్ బ్యాంకులు పనిచేస్తున్నాయని, ఇవి ఆర్‌బిఐ ఆదేశించిన అన్ని నిబంధనలు పాటిస్తూ ఖాతాదారులకు సేవలందిస్తున్నాయని తెలిపారు. సామాన్య ప్రజలకు రుణాలు, డిపాజిట్లు చేసేందుకు అందుబాటులో ఉండే సహకార అర్బన్ బ్యాంకుల పాలకవర్గాల విషయంలో ఆర్‌బిఐ జోక్యం తగదన్నారు. ఇది రాష్ట్ర పరిధిలో ఉన్న అంశమని తెలిపారు. సిఇఒల నియామకం, డైరెక్టర్లకు అర్హతలు, పదవీకాలం పరిమితి విధించడం వంటి అంశాలపై కేంద్రం తీరును తప్పుబట్టారు. మంగళవారం నిర్వహించిన ఫెడరేషన్ సమావేశంలో ఈ అంశాలపై చర్చించామన్నారు. ఫెడరేషన్ కార్యదర్శి సిహెచ్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. ఆర్‌బిఐ కంటే దాదాపు 3 దశాబ్దాల ముందు నుంచే రాష్ట్రంలో సహకార అర్బన్ బ్యాంకులు పని చేస్తున్నాయన్నారు. అమలులోకి తెచ్చిన నిబంధనలు సహకార స్ఫూర్తికే విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. సహకార రంగం పూర్తి రాష్ట్రానికి సంబంధించిన అంశం అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ ఆంక్షలు రాజకీయ ప్రేరేపితమైనవిగా పేర్కొన్నారు. ప్రైవేటు బ్యాంకులకు విధించిన విధంగా సహకార బ్యాంకుల పాలకవర్గాలపై పెత్తనం చేయడం సరికాదన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ఈ ఏడాది జరుపుకుంటున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆంక్షలను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు జిలాని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకుల మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకులు మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా గండేపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన ఐదుగురు కారులో విశాఖపట్నం బయలుదేరారు. గండేపల్లి శివారు పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు పక్కన ఆగివున్న ట్రాలీ లారీని కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తర్లపాటి తులసి (49) అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె కుమారుడు తర్లపాటి శశికుమార్(25) తీవ్రగాయాల పాలయ్యారు. ఆయనను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శశికుమార్ మృతి చెందినట్లు ఎస్ఐ శివనాగు తెలిపారు.

నిమ్మకాయ నుంచి రక్తమా?



'**రా**మూ... ఏంటి ఉదయం నుండి భయం భయంగా చూస్తున్నావు' అని సాయంత్రం క్లాసులోకి వచ్చిన మాస్టారు రామూని అడిగారు. 'ఏమీ లేదు సార్?' అని రామూ చెప్పినా 'లేదు నీ మొఖంలో ఏదో తెలియని ఆందోళన కన్పిస్తోంది. ఏదైనా సమస్య ఉంటే నాకు చెప్పు' అని మాస్టారు ఆప్యాయంగా అడిగారు.

'సార్... మా పక్కింటి అబ్బాయికి వారం రోజుల నుండి జ్వరం వస్తుంది. ఆ అబ్బాయిపైన ఎవరో చేత బడి చేశారట' అని భయం భయంగా చెప్పాడు రాము. 'చేతబడి అని నీకు ఎవరు చెప్పారు రామూ!' అని మాస్టారు అడిగారు. 'మరే సార్.. ఓ రోజు ఒక మంత్రగాడు వచ్చి నిమ్మకాయను కొస్తే రక్తం వచ్చిందంట. రక్తం వచ్చింది కాబట్టి, చేతబడి జరిగిందని ఆయన చెప్పాడట. మా ఇంటి పక్క వాళ్ళ గురించి మా అన్నయ్య చెబుతుంటే విన్నా సార్. అప్పటి నుంచి నాకు భయం వేస్తుంది సార్' అని రాము ఏడుస్తున్న గొంతుతో చెప్పాడు.

'అవునా రామూ.. అయితే నువ్వు అసలు భయపడవద్దు. వాస్తవానికి నిమ్మకాయ నుంచి రక్తం ఏమీ రాదు. సాధారణంగా నిమ్మకాయను కోసినప్పుడు రక్తంలా ఎర్రటి ద్రవం కారుతున్నట్లు చూపిస్తే, అది కేవలం ఒక ప్రదర్శన లేదా ట్రిక్ మాత్రమే. ఈ ట్రిక్‌లో మాంత్రికులు నిమ్మకాయను కోసే కత్తిని ముందుగా పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంలో ముంచుతారు. ఆ కత్తి నిమ్మకాయలోని సిట్రిక్ యాసిడ్‌తో కలిసినప్పుడు రసాయన ప్రతిచర్య జరిగి, ఆ ద్రవం రక్తం రంగులోకి మారుతుంది. అమాయకులని భయపెట్టడానికి కొందరు ఇటువంటి ట్రిక్స్ చేస్తారు. కాబట్టి, సహజంగా ఎర్రగా ఉండే నిమ్మకాయ రంగుకు కారణం ఆంథోసైనిన్స్. కానీ మామూలు నిమ్మకాయలో ఎరుపు రంగు కనిపిస్తే అది రసాయన ట్రిక్ అయి ఉండవచ్చు. భయపడవద్దు' అని రాముకి మాస్టారు చెప్పారు.

- ఎం.రాం ప్రదీప్,
జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు,
94927 12836.

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న గళ్లల్లో ఉన్న అంకెల ఆధారంగా మీరు లెక్క చేయాలి. నిలువు, అడ్డం వరుసల్లో ఎటువైపు కూడినా సమాధానం 15 రావాలి మరి.

2		6
9	5	
	3	8

All rows and columns should add up to 15.

నేను గీసిన బొమ్మ





ఆకాష్ రామ్,
వేటపాలెం గ్రామం,
ఇంటర్ మొదటి సంవత్సరం,
సెయింట్ ఆన్స్ కాలేజీ, చీరాల.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వివాహ బంధానికి విభేదాల గండం!



నేటి సమాజంలో కుటుంబ సంబంధ బాంధవ్యాలలో అనూహ్యమైన దూరాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా వివాహ బంధాలు విచ్ఛిన్నమై విడాకులకి దారితీస్తున్నాయి. వైవాహిక జీవితాలు ఫలవంతంగా ఉన్నప్పుడే పటిష్టమైన కుటుంబ వ్యవస్థలు ఏర్పడతాయి. ఒక పరిశీలనలో గత పదేళ్లకాలంలో పట్టణీకర ప్రాంతాల్లో విడాకుల కేసుల్లో గణనీయమైన పెరుగుదల కనిపిస్తోంది. వైవాహిక జీవితంలో వైఫల్యాలకు కారణమేమిటి? వీటి మూలాలు ఎక్కడ ఉన్నాయి? వీటికి గల ప్రధాన కారణాలు ఏమిటి? వీటిని సరైన సమయంలో గుర్తించి అధిగమించే అవకాశాలు ఏమిటి? వర్తమాన పరిస్థితులతో పాటు భవిష్యత్తు పరిణామాలను కూడా సరిదిద్దుతూ ఆరోగ్యకరమైన వైవాహిక సంబంధాలు మెరుగుపడాలంటే ఏం చేయాలి?

ప్రస్తుత సామాజిక పరిస్థితులు గతం కంటే చాలా భిన్నంగా నడుస్తున్నాయి. సంసార బాధ్యతలను పరస్పర అవగాహనలతో నిర్వహించాల్సిన భార్యాభర్తల్లో తలెత్తిన చిన్నచిన్న అవగాహన లోపాలు వైవాహిక జీవితాన్ని బీటలు వారిస్తున్నాయి.


వైరుధ్యాలకు కారణాలు

- స్వల్ప విషయాలలో సర్దుబాట్లు కొరవడి భావోద్వేగాలకు లోనుకావటం.
- కుటుంబ పాలనలో సమాన భాగస్వామ్యాలు కొరవడటం.
- ఉద్యోగ పని భారాలతో పెరిగే ఒత్తిళ్లు, చికాకులు.
- ఇరువైపులా తల్లిదండ్రుల పాలనా పోషణల విషయంలో భేదాభిప్రాయాలు.
- ఆర్థికపరమైన భారాలు, పెరుగుతున్న ఖర్చులు, పెరగని ఆదాయాలు వలన కలిగే నిరాశ, నిస్పృహలు.
- పిల్లల పెంపకం బాధ్యతలలో సరైన భాగస్వామ్య ప్రాధాన్యతలు లేకపోవటం.
- ఒకరి సమస్యలు ఒకరు పరస్పర అవగాహనతో ఆత్మీయతతో అర్థం చేసుకోలేకపోవడం.
- కుటుంబ పాలనా బాధ్యతలలో మన అనే భావన కంటే నేనే అని ఆధిపత్యపు భావనలు పెరగటం.
- ం చక్కటి భావనలు పంచుకోవటం కంటే కూడా టీవీ, మొబైల్స్, చాటింగ్స్ వగైరాలకు ప్రాధాన్యతలు పెరగటం.
- వ్యక్తిగత స్వేచ్ఛ, ఆర్థిక స్వేచ్ఛలకే ప్రాధాన్యతలు ఇవ్వడం.

గట్టి పునాదులు ఎలా వేయాలి?

- సోషల్ మీడియా మాధ్యమాల పరిచయాలు, ప్రేమలు, పరిణయాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.
- భావోద్వేగాలకు లోనుకాకుండా ఖచ్చితమైన సమాచారాలు, విచారణల ద్వారా మాత్రమే వివాహాలను ఖరారు చేయాలి.
- వివాహ పరిచయ వేదికలపై వైవాహిక సంబంధాల ఆవశ్యకతని పటిష్టత గురించి తప్పనిసరిగా వివరించాలి. ప్రతి ఒక్కరిలో అవగాహన పెంచాలి.
- వివాహానికి ముందుగా ఇరువైపుల పెద్దలు ఆర్థిక వ్యవహారాలు బాధ్యతల గురించి చర్చిస్తూ వధూవరులలో అవగాహన పెంచాలి.
- కుటుంబ పాలన, పోషణ పట్ల పెద్దలు తమ అనుభవాల ద్వారా వధూవరులకు అవగాహన పెంచాలి.
- మారుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పెద్దలు భవిష్యత్‌లో పుట్టబోయే పిల్లల పెంపకాల బాధ్యతల గురించి కాబోయే జంటలకు స్పష్టమైన భాగస్వామ్య బాధ్యతలను నిర్దేశించాలి
- వివాహ సంబంధ బాంధవ్యాలు, పెళ్లినాటి ప్రమాణాల కట్టుబడి విషయంలో ఇరువైపుల పెద్దలు వధూవరుల సంబంధాల పటిష్టతకు కృషి చేయాలి.
- కాబోయే జంటలకు ఆర్థిక వ్యవహారాలపై తమ స్థాయిలకు తగ్గ విధివిధానాల నిర్దేశం జరపాలి.
- ఇరువైపులా పెద్దలు తమ పిల్లలతో అవసరమైన మేరకే మొబైల్ సంభాషణలను జరపడం శ్రేయస్కరం.
- కొత్తజంటలలో ఏర్పడే చిన్న చిన్న స్పర్థలు లేదా సర్దుబాట్లు కొరవడిన సందర్భాల్లో ఇరువైపులా పెద్దలు సంయమనంతో పరిష్కరించే ప్రయత్నాలు జరపాలి.
- వివాహానికి ముందే కొత్త జంటల మధ్య వారి వారి అభిరుచులు, అలవాట్లు కుటుంబపరమైన బరువు బాధ్యతలు, సాంప్రదాయాల విషయాలపై అవగాహన కల్పించాలి.
- వ్యక్తి స్వేచ్ఛ, ఆర్థిక స్వేచ్ఛ వైవాహిక జీవిత సాఫల్యానికి ఆలంబన అనే విషయాన్ని భార్యాభర్తలు ప్రతిక్షణం గమనంలో ఉంచుకోవాలి.
- వివాహానికి ముందే వివాహ విశిష్టత సంసార బరువు బాధ్యతలు, భవిష్యత్తులో ఎదుర్కోబోయే సమస్యల పట్ల కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలి.

వివాహం అనేది స్త్రీ, పురుషుని కలయిక మాత్రమే కాదు. తరతరాలుగా సాగాల్సిన కుటుంబ వారసత్వాలకు, బలమైన సామాజిక వ్యవస్థలకు పునాది. ఈ స్పష్టమైన అవగాహన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలి. చక్కటి సంయమనం, అవగాహనలతో ఈనాటి తరం భార్యాభర్తలు, కాబోయే కొత్త జంటలు అడుగులు వేయాలి.



- అమరనాథ్ జగర్లపూడి
కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, కార్పొరేట్ ట్రైనర్
98495 45257.

మడమల పగుళ్లా.. ఇలా నివారించొచ్చు!

ఈ రోజుల్లో చాలా మంది పగిలిన మడమలతో అనేక అవస్థలు పడుతుంటారు. పోషకాహార లోపాల వల్ల కూడా ఇలా జరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. శరీరం పొడిబారడం లేదా పోషకాహార లోపం కారణంగా ముందుగా వాటి ప్రభావాలు పాదాలు, మడమలపై కనిపిస్తాయని అంటున్నారు.

విటమిన్ సి, విటమిన్ బి3 లోపం కారణంగా చర్మం బలహీనపడుతుంది. చర్మానికి సరైన పోషకాహారం లేనప్పుడు, పగుళ్ల రావడం ప్రారంభమవుతుంది. ఈ సమస్యను నివారించడాకి ఆహారంలో ఉసిరి, నిమ్మ, నారింజ, ఆకుపచ్చ కూరగాయలు, అలాగే తృణధాన్యాలను చేర్చుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

- ప్రతి రాత్రి కొబ్బరి నూనెను కొద్దిగా వేడిచేసి మడమలకు పూయడం వల్ల ఉపశమనం ఉంటుంది.
- గోరువెచ్చని నీటిలో కొద్దిగా రాక్ సాల్ట్ కలిపి అందులో కాసేపు పాదాలు నానబెట్టడం వల్ల చర్మం మృదువుగా మారి పగుళ్ల రాకుండా ఉంటాయి.
- పగుళ్లపై తేనె రాయడం వల్ల నొప్పి తగ్గుతుంది. అలాగే పండిన అరటిపండును మెత్తగా చేసి మడమలకు పూయడం వల్ల సహజ తేమ లభిస్తుంది.
- బియ్యం పిండి, తేనెతో సున్నితంగా పగిలిన మడమలకు స్క్రబ్ చేయడం వల్ల కూడా ఈ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.

రంగవల్లులకు స్వాగతం!

సంక్రాంతి పండుగ హడావిడిలో ముగ్గులది ప్రత్యేక స్థానం. మరి ఇంకెందుకు ఆలస్యం? చకచకా ముగ్గులు వేసేయండి. 'జీవన' పాఠకులతో పంచుకోండి. తెల్ల కాగితంపై పెన్సిల్ లేదా బాల్‌పాయింట్ పెన్నుతో వేసిన ముగ్గులకు రంగులు నింపి పంపండి. అందరికీ అర్థమయ్యేలా నిలువు, అడ్డం చుక్కల వివరాలు కూడా పేర్కొనండి. మీ పేరు, చిరునామా, ఫొటో, ఫోన్ నెంబరు కచ్చితంగా పంపాలి. మెయిల్ ద్వారా పంపేవారు పూర్తి చిరునామా పంపాలి.

మా చిరునామా
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక, ప్రజాశక్తి భవనం, అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com, **వాట్సాప్ : 83329 25496**

అలరించిన శ్రామిక సాంస్కృతిక ఉత్సవాలు

- కార్మిక వర్గ చైతన్యాన్ని పట్టిచూపిన నాటికలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

కార్మిక వర్గంలో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని రగిలించే లక్ష్యంతో సిఐటియు మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన శ్రామిక సాంస్కృతిక ఉత్సవాలు జరిగాయి. ఈ నెల 31 నుంచి జనవరి నాలుగు వరకూ విశాఖలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభను పురస్కరించుకుని వీటిని ఏర్పాటు చేశారు. మహాసభ జయప్రదం కోరుతూ కళాభారతి రోడ్డులో నిర్వహించిన ఈ కళా ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. 110 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో అలరించారు. అభ్యుదయ గీతాలు, దేశభక్తియుత డ్యాన్సులు, సామాజిక చైతన్యాన్ని కలిగించే నాటికలు ఉత్తేజం నింపాయి. మహిళా చైతన్యాన్ని ప్రతిబింబించే నృత్యాలతో శ్రామిక మహిళలు ఆకట్టుకున్నారు. సిఐటియు జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సీతారత్నం సంధానకర్తగా వ్యవహరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఉపాధ్యక్షులు పి.మణి, నాయకులు కృష్ణారావు మాట్లాడారు. కార్మిక వర్గంలో సమగ్ర చైతన్యాన్ని తీసుకురావడమే ఉత్సవాల లక్ష్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. తక్షణమే లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, ఎన్‌వి.రమణ, చలపతి, డాక్టర్ కె.రమాప్రభ, కుమారి పాల్గొన్నారు. విశాఖ నగరంలోని గాజువాక పరిధి తోకాడ సమైఖ్య అపార్ట్‌మెంట్ వద్ద, స్టీల్ ప్లాంట్ బిసి గేటు వద్ద సిఐటియు జెండాలను ఎగురవేశారు. అల్లూరి జిల్లా హుకుంపేట, పాడేరు, విఆర్.పురం మండలాల్లో నిర్వహించిన పతాకావిష్కరణ కార్యక్రమాల్లో కార్మికులు పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లాలోని మునగపాకలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చీడికాడలో ఆశా వర్కర్లు జెండాలు ఎగురవేశారు. మాకవరపాలెంలో ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తూ ప్రచారం చేపట్టారు. ప్రకాశం, నంద్యాల జిల్లాలో సంఘం జెండాలను ఆవిష్కరించారు.



సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

తిరుపతిలో 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్

- వంద ఎకరాల్లో దివ్య వృక్షాల పెంపకం
- పాలక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

ప్రజాశక్తి- తిరుమల

తిరుపతిలో 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మించాలని టిటిడి పాలక మండలి తీర్మానించింది. ప్లానింగ్ కోసం ఆర్కిటెక్ నియామకం చేపట్టాలని, ఎస్‌వి జూనియర్ కళాశాల, ఎస్‌పిడబ్ల్యు జూనియర్ కళాశాలలో చదివే డే స్కాలర్లకు మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయించింది. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం టిటిడి చైర్మన్ బిఆర్.నాయుడు అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ వివరాలను మీడియాకు బిఆర్ నాయుడు వెల్లడించారు. టిటిడి బోర్డు నియమించిన విద్యాశాఖ సబ్ కమిటీ నివేదిక ఆధారంగా టిటిడిలోని 31 విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆయా విద్యాసంస్థల్లో సిసి కెమెరాలు, కంప్యూటర్లు, వీటికి అవసరమైన సాఫ్ట్‌వేర్‌ల ఏర్పాటుతో పాటుగా అవసరమైన సిబ్బంది, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కాలేజీలో ప్రస్తుతం ఉన్న 2100 హాస్టల్ సీట్లకు అదనంగా మరో 270 హాస్టల్ సీట్లు పెంచాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. టిటిడి అనుబంధ ఆలయాలలో పని చేస్తున్న 62 మంది అర్చక, పరిచారక, పోటు వర్కర్లు, ప్రసాదం డిస్ట్రిబ్యూటర్లకు వేతనాల పెంపు, టిటిడి ఇంజనీరింగ్ విభాగంలో నాలుగు కేటగిరిలలో ఖాళీగా ఉన్న 60 పోస్టులకు ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా త్వరలో భర్తీ చేసేందుకు, టిటిడి ఆలయాలకు ధ్వజస్తంభం, రథాలు తయారు చేసేందుకు పలమనేరులో వంద ఎకరాలలో దివ్య వృక్షాలు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించేందుకు అదనంగా రూ.48 కోట్లు మంజూరుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు.



పాలక మండలి సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి చైర్మన్, పక్కన ఇఒ

తిరుమల రహదారులకు శ్రీవారి నామాలతో పేర్లు

తిరుమల రహదారులకు సంబంధించి టిటిడి మరోకీలక నిర్ణయం తీసుకుంది. తిరుమలలోని రహదారులు, ప్రధాన కూడళ్లకు శ్రీవారి నామాల పేర్లను పెట్టాలని నిర్ణయించింది. వైష్ణవ పురాణాలు, ఆళ్వార్లు, అన్నమాచార్య సంకీర్తనలలో ఉన్న శ్రీవారి నామాలతో వీటికి నామకరణం చేయాలని, ఇందుకోసం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ చక్రవర్తి రంగనాథన్, అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి మేడసాని మోహన్, పురాణ ఇతిహాస ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ప్రభాకర్ కృషమూర్తిలతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. సమావేశంలో ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, ఎఇఒ సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

20.95 కేజీల గంజాయి స్వాధీనం

నలుగురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - నెల్లూరు

ఒడిశా నుంచి గంజాయి అక్రమంగా కొని తెచ్చి అమ్ముతున్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సంతపేట పోలీసులకు పక్కా సమాచారం అందడంతో చాకచక్యంగా నిందితులను మంగళవారం అదుపులోకి తీసుకుని, వారి నుంచి 20.95 కేజీల గంజాయి, రూ.5600లు నగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.6,28,500లు ఉంటుందని తెలిపారు. నిందితులు షేక్ ముంతాజ్, షేక్ సిరాజ్, షేక్ సుభాని, షేక్ జమీర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నామని, మరొక నిందితుడు షేక్ పాషురు పారిపోయాడని పోలీసులు తెలిపారు.

ముద్దాయిలను చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి గంజాయిని స్వాధీనం చేసుకున్న సంతపేట సిఐ వైవి.సోమయ్యను, ఎస్‌ఐ జి.బాలకృష్ణ, ఎఎస్‌ఐ జి.శ్రీహరి, హెడ్ కానిస్టేబుల్స్ సుబ్బారావు, ప్రసాద్, కానిస్టేబుల్స్ అల్లాబక్షు, గోపీ, కెవి.సుదర్శన్ గౌడ్, మహిళా కానిస్టేబుల్స్ పద్మప్రియ, కుమార్‌లను టౌన్ ఇన్‌ఛార్జ్ డిఎస్‌పి ఎం.గిరిధర్‌రావు అభినందించారు.

22న క్రిస్మస్ హై టీ

- మంత్రి ఫరూక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన క్రిస్మస్ హై టీ కార్యక్రమాన్ని ఈ నెల 22న నిర్వహించనున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్‌ఎమ్‌డి ఫరూక్ తెలిపారు. తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో హై టీ ఏర్పాట్లపై మంత్రి సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయవాడలోని ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే ఈ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటారని తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎమ్‌డి ఎ శేఖర్, మైనార్టీ కార్పొరేషన్ ఎమ్‌డి యాకుబ్ బాషా, వక్ఫ్ బోర్డు సిఇఒ మహ్మద్ అలీ, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ గౌస్ పీర్, మైనార్టీ కమిషన్ కార్యదర్శి నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

విద్వేషం.. హింస...


ఆస్ట్రేలియాలోని సిడ్నీ అత్యంత పాశవిక మారణకాండకు వేదికగా మారడం దిగ్భ్రాంతికరం. యూదులే లక్ష్యంగా తండ్రీ కొడుకులు తుపాకీ గుళ్ల వర్షం కురిపించడంతో పదేళ్ల బాలిక సహా 16 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 40 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా 'హనూకా' వేడుక చేసుకునేందుకు సిడ్నీలోని బొండీ బీచ్‌లో కొవ్వొత్తులు వెలిగించడానికి వచ్చిన చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ దుండగుల కాల్పుల్లో రక్తమోడడం అత్యంత బాధాకరం. మతపరమైన ద్వేషం, జాత్యహంకారం, విద్వేష ఉపన్యాసాలు, మీడియా, సోషల్ మీడియాలో విస్తరిస్తున్న ఉన్మాద భావనలు.. ఇవన్నీ ఇలాంటి దుర్మార్గాలకు ఆజ్యం పోస్తున్నాయి.

విద్వేషం మరింత విద్వేషాన్ని పెంచుతుందే కానీ..శాంతినీ, సామరస్యాన్నీ కలిగించదని గౌతమ బుద్ధుడు దగ్గర నుంచి అన్ని మతాల ప్రవక్తలు ప్రకటిస్తున్నదే! యూదులపై ద్వేషభావం ఆస్ట్రేలియా సమాజాన్ని కలుషితం చేస్తోందని, అక్కడి ప్రభుత్వ విధానాలు ఆ అగ్నికి ఆజ్యం పోస్తున్నాయంటూ... ఈ ఘటన జరిగిన వెంటనే ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ ఊగిపోయారు. చిన్నారులు, మహిళలు అన్న కనికరంగానీ, ఆకలి తీర్చుకునేందుకు క్యూలో నిలబడ్డారన్న ఇంగితం కానీ, ఆసుపత్రిలో కొన ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారన్న జ్ఞానం కానీ లేకుండా అమానుషంగా 70 వేల మందికిపైగా అమాయకులను ఊచకోత కోసిన నెతన్యాహు సర్కారు, దానికి అండదండలిచ్చిన అమెరికా లాంటి పశ్చిమ దేశాలే... ఇలాంటి మారణ హోమాలకు సంజాయిషీ చెప్పాలి. పాలస్తీనాపై నరమేధం తర్వాత ఆస్ట్రేలియాలో యూదు వ్యతిరేక ఘటనలు 316 శాతం పెరగడం, రెండు వేల కంటే ఎక్కువ కేసులు నమోదవడమే ఇందుకు సాక్ష్యం. ప్రాణాలకు తెగించి ఓ దుండగుడి చేతిలోని తుపాకీ లాక్కుని అనేకమంది ప్రాణాలను కాపాడిన అహ్మద్ అల్ అహ్మద్‌కు ప్రపంచమంతా సెల్యూట్ చేస్తోంది. పహల్గాం ఉగ్రదాడి సందర్భంలో టూరిస్టులను కాపాడి, ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా అందరికీ గుర్తొస్తాడు. ఒకరికి ఒకరు వెలుగుగా ఉండాలని, ఐక్యంగా ఉండాలని ఆస్ట్రేలియా ప్రధాని పిలుపునివ్వడం, అహ్మద్‌ను ఆసుపత్రిలో కలిసి అభినందించడం మంచి పరిణామం. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరగడంతో తుపాకీ నియంత్రణ చట్టాలను ఆస్ట్రేలియా అమలు చేస్తోంది. వాటికి మరింత పదును పెట్టడం, దోషులను కఠినంగా శిక్షించడం, సమాజంలో సోదర భావాన్ని పెంపొందించడం అత్యవసరం.

ఒక ఘటన జరగ్గానే ఆ మతానికి చెందిన ప్రతి ఒక్కరినీ ద్వేషంతో చూడటం మొదలు పెడితే సమాజం విడిపోతుంది. మెజారిటీ, మైనారిటీ మతోన్మాదులు కోరుకునేది ఇదే. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌తోపాటు సంఘ్ పరివార్‌లోని విహెచ్‌పి, బజరంగ్‌దళ్ లాంటి సంస్థలు రెచ్చిపోతున్నాయి. మైనారిటీలంతా శత్రువులు, జీహాదీలని, వారిపై దాడులు చేయడం ధర్మ రక్షణ అని, మసీదులు, చర్చిలపై దాడులు చేయడం హీరోయిజం అని యువతను పక్కదోవ పట్టించడం, అందుకోసం అలవోకగా అబద్ధాలను ప్రచారం చేయడం అత్యంత ప్రమాదకరం. గోడీ మీడియాతోపాటు సోషల్ మీడియా కూడా అందుకు ఇతోధికంగా సహకరించడం తగదు. అమెరికా, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో మైనారిటీగా వున్న హిందువులపై దాడులు జరిగినప్పుడు విహెచ్‌పి లాంటి సంస్థలు మొసలి కన్నీరు కారుస్తున్నాయి. విద్వేషం ఏ దేశంలోనైనా మైనారిటీలకు ముప్పుగా పరిగణిస్తుందనేది జగమెరిగిన సత్యం. జాత్యహంకారం, విద్వేషాన్ని పెంచి పోషిస్తే... అది తిరిగి వారినే కాటేస్తుందనడానికి పక్కనే ఉన్న పాకిస్తాన్ లాంటి దేశాల్లో నిత్యం సాగుతున్న ఉగ్రవాద ఘటనలే ఉదాహరణ.

భిన్నత్వంలో ఏకత్వాన్ని, లౌకికవాదాన్ని, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని, రాజ్యాంగ విలువలను రక్షించుకోవడమే భారతీయత. సమాజంలో, రాజకీయాల్లో పెరుగుతున్న ద్వేషాన్ని తిప్పికొట్టడంతోపాటు అహ్మద్‌లా తోటివారి కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడే స్ఫూర్తిని మనసు నిండా నింపుకోవడం తక్షణ కర్తవ్యం. విద్వేషాన్ని విడనాడి మానవత్వమే మతమని, అభిమతమని, అత్యున్నతమని ప్రతి ఒక్కరూ ప్రతిన బూనడమే ఇలాంటి మారణహోమాలకు విరుగుడు.

మహనీయుని మాట



విజ్ఞానాన్ని పొందాలనుకుంటే
దానికై పరిశ్రమించక తప్పదు.
శ్రమపడటం అన్నది
జీవన సూత్రం.
- జాన్ రస్కిన్,
బ్రిటిష్ రచయిత, తత్వవేత్త.

ఇండిగో ఉదంతం - కార్పొరేట్ శక్తుల గుత్తాధిపత్యం

విశ్లేషణ



డా॥బి. గంగారావు



ఇటీవల కొన్ని రోజుల పాటు అత్యధిక విమాన సర్వీసులను రద్దు చేసి మొత్తం దేశ విమానయాన సర్వీసు నెట్‌వర్క్‌ను పూర్తిగా స్తంభింపచేసిన ఘటన ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల క్రూరమైన నిజస్వరూపాన్ని చూపింది. గత మూడు దశాబ్దాలుగా భారత దేశంలో అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాల వికృత రూపం, అవి సృష్టించిన కార్పొరేట్ శక్తుల ఆర్థిక విధ్వంసం, ప్రజలపై సాగిస్తున్న విచ్చలవిడి దోపిడీ, ఈ సంస్థలకు-పాలక బూర్జువా పార్టీలకు మధ్య ఉన్న అక్రమ బంధం, అంతులేని అవినీతిని ఇండిగో దృష్టాంతం తెలియజేస్తున్నది. ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన రంగాల్లో ప్రభుత్వ సంస్థలు బలంగా లేకపోతే ఏకస్వామ్యాలు ఎలా ఏర్పడతాయో, ప్రభుత్వ నియంత్రణ, జోక్యం లేని స్వేచ్ఛా మార్కెట్ అసలు నైజం ఎలా ఉంటుందో బట్టబయలైంది.

ఇండిగో సృష్టించిన అరాచకంపై కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏ చర్యా తీసుకోలేకపోయింది. పూర్తిగా ఇండిగోకు సాగిలపడింది. పైలట్‌లు, సిబ్బంది కోసం సవరించిన విమాన విధి సమయ పరిమితుల (ఎఫ్‌డిటిఎల్) నిబంధనలను ఆగమేఘాల మీద వచ్చే ఏడాది ఫిబ్రవరికి వాయిదా వేసింది. వాస్తవానికి వీటిని డిసెంబర్ నుండి అమలు చేయాల్సి వుంది. ప్రయాణికుల భద్రతను, ప్రాణాలను ఇండిగోకి ఫణంగా పెట్టింది. ప్రధాని మోడీ ఏకంగా నిబంధనలు వ్యవస్థలను మెరుగు పర్చాలిగాని, ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని సిగ్గు లేకుండా డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) నిబంధనలను తూర్పార పడుతూ ఇండిగో ను వెనకేసుకొచ్చారు.

వాస్తవంగా విమాన పైలట్, ఇతర సిబ్బంది విరామం లేని పని గంటలు, ఒత్తిడి, ఇతర సమస్యలపై గత 15 ఏళ్ల నుండి పైలట్‌ల యూనియన్ పోరాడుతున్నది. 2011లో డిజిసిఎ నియమించిన ప్యానెల్ సిఫార్సులను...డిజిసిఎ నూతన ఎఫ్‌డిటిఎల్, సిఎఆర్ లను నోటిపై చేసింది. వీటిని అమలు చేయనని ఇండిగో తెగేసి చెప్పింది. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత వీటి అమలుకు ప్రయత్నం చేయాల్సింది పోయి పూర్తిగా ప్రైవేట్ విమాన సంస్థల యాజమాన్యాలను కొమ్ముకాస్తూ వచ్చింది. యూనియన్ చివరికి సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. యూనియన్ కి అనుకూలంగా 2024 జనవరిలో కోర్టు తీర్పు ఇచ్చింది. 2025 నుండి దశలవారీగా డిసెంబర్ ఒకటి నుండి పూర్తిగా అమలుకు అన్ని సంస్థలు అంగీకరించాయి. కానీ మోడీ అండతో ఇండిగో ఏ ఒక్క దానిని అమలు చేయడానికి నిరాకరించింది. చివరికి విమాన సర్వీసులు అర్ధంతరంగా నిలిపేసి అల్లకల్లోలం సృష్టించింది.

ఈ ఏడాది జులైలో ప్రచురితమైన మీడియా నివేదిక ప్రకారం ఇండిగో దేశంలో అన్ని రోడ్లపై గుత్తాధిపత్యం సాధించింది. మొత్తం 1131 సర్వీస్ రోడ్లు దేశంలో ఉంటే 900 సర్వీస్ రూట్లలో అంటే 79.6 శాతం రూట్లలో విమాన సర్వీసులు నడుపుతున్నది. ప్రభుత్వ రంగం నుండి టాటా పరమైన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్ ఇండియా రెండూ కలిపి 406 రూట్లలో విమానాలు నడుపుతున్నాయి. ఇండిగో నడుపుతున్న 900 రూట్లలో 514 రూట్లలో ఇండిగో తప్ప మరే ఇతర విమాన సంస్థ విమానాలు నడపటం లేదు. మొత్తం 737 రూట్లలో ఇండిగో లేదా టాటా రెండింటిలో ఒకే ఒక సంస్థ మాత్రమే విమానాలు నడుపుతున్నాయి. మిగిలిన రూట్లు ఎక్కువ భాగం ఈశాన్య రాష్ట్రాలు, చిన్న చిన్న నగరాలకు చెందిన రూట్లు. ఇవి లాభదాయకమైనవి కావు. ఎక్కువ విమాన సర్వీసులు కూడా ఉండవు. అందువల్ల ఈ రెండు సంస్థలు వాటికి విమాన సర్వీసులు నడపటం లేదు. మొత్తంగా దేశ విమానయాన రంగంలో ఇండిగో 65.6 శాతం, టాటా 25.7 శాతం వాటాతో మొత్తం ఈ రెండు సంస్థలే 91.3 శాతాన్ని ఆక్రమించాయి.

బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇండిగో అమాంతంగా ఎదిగిపోయింది. ఇండిగో విస్తరించడానికి కావాల్సిన అన్ని రకాల మద్దతును నరేంద్ర మోడీ ప్రభుత్వం కల్పించింది. 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఇండిగో యాజమాన్యం రూ.30 కోట్లకు పైగా ఎన్నికల బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చింది. ఇది బయటికి కనిపించే విరాళం. లోపాయికారిగా పెద్ద మొత్తంలో బిజెపి అగ్ర నాయకత్వం ఈ సంస్థ నుండి నిధులు పొందిందనేది మీడియా వెల్లడించింది. దీనికి ప్రతిఫలంగా ఇండిగో వేగంగా గుత్తాధిపత్యాన్ని సాధించేందుకు విమానయాన నూతన అవసరాల (సిఎఆర్) పేర అనేక నిబంధనలను సవరించి కొత్త నిబంధనలను బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చింది. వీటిని ఉపయోగించుకొని ఇండిగో తన విమానాలను రోజులో ఎక్కువ గంటలు గగనతలంలోనే ప్రయాణించేలా చేసింది. రాత్రి ల్యాండింగ్‌ల సంఖ్య రెండు నుండి ఆరుకు పెంచడంతో ఇండిగో విపరీతంగా వినియోగించుకుంది. తక్కువ మంది పైలట్లు, సిబ్బందితో తక్కువ వేతనాలతో, రోజంతా పని చేసేలా నిర్బంధ పద్ధతులు ఉపయోగించి శ్రమ దోపిడీని యథేచ్ఛగా సాగించింది. దీంతో 2019-24 మధ్య ఇండిగో అతి పెద్ద ఏకస్వామ్య సంస్థగా దేశ విమానయాన రంగంలో ఎగబాకింది. 36 శాతం వాటా నుండి 65 శాతాన్ని ఆక్రమించింది. 232 విమానాల స్థాయి నుండి 434 కి, 56 గమ్యస్థానాల నుండి 131 కి, విమాన సర్వీసుల సంఖ్య 1300 నుండి 2200 కి పైగా విస్తరించింది. 2018లో రూ.29,821 కోట్ల ఆదాయం నుండి 2024 నాటికి రూ.80,986 కోట్ల ఆదాయానికి పెరిగి లాభాలను రూ.156 కోట్ల నుండి రూ.7253 కోట్లకు పెంచుకోగలిగింది. ప్రత్యర్థి విమాన సంస్థలను పోటీలోనే లేకుండా దివాళా తీయించేసింది.

> బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇండిగో అమాంతంగా ఎదిగిపోయింది. ఇండిగో విస్తరించడానికి కావాల్సిన అన్ని రకాల మద్దతును నరేంద్ర మోడీ ప్రభుత్వం కల్పించింది. 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఇండిగో యాజమాన్యం రూ.30 కోట్లకు పైగా ఎన్నికల బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చింది. ఇది బయటికి కనిపించే విరాళం. లోపాయికారిగా పెద్ద మొత్తంలో బిజెపి అగ్ర నాయకత్వం ఈ సంస్థ నుండి నిధులు పొందిందనేది మీడియా వెల్లడించింది. దీనికి ప్రతిఫలంగా ఇండిగో వేగంగా గుత్తాధిపత్యాన్ని సాధించేందుకు విమానయాన నూతన అవసరాల (సిఎఆర్) పేర అనేక నిబంధనలను సవరించి కొత్త నిబంధనలను బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చింది.

1991 అనంతరం విమానయాన రంగంలో ప్రైవేట్ సంస్థలను ఆహ్వానించారు. తొలుత 1992లో ఈస్ట్ వెస్ట్ ఎయిర్‌లైన్స్ అనే ప్రైవేట్ సంస్థ విమానాలు నడపడంతో ప్రారంభించింది. ఆ తరువాత జెట్ ఎయిర్‌వేస్, డమానియా ఎయిర్‌వేస్, మోడీలఫ్ట్ వంటి సంస్థల అనంతరం సహారా, ఎయిర్ డెక్కన్ వచ్చాయి. వీటి తర్వాత కింగ్ ఫిషర్ వచ్చింది. దీని అధినేత అప్పుల్లో మునిగిపోయి విదేశాలకు మోడీ సాయంతో పారిపోయిన విషయం తెలిసిందే. ఇటీవల గో ఫస్ట్ వచ్చి దివాళా తీసింది. ప్రైవేటీకరణ నేపథ్యంలో గొప్ప గొప్ప సంస్థలుగా వీటిని పాలకులు కీర్తించారు. ఇవన్నీ నేడెక్కడున్నాయి?

గడిచిన మూడు దశాబ్దాల్లో అత్యంత దారుణమైన విషాదం విమానయాన రంగంలో ఏర్పడింది. ఈస్ట్ వెస్ట్ ఎయిర్ లైన్స్ నుండి ఇటీవలి గో ఫస్ట్ వరకు ఈ విధానాల అరాచక పద్ధతుల కారణంగా విమాన రంగ చిత్రపటం నుండి పూర్తిగా అడ్రస్ లేకుండా పోయాయి. భారీ అప్పులు చేసి దివాలా తీసి వేల కోట్లు ప్రభుత్వ బ్యాంకులకు ఎగనామం పెట్టాయి. లక్షలాదిమంది ఉద్యోగులకు నష్టపరిహారం కూడా చెల్లించకుండా దారుణంగా రోడ్డున పడేశాయి.

రెండో వైపు ప్రభుత్వ అధీనం లోని ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్ సంస్థలను కుట్రతో బిజెపి దెబ్బతీసింది. వీటి సర్వీసు రూట్లను ప్రైవేట్ సంస్థల పరం చేసింది. అప్పుల ఊబిలోకి దించి నష్టాలు మూటగట్టింది. దీనిని సాకుగా చూపి రెండు సంస్థలను టాటాకి ధారాదత్తం చేసింది. అప్పుల చెల్లింపును ప్రభుత్వం తీసుకుంది. దీనికి ప్రతిఫలంగా టాటా సంస్థ బిజెపి కి రూ.750 కోట్లకు పైగా ఎన్నికల బాండ్లు సమర్పించింది.

నేడు విమానయాన రంగంలో ఏర్పడిన గుత్తాధిపత్య పరిస్థితి నేడు దేశంలో అన్ని రంగాల్లో మనకి కనిపిస్తున్నది. మొత్తం దేశ ఆర్థిక, పారిశ్రామిక, సేవా, మౌలిక సదుపాయాల రంగాలన్నీ కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యంలోకి వెళ్లిపోతున్నాయి. కొన్ని రంగాలను పూర్తిగా ఒకటి, రెండు కార్పొరేట్ సంస్థలే శాసిస్తున్నాయి. పారిశ్రామిక రంగంలో కూడా ఇదే పరిస్థితి. పెయింట్స్, స్టీల్ పరిశ్రమలు చూసినా అంతే. టెలికమ్ రంగంలో జియో, ఎయిర్‌టెల్, పోర్టులు, ఎయిర్ పోర్టులలో అదానీ, ఆయిల్, గ్యాస్ లో అంబానీ....ఇలా అన్ని రంగాలను స్వాధీనం చేసుకుంటున్నాయి. వ్యవసాయ రంగంలోకి కూడా చొరబడ్డాయి. పంపిణీలో కూడా గుత్త సంస్థలు పెరిగిపోతున్నాయి. లక్షల కోట్ల సంపదకు అధిపతులవుతున్నాయి. ఆర్థిక సామ్రాజ్యాలనే నిర్మిస్తున్నాయి. ఈ సంస్థల మధ్య పోటీ కూడా లేదు. కొన్నింటిలో ద్విస్వామ్యం ఉండటంతో వినియోగదారుడు ఇష్టం ఉన్నా, లేకున్నా, ఎంత ధరైనా వాటినే కొనుక్కోవాలి. వేరే ప్రత్యామ్నాయమే లేదు. ప్రైవేట్ సంస్థల వల్ల పోటీ పెరిగి ధరలు తగ్గుతాయనేది ఆచరణలో ఒట్టి బూటకంగా తేలిపోయింది. మరికొన్ని రంగాల్లో బహుళ స్వామ్యాలుగా ఉన్న సంస్థలు గ్రూపులుగా ఏర్పడి వాటి మధ్య పోటీ లేకుండా చేసుకొని ధరలను పెంచే కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నాయి.

సరళీకరణ విధానాల అనంతరం దేశ ఆర్థిక వ్యవస్థ మీద, బడా సంస్థలు, పెట్టుబడులు, వ్యాపార, వాణిజ్యాల మీద ఉన్న నియంత్రణలన్నీ ఎత్తివేయడంతో అడ్డు అదుపు లేకుండా అరాచక చర్యలకు పాల్పడుతున్నాయి. బలవంతపు విలీనాలు, స్వాధీనాలకు కూడా ప్రయత్నం చేస్తున్నాయి. చిన్న, మధ్యతరహా ఉత్పత్తి సంస్థలను మార్కెట్‌లో లేకుండా చేసేస్తున్నాయి.

ఇటువంటి గుత్త సంస్థలు దేశ ఆర్థిక రంగంలో ఏర్పడకుండా నిరోధించటానికి ఆర్.టి.పి-1969 తీసుకొచ్చారు. ఇది పారిశ్రామిక విస్తరణకు ఆటంకంగా ఉన్నదనే పేర దీనిని తొంభయ్యో దశకంలో రద్దు చేశారు. ఆ తరువాత 2022లో దీని స్థానంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) చట్టాన్ని తీసుకొచ్చారు. వివిధ సంస్థల మధ్య హానికర పోటీ నివారణ, కొన్ని బడా సంస్థలు ఒక గ్రూపుగా ఏర్పడటం, ధరలు పెంచడం, అక్రమ పద్ధతుల్లో విలీనాలు, స్వాధీనాలకు పాల్పడటం వంటి చర్యలను నివారించాలని అలాగే వివిధ రంగాల్లో ఉండే సంస్థల మధ్య పోటీ పెంచి ధరలు తగ్గేలా చూడాలని, వినియోగదారుల ప్రయోజనాలు కాపాడాలనే ఈ కమిషన్ లక్ష్యాలుగా పెట్టారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన తరువాత కోరలు లేని కమిషన్‌గా దీనిని మార్చేశారు. చైర్మన్‌ను కూడా లేకుండా చేస్తున్నారు. ఇప్పుడున్న చైర్మన్ కూడా డిప్యుటేషన్ మీద ఉన్నవారే.

2011 నుండి ఈ కమిషన్ అక్రమాలకు పాల్పడుతూ, నిబంధనలను ఉల్లంఘించిన బడా సంస్థలపై రూ.18,300 కోట్లు జరిమానాలు విధిస్తే కేవలం రూ.400 కోట్లు కూడా వీటి నుండి వసూలు చేయలేక పోయిందంటే ఈ కమిషన్ ఎలా పనిచేస్తున్నదో అర్థం చేసుకోవచ్చు.

ఇప్పుడు మూడోసారి అధికారం చేపట్టిన తరువాత బిజెపి ప్రభుత్వం నేటికీ దేశ ఆర్థిక వ్యవస్థకి కీలకంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను వేగంగా కార్పొరేట్ సంస్థలకు అమ్మేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. ప్రభుత్వ రంగ సంస్థలనే కాదు మొత్తం ప్రభుత్వ పెట్టుబడులతో నిర్మించిన అన్ని మౌలిక సదుపాయాలు, సేవల రంగాలను కూడా కార్పొరేట్ల పరం చేస్తున్నది. కార్పొరేట్ శక్తులతో మరింతగా పెనవేసుకుపోతున్నది. కొన్ని రంగాలను పూర్తిగా తనకు సన్నిహితంగా ఉండే సంస్థల పరం చేస్తూ క్రోనీ పద్ధతులను నయా ఆర్థిక వ్యూహంగా మార్చేస్తున్నది.

/ వ్యాసకర్త సెల్: 9490098792 /

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు

వ్యాఖ్య



ఎ. అజ శర్మ

'కార్మిక లోకానికి శాపం ఈ కమ్యూనిస్టులు' అనే శీర్షికన బిజెపి నాయకులు విష్ణువర్ధన రెడ్డి గారు రాసిన ఒక వ్యాసం డిసెంబరు 12వ తేదీ ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురించబడింది.

నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వెనకేసుకు రావడం, ఆ విధానాలపై నికరంగా, నిస్వార్థంగా పోరాడుతున్న కమ్యూనిస్టులను విమర్శించడమే ఆ వ్యాసం ఉద్దేశం. అందులో భాగంగా సహజంగానే ఇటీవల మోడీ ప్రభుత్వం చేసిన నాలుగు లేబర్ కోడ్లను అసత్యాలతో ఆకాశానికెత్తేశారు.

అంతిమంగా చూసినప్పుడు ఈ లేబర్ కోడ్లు పచ్చి కార్మిక వ్యతిరేకమైనవే అనడంలో ఎటువంటి సందేహం లేదు. పైపై అంశాలు పక్కన పెడితే, కార్మికులకు ప్రధానంగా అవసరమైనది గౌరవప్రదమయిన వేతనం, పని ప్రదేశంలో భద్రత. వీటికి యాజమాన్యాలు ఒప్పుకోకపోవడం వల్లే కార్మికులు సంఘాలు పెట్టుకోవడం, సమ్మెలు చేయడం జరుగుతూ ఉంటుంది. అందువల్ల వేతనం, సంఘం, సమ్మె-ఈ మూడూ కార్మికుల అస్తిత్వానికి ప్రధానం. వీటిని మోడీ ప్రభుత్వం ఈ లేబర్ కోడ్ల ద్వారా కాలరాస్తోంది.

వాస్తవంగా మన దేశంలో ఎటువంటి చట్టం లేకముందే కార్మికులు అనేక సమ్మెలు చేశారు. దరిమిలా నాటి బ్రిటిష్ ప్రభుత్వం ట్రేడ్ యూనియన్ చట్టం-1926 చేసింది. ఈ చట్టం ప్రకారం ఏదైనా పరిశ్రమలో ఏడుగురు కార్మికులు కలిసి యునియన్ ఏర్పాటు చేసుకోవచ్చు. దీన్ని కాస్తా నేడు మోడీ ప్రభుత్వం మార్చివేసింది. కొత్త కోడ్ ప్రకారం 10 శాతం కార్మికులు కానీ, 100 మంది కలిస్తేనే కానీ యూనియన్ ఏర్పాటు కాదు. ఈ నిబంధనకు అనుగుణంగా యూనియన్ ఏర్పాటు చేసుకున్నా, ఒకవేళ ఏదైనా సమయంలో ఈ సంఖ్య తగ్గితే ఆ యూనియన్ రిజిస్ట్రేషన్ రద్దయిపోయే నిబంధన కొత్తగా చేర్చారు. ఇది ఏ రకంగా కార్మికుల ప్రయోజనమో వ్యాస రచయితకే తెలియాలి. దీనివల్ల యూనియన్ ఏర్పాటు చేసుకోవడమే గగనం అయిపోతుంది.

పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం ఏదైనా అత్యవసర సంస్థలో సమ్మె చేయాలంటే గతంలో 14 రోజుల నోటీసు ఇవ్వాలి. నేడు దానిని 60 రోజుల వరకు మార్చివేశారు. అలాగే నోటీసు ఇచ్చిన వెంటనే లేబరు కమిషనర్ కన్సీలియేషన్ వేయాలని, అది పెండింగులో ఉండగా సమ్మె చేయరాదని షరతు విధించారు. ఒక వేళ అప్పుడు సమ్మె చేస్తే దాన్ని చట్ట విరుద్ధ సమ్మెగా పరిగణించి, సమ్మె చేసిన వారిని, ప్రోత్సహించిన వారిని కూడా జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించవచ్చు. అంటే ఆచరణలో ఇక సమ్మె చేయడమే దుర్లభంగా మారుతుంది. ఇది కార్పొరేట్ యాజమాన్యాలకు తప్ప కార్మికులకు ఏ రకంగా ప్రయోజనకరమో అర్థం కాని అంశమే.



> వాస్తవంగా మన దేశంలో ఎటువంటి చట్టం లేకముందే కార్మికులు అనేక సమ్మెలు చేశారు. దరిమిలా నాటి బ్రిటిష్ ప్రభుత్వం ట్రేడ్ యూనియన్ చట్టం-1926 చేసింది. ఈ చట్టం ప్రకారం ఏదైనా పరిశ్రమలో ఏడుగురు కార్మికులు కలిసి యునియన్ ఏర్పాటు చేసుకోవచ్చు. దీన్ని కాస్తా నేడు మోడీ ప్రభుత్వం మార్చివేసింది. కొత్త కోడ్ ప్రకారం 10 శాతం కార్మికులు కానీ, 100 మంది కలిస్తేనే కానీ యూనియన్ ఏర్పాటు కాదు. ఈ నిబంధనకు అనుగుణంగా యూనియన్ ఏర్పాటు చేసుకున్నా, ఒకవేళ ఏదైనా సమయంలో ఈ సంఖ్య తగ్గితే ఆ యూనియన్ రిజిస్ట్రేషన్ రద్దయిపోయే నిబంధన కొత్తగా చేర్చారు. ఇది ఏ రకంగా కార్మికుల ప్రయోజనమో...!

పోనీ ఈ లేబరు కోడ్లలో కార్మికుల వేతనాలు, పని పరిస్థితులు, జీవన ప్రమాణాలు పెంచే అంశాలేమైనా ఉన్నాయా అని దుర్భిణీ వేసి చూసినా అగుపించవు. సరికదా మరింత దిగజారుడే కనపడుతుంది. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే కార్మికుని కనీస వేతనం రోజుకు 465 రూపాయలుగా ఇటీవలే కేంద్ర లేబర్ కమిషనర్ ప్రకటించారు. అంటే నెలకు 26 రోజులుగా భావిస్తే వచ్చే వేతనం కేవలం నెలకు 12,090 రూపాయలు. ఈ వేతనమే జీవన ప్రమాణాలు పెంచేసేదిగా వ్యాస రచయితకు కనపడడం విడ్డూరమే. కేంద్ర సంస్థల్లోనే ఇలా ఉంటే, ఇక ప్రైవేటు సంస్థల గురించి వేరే చెప్పనవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం అంత్యోదయ అన్న యోజన కింద పేదలకు ఇచ్చే రేషన్ కార్డు అర్హత నెలకు 15 వేల రూపాయలు. మోడీ ప్రభుత్వం దారిద్ర్య రేఖ కంటే తక్కువగా కనీస వేతనం నిర్ణయించి, సంపద సృష్టికర్తలయిన కార్మికులను నిష్టదరిద్రులుగా బతకమనడం కార్మికులకే కాదు, దేశానికి కూడా శ్రేయస్కరం కాదు. ఇలా వేతనాలు పెంచక, సంఘాలు పెట్టుకోనివ్వక, సమ్మెలు చేయనివ్వకుండా ఈ లేబరు కోడ్లు తయారు చేయడం కార్మికులను యాజమాన్యాల దయా దాక్షిణ్యాలకు వదిలివేయడం, ఎటువంటి హక్కులూ లేని బానిసలుగా మార్చేయడం తప్ప మరొకటి కాదు. ఫ్యాక్టరీ చట్టం ప్రకారం భద్రతా ప్రమాణాలు తనిఖీ చేసే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ పేరు కూడా ఫెసిలిటేటర్‌గా మార్చేసి, అధికారాలన్నీ తీసేసి, కార్మికుల ప్రాణాలకు కూడా రక్షణ లేకుండా చేస్తోంది.

గిగ్ వర్కర్లకు ఏదో మేలు జరుగుతుందని భావించడం భ్రమే అవుతుంది. ఎందుకంటే ఈ లేబర్ కోడ్లలో ఎక్కడా ప్రభుత్వం వీరి సంక్షేమం కోసం రూపాయి కూడా ఇస్తుందని లేదు. ఇక్కడ కూడా యాజమాన్యాల నుండే వసూలు చేస్తారట. అంటే తిరిగి ఆ సేవలు అందుకునే సామాన్యుల మీదే ఆ భారం పడుతుంది. శాశ్వత ఉపాధి దాదాపు లేనట్లుగా చేసి. కాంట్రాక్టు పద్ధతిని వ్యవస్థీకృతం చేసేలా అనేక అంశాలు ఈ కోడ్లలో పొందుపరిచారు.

ఇక సంక్షేమం గురించి వేరే చెప్పనవసరం లేదు. పాతికేళ్లు, ముప్పయ్యేళ్లకు పైగా ఒక పరిశ్రమలో పని చేసి, రిటైరయిన కార్మికునికి ఇపిఎస్ పేరున ఇస్తున్న పింఛను అత్యధిక మందికి మూడు వేల రూపాయలకు మించి లేదు. ఇది అనేక రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇస్తున్న సామాజిక పింఛను నాలుగు వేల రూపాయల కంటే కూడా తక్కువ. ఈ ఇపిఎస్ పింఛను తొమ్మిది వేల రూపాయలకైనా పెంచాలని ఎంత మొర పెట్టుకున్నా మోడీ ప్రభుత్వంలో చలనం లేదు. ఎన్‌పిఎస్, యుపిఎస్ పేరున కార్మికుల పొదుపు సొమ్మును షేర్ మార్కెట్లో పెట్టి మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోంది. ఈ పథకాలను కార్మికుల ప్రయోజనాలకు అనుగుణంగా మార్చాలని ఎన్ని ఉద్యమాలు చేసినా మోడీ ప్రభుత్వం మాత్రం నుండి స్పందనే లేదు. ఇదీ! మోడీ ప్రభుత్వం శ్రామికులకు ఇస్తున్న గౌరవం.

కమ్యూనిస్టులు పరిశ్రమల నాశనమే విధానంగా పని చేస్తారని ఈయన ఇంకో కితాబు ఇచ్చారు. వాస్తవంగా మోడీ ప్రభుత్వ ఈ పదకొండేళ్ళ కాలంలో దేశంలో ఉత్పాదక రంగం బలహీనపడింది. అధికారిక లెక్కల ప్రకారమే అనేక చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు మూతబడ్డాయి. అన్నింటికి మించి, దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మగా ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మేయడమే మోడీ ప్రభుత్వ ప్రధాన విధానంగా ఉంది. రక్షణ రంగం, బ్యాంకులతో సహా సర్వం ప్రైవేట్ పరం అన్నదే ప్రభుత్వ విధానం. తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంటును కూడా తెగనమ్మేయలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ రంగ పరిరక్షణకు పోరాడుతున్న కార్మికులకు పూర్తి అండగా నిలిచింది కమ్యూనిస్టులు కాగా, ఆ వాస్తవాన్ని కూడా చూడ లేకపోవడం దృష్టి లోపం తప్ప మరొకటి కాదు.

కమ్యూనిస్టులు కార్మికులను ఓట్ బ్యాంకుగా చూస్తారని మరో అపవాదు వేశారు. వాస్తవ మేమిటంటే కార్మికులను కులం, మతం, ప్రాంతాల పేరున విడదీసి, వీరి ఐక్యతను విచ్ఛిన్నం చేసి తన రాజకీయ పబ్బం గడుపుకుంటున్నది వీరి బిజెపి పార్టీయే. దీనికి భిన్నంగా తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి, ప్రజల, దేశ ఐక్యతను కాపాడుతున్నది కమ్యూనిస్టులే. అటువంటి కమ్యూనిస్టులపై లేనిపోని నిందలు వేయడం సూర్యునిపై ఉమ్మి వేయడం లాంటిదే. వీరు చివరలో పేర్కొన్నట్లు ప్రజలు సరైన సమయంలో సరైన బుద్ధి వీరికి తప్పక చెబుతారు అనడంలో ఎటువంటి సందేహం లేదు.

/ వ్యాసకర్త సిపిఎం విశాఖ నగర పూర్వ కార్యదర్శి /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ఎయిర్‌పోర్టుకి భూములు ఇచ్చేది లేదు

- అధికారులకు తేల్చిచెప్పిన భేతాళపురం రైతులు

ప్రజాశక్తి - మందస

కార్గో ఎయిర్‌పోర్టుకు భూములు ఇచ్చేది లేదని అధికారులకు భేతాళపురం రైతులు తేల్చిచెప్పారు. మందస మండలంలోని భేతాళపురం సచివాలయం ప్రాంగణంలో పలాస ఆర్‌డిఒ జి.వెంకటేష్ అధ్యక్షతన కార్గో ఎయిర్‌పోర్టు బాధిత రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గో ఎయిర్‌పోర్టు ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాధిత రైతులు అంగీకరిస్తే ప్రభుత్వం నుంచి లాండ్ పూలింగ్ విధానం తీసుకొచ్చి, ఎకరాకు 25 సెంట్ల భూమి తిరిగి ఇస్తామని తెలిపారు. జిరాయితీ భూముల్లో ఉన్న చెట్లకు ప్రత్యేక ధర ప్రకటిస్తామని చెప్పారు. ప్రభుత్వ ధర కన్నా 2.5 రెట్లు అధికంగా చెల్లిస్తామన్నారు. బాధిత రైతులు మడియా రాజేశ్వరి మాట్లాడుతూ... ప్రాణాలు పోయినా జీవనాధారమైన భూములను ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. తిత్లీ తుపాను తర్వాత చాలా నష్టపోయామని, అదే భూమిని కష్టపడి కొబ్బరి చెట్లు పెంచి పెద్దవి చేసి పంట కాపుకొస్తున్న సమయంలో భూముల ఇవ్వాలంటే ఎలా అని మరో మహిళ గున్నమ్మ ప్రశ్నించారు. ఇచ్చిన డబ్బులు పది రోజుల్లో ఖర్చు చేసేస్తామని, అదే భూమి ఉంటే దానిపై బతుకుతామన్నారు. ఉన్న నాలుగెకరాల భూమి పోతే ఎక్కడికి వెళ్లి బతకాలని బత్తిని ఉమాపతి ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ మీడియా వింగ్ కన్వీనర్ బత్తిని లక్ష్మణ్ మాట్లాడుతూ... 15 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కార్గో ఎయిర్‌పోర్టుకు సంబంధించిన రైతులు ఎంతమంది, అవసరమైన భూమి ఎంత అని స్పష్టత ఇవ్వకుండా సుమారు 20 గ్రామాల్లో రైతులను మానసికంగా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఒక్క సెంటు కూడా కార్గో ఎయిర్‌పోర్టుకి ఇచ్చేది లేదని తీర్మానం చేసిన పత్రాలను చూపించారు. ఎన్ని ఇచ్చినా ఆవేదే పచ్చని భూముల కన్నా ఎక్కువ కాదన్నారు. కార్గో ఎయిర్‌పోర్టు వద్దని కొందరు వినతిపత్రం అందజేశారు. సభలో రైతులు వ్యక్తపరిచిన అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు సమావేశం ముగించారు.

అంతరాష్ట్ర సైబర్ ముఠా అరెస్టు

ప్రజాశక్తి - నరసాపురం

ఎసిబి అధికారులమని చెప్పి మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్‌ను బెదిరించి రూ.రెండు లక్షలు దోచేసిన అంతరాష్ట్ర సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసినట్లు నరసాపురం డిఎస్‌పి జి.శ్రీవేద తెలిపారు. మంగళవారం ఆమె మీడియాకు వివరాలు వెల్లడించారు. గత నెల 12వ తేదీన మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సత్యవతి శ్రీనివాస్ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి తాము విజయవాడ 'హెడ్ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నామని బెదిరించారు. దీంతో భయపడిన శ్రీనివాస్ విడతల వారీగా రూ.రెండు లక్షలు ఫోన్ పే ద్వారా పంపారు. అనుమానం వచ్చి మొగల్తూరు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

ఎస్‌పి ఆదేశాలు మేరకు డిఎస్‌పి జి.శ్రీవేద ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బ్యాంకు లావాదేవీలు, సాంకేతిక ఆధారాలతో అనంతపురం జిల్లాకు చెందిన నూతేటి జయకృష్ణ, వడ్డే రామాంజనేయులు, కర్నూలుకు చెందిన రామాంజనేయులు, వనిత, పి.తరుణ్‌ను మంగళవారం విజయవాడలో అరెస్టు చేశామని తెలిపారు. నిందితుల నుంచి రూ.85 వేల నగదు, నాలుగు స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు మనీ మ్యూల్ అకౌంట్లకు ఇచ్చి, కమిషన్ పద్ధతిలో మోసాలకు సహకరించినట్లు విచారణలో తేలిందన్నారు.

పోక్సో కేసులో ర్యాపిడో ఆటో డ్రైవర్ అరెస్ట్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : పోక్సో కేసులో ర్యాపిడో ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అలిపిరి సిఐ రామ్ కిషోర్ తెలిపారు. నవంబర్ మూడున ఓ హాస్టల్ నుండి మరొక హాస్టల్‌కు లగేజ్ తరలిస్తూ మైనర్ బాలికను ఆటో డ్రైవర్ పరిచయం చేసుకున్నాడు. మాయమాటలతో బాలికను నమ్మించి ధన సహాయం చేస్తానంటూ, ఈనెల మూడున రూమ్‌కు తీసుకెళ్లి, బాలికపై అత్యాచారం చేశాడు. అత్యాచారానికి గురైన మైనర్ బాలిక స్నేహితురాలితో కలిసి ఈనెల ఎనిమిదిన అలిపిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. క్రైమ్ నెంబర్ 448/2025 పోక్సో కేసు నమోదు చేసిన విషయం విదితమే. విచారణ చేపట్టిన పోలీసులు, నిందితుడు సత్యసాయి జిల్లా పుట్ట పర్తికి చెందిన ఆటో డ్రైవర్ సాయి కుమార్‌గా గుర్తించారు. నిందితుని మంగళవారం అదుపులోకి తీసుకొని, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు అలిపిరి సిఐ రామ్ కిషోర్ వెల్లడించారు.

ఆస్ట్రేలియా దాడిలో భారత్ మూలాలు!

- దాడికి పాల్పడిన సాజిద్ అక్రమ్ హైదరాబాద్ వాసి
- భారత్ పాస్‌పోర్ట్‌తో నవంబరులో ఫిలిప్పీన్స్‌కు



న్యూఢిల్లీ : ఆస్ట్రేలియాలో ఆదివారం జరిగిన బోండీ బీచ్‌లో ఉగ్ర దాడికి పాల్పడిన వారిలో ఒకరికి భారత్ మూలాలు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ దాడిలో 16 మంది చనిపోయారు. దాడికి పాల్పడిన ఇద్దరిలో ఒకరైన సాజిద్ అక్రమ్ (50) హైదరాబాద్‌కు చెందిన వాడని, ఆయన వద్ద భారత్ పాస్‌పోర్ట్ ఉందని భారత ప్రభుత్వ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో టోలిచౌక్ నివాసి అయిన సాజిద్ 1998లో విద్యార్థి వీసాపై ఆస్ట్రేలియాకు వలస వెళ్లిన తర్వాత కేవలం రెండు మూడుసార్లు మాత్రమే భారత్ వచ్చాడని, చివరిసారిగా 2022లో భారత్ వచ్చాడని చెప్పారు. సాజిద్ తండ్రి 2017లో చనిపోయాడని, అంత్యక్రియలకు కూడా రాలేదని తెలిపారు. సాజిద్ కుటుంబంలో అన్నగారు దార్లా అని, తండ్రి 1984లో యుఎఇలో ఆర్మీ నుండి రిటైరయ్యారని మరో అధికారి వెల్లడించారు. సాజిద్ కుమారుడు, బీచ్ దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నవీద్ 2001లో ఆస్ట్రేలియాలోనే జన్మించాడు, ఆస్ట్రేలియా పౌరుడు. హైదరాబాద్‌లో కామర్స్‌లో డిగ్రీ పూర్తి చేసిన తర్వాత అక్రమ్ ఆస్ట్రేలియాకు వెళ్లి అక్కడే యూరోపియన్ యువతిని వివాహం చేసుకున్నాడు, వారికి ఇద్దరు పిల్లలని, ఇద్దరూ ఆస్ట్రేలియా పౌరులేనని చెప్పారు. సాజిద్‌కు స్థానికంగా సంబంధాలేమీ లేవని, ఆస్తి తగాదాల సమయంలో, తల్లిదండ్రులను చూసేందుకు వచ్చాడని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని స్థానిక పోలీసులు తెలిపారు.

నవంబరులో ఫిలిప్పీన్స్‌కు

దర్యాప్తు విషయంలో భారత అధికారులతో ఆస్ట్రేలియా అధికారులు టచ్‌లో వున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. నవంబరులో భారత్ పాస్‌పోర్ట్‌తోనే సాజిద్, అతని కుమారుడు నవీద్ ఫిలిప్పీన్స్‌కు వచ్చారని ఫిలిప్పీన్ ఇమ్మిగ్రేషన్ అధికారులు మంగళవారం తెలిపారు. దాడికి సంబంధించిన వివరాలపై వ్యాఖ్యానించడానికి ఆస్ట్రేలియా అధికారులు తిరస్కరించారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మాట్లాడుతూ ఈ దశలో ఆ వివరాలపై వ్యాఖ్యానించడం సముచితం కాదని అన్నారు.

గోవా నైట్ క్లబ్ ప్రమాదం
భారత్‌కు లూథ్రా సోదరులు..

బ్యాంకాక్, న్యూఢిల్లీ : గోవా నైట్‌క్లబ్ అగ్నిప్రమాదం కేసులో నిందితులు గౌరవ్ లూథ్రా, సౌరభ్ లూథ్రాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం బ్యాంకాక్ నుండి ఢిల్లీ విమానాశ్రయం చేరుకున్న వారిని ఢిల్లీ, గోవా పోలీసులు అరెస్టు చేశారు.. ముందుగా వీరిని ఢిల్లీ కోర్టులో హాజరుపరుస్తారు. అనంతరం ట్రాన్సిట్ రిమాండ్ ద్వారా బుధవారం వీరిని గోవా కోర్టులో హాజరుపర్చే అవకాశం ఉంది. కాగా, విమానాశ్రయంలో దిగిన లూథ్రా సోదరుల్ని కవర్ చేయడానికి మీడియా ప్రతినిధులు ప్రయత్నించారు. అయితే భారీగా మోహరించిన భద్రతా సిబ్బంది మీడియా ప్రతినిధులు అక్కడ నుంచి వెళ్లగొట్టారు. ఉత్తరగోవాలోని అర్పోరాలోని బిర్చ్ బై రోమియో లేన్ నైట్‌క్లబ్‌లో డిసెంబరు 6న జరిగిన అగ్ని ప్రమాదంలో 25 మంది మరణించిన సంగతి తెలిసిందే . ఈ ప్రమాదం జరిగిన గంటల వ్యవధిలోనే క్లబ్ యజమానులైన లూథ్రా సోదరులు థాయిలాండ్‌లోని పుకెట్‌కు పారిపోయారు. భారత ప్రభుత్వం చేసిన అభ్యర్థనతో ఈ నెల 11న వీరిని థాయ్‌లాండ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తరువాత ఇరుదేశాల మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం వారిని థాయిలాండ్ నుంచి బహిష్కరించారు. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం వీరు దాఖలు చేసుకున్న పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు ఈ నెల 11న తిరస్కరించింది.

ఇజ్రాయిల్‌లో జైశంకర్ రెండు రోజుల పర్యటన

జెరూసలేం : రెండు రోజుల పర్యటన కోసం మంగళవారం ఇజ్రాయిల్‌కు కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ చేరుకున్నారు. జైశంకర్ ఈ పర్యటనలో ఇజ్రాయిల్ నాయకులతో ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై చర్చలు నిర్వహిస్తారు. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు భారత పర్యటనకు సన్నాహాలు జరుగుతున్న సమయంలో జైశంకర్ ఇక్కడకు రావడం విశేషం. జైశంకర్ ఈ పర్యటనలో ఇజ్రాయిల్ అధ్యక్షులు ఐజాక్ హెర్జోగ్, ప్రధాని నెతన్యాహు, విదేశాంగ మంత్రి గిడియన్ సార్‌లతో భేటీకానున్నారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై ఈ చర్చలు జరుగుతాయని ఇజ్రాయిల్‌కు చెందిన ఒక అధికారి తెలిపారు. జైశంకర్ అబుదాబి నుంచి టెల్ అవీవ్‌కు చేరుకున్నారు.

ఎంబాపేకు 70మిలియన్ డాలర్లు చెల్లించండి

- పారిస్ లేబర్ కోర్టు తీర్పు



పారిస్: ఫ్రాన్స్ దిగ్గజ ఫుట్‌బాల్ ఆటగాడు ఎంబాపేకు పారిస్ సెయింట్ జెర్మన్ (పిఎస్‌జి) క్లబ్ 70మిలియన్ డాలర్లు చెల్లించాలని 'పారిస్ లేబర్ కోర్టు' మంగళవారం తీర్పు ఇచ్చింది. పిఎస్‌జి క్లబ్ 260 మిలియన్లకు పైగా యూరోలు (సుమారు 305మిలియన్లు) బాకీ ఉన్నట్లు ఎంబాపే న్యాయవాదులు గతంలో లేబర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా కోర్టు ఎంబాపేకు 70 మిలియన్ డాలర్లు చెల్లించాలని తీర్పు ఇచ్చింది. పిఎస్‌జి క్లబ్ ఎంబాపేను ఆటగాళ్ల బదిలీలో భాగంగా మార్పుచేసుకోవడంతో ఈ నష్టం జరిగినట్లు కోర్టు తాజా తీర్పులో పేర్కొంది. గత నెలలో న్యాయవాదుల 'కౌన్సిల్ డి ప్రూడ్ హోమ్స్ డి పారిస్' ఈ వివాదంపై కథనం ప్రచురించింది. 2024లో రియల్ మాడ్రిడ్‌కు వెళ్లడానికి ముందు అతనికి అధిక మొత్తంలో చెల్లింపులు చేస్తామని పిఎస్‌జి క్లబ్ ఎంబపేతో ఒప్పందం చేసుకుంది. ఆ తర్వాత అతనితో ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకొంది. దీని కారణంగా ఎంబాపే ఇతర క్లబ్‌ల తరఫున ఆడే అవకావాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఎంబపే న్యాయవాదులు పిఎస్‌జి క్లబ్ 260 మిలియన్ డాలర్ల యూరోలకు పైగా బాకీ ఉన్నట్లు పేర్కొనగా.. మంగళవారం కోర్టు ఆటగాడి పక్షాన తీర్పు వెలువరించింది. కోర్టు తీర్పుపై అప్పీల్ చేసుకొనేందుకు పిఎస్‌జి క్లబ్‌కు అవకాశం ఇస్తున్నట్లు పేర్కొనగా.. కోర్టు తీర్పుపై పిఎస్‌జి క్లబ్ స్పందించాల్సి ఉంది.

రిలయన్స్‌కు భారీ తాయిలాలు

- 15 శాతం పెట్టుబడి సబ్సిడీ
- ఎస్‌జిఎస్‌టిలో 100 శాతం రాయితీ
- విద్యుత్, స్టాంప్ డ్యూటీల్లోనూ మేళ్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

దేశంలోనే అతి పెద్ద సంస్థ యైన రిలయన్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం భారీ సబ్సిడీలను ప్రకటించింది. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లులో రిలయన్స్ అనుబంధ సంస్థ రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఏర్పాటుచేయనున్న బెవరేజెస్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ సోమవారం రాత్రి పరిశ్రమలశాఖ ఉత్తర్వులు జారీ చేయడం విశేషం. 1,622 కోట్లతో ఈ పరిశ్రమను ఏర్పాటుచేసేందుకు, 1200 మందికి ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. తమకు భారీగా ప్రోత్సాహకాలు అందించాలంటూ ఆ సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి పెట్టుకున్న దరఖాస్తులను గతంలో రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో చర్చించారు. వెంటనే వీటిని ఆమోదం తెలడంతో పరిశ్రమలశాఖ ఉత్తర్వులను జారీ చేసింది. పెట్టుబడి వ్యయంలో 15 శాతం సబ్సిడీగా ఇవ్వాలని, మొత్తం మీద ఇది 25 శాతంగా ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో జరిగిన అమ్మకాలపై రాష్ట్రానికి వచ్చే నెట్ జిఎస్‌టిలో 100 శాతం రీయింబర్స్ చేయాలని కూడా నిర్ణయించారు. విద్యుత్‌పై కూడా కీలక నిర్ణయం తీసుకుంటూ యూనిట్‌కు ఒక రూపాయిని ఐదేళ్లపాటు తిరిగి సంస్థకు చెల్లించనున్నారు. దీని విలువ 40.86 కోట్లుగా ఉంటుంది. అలాగే విద్యుత్‌పై డ్యూటీ మినహాయింపును కూడా రూపాయి చొప్పున మరో 40.86 కోట్లను ఐదేళ్లపాటు అమలు చేయాలని నిర్ణయించడం విశేషం. స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, భూ బదిలీ ఛార్జీలను కూడా 1.20 కోట్ల వరకు తిరిగి సంస్థకు చెల్లించాలని నిర్ణయించారు. ఇలా ఒక పెద్ద సంస్థకు ప్రోత్సాహకాల పేరిట భారీ తాయిలాలు ఇవ్వడంపై అధికారుల్లోనే చర్చ జరుగుతోంది.

పవన్‌తో లారా విలియమ్స్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తో యుఎస్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్ మంగళవారం మంగళగిరిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ భేటీలో పలు అభివృద్ధి కార్యక్రమాల గురించిన అంశాలు చర్చకొచ్చాయి. ఈ భేటీలో యుఎస్ ఎంబసీకి చెందిన మెరెడిత్ మెట్లలర్, యుఎస్ పబ్లిక్ డిప్లమసీ ఆఫీసరు అబ్దుల్ రహిమాన్, హబీబ్, పొలిటికల్ స్పెషలిస్ట్ శిబా త్రిపాఠి ఉన్నారు.

తిరుపతికి చేరుకున్న గవర్నర్

- రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్‌పి ఎల్.సుబ్బారాయుడు ఘన స్వాగతం పలికారు. తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటనలో భాగంగా 16వ తేదీ మంగళవారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న రాష్ట్ర గవర్నర్ అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిరుపతిలోని శ్రీపద్మావతి అతిథి గృహానికి చేరుకున్నారు. స్వాగతం పలికిన వారిలో శ్రీకాళహస్తి ఆర్‌డిఒ భానుప్రకాష్, అడిషనల్ ఎస్‌పి రవి మనోహరా చారి, రేణిగుంట తహశీల్దార్ చంద్రశేఖర్ ఉన్నారు.

టిటిడికి రూ.60 లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల

టిటిడికి చెందిన వివిధ ట్రస్టులకు రూ.60 లక్షలు విరాళం అందింది. తిరుమలలోని టిటిడి క్యాంప్ కార్యాలయంలో చైర్మన్ బిఆర్.నాయుడిని దాతలు కలిసి మంగళవారం విరాళాల డిడిలను అందజేశారు. ఈ మేరకు ఎస్‌వి అన్నప్రసాదం ట్రస్ట్‌కు బెంగళూరుకు చెందిన దాతలు కె.ఎన్.నయన, వి.ప్రభా, ఎస్.రాజేష్, కె.ఎన్.సందీప్ కుమార్, గుంటూరుకు చెందిన దేవరశెట్టి రితీష్, దేవరశెట్టి సత్యనారాయణ రూ.10 లక్షలు చొప్పున మొత్తం రూ.60 లక్షలు విరాళాన్ని డిడిల రూపంలో అందజేశారు. దాతలను చైర్మన్ అభినందించారు.

కత్తిమీద సాము

ప్రజాశక్తి అమరావతి బ్యూరో

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై ఆందోళన

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (ఏకీకృత కుటుంబ సర్వే) బృందాలుకు వివరాలు నమోదు చేయడం కత్తిమీద సాములాగా మారనుంది. ప్రభుత్వ లక్ష్యం సంక్షేమ పథకాలు, ప్రొయాక్టివ్ డెలివరి, మెరుగైన డేటా నాణ్యత కోసం ఇంటింటి సర్వే అని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ సర్వేలో ఉన్న కాలమ్స్ ప్రజల వ్యక్తిగత వివరాలు నమోదుకు ప్రజలు ఎలా సహకరిస్తారో అనే ఆందోళన సర్వే చేపట్టనున్న గ్రామ, వార్డు సచివాలయశాఖ ఉద్యోగులను వెంటాడుతోంది. కుటుంబ ప్రయోజనాల నిర్వహణ వ్యవస్థ (ఎఫ్‌బిఎంఎస్) కోసం సర్వే ప్రక్రియను జనవరి12కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. సర్వేల సందర్భంగా ఆధార్‌తో పాటు వ్యక్తిగత వివరాలు వెల్లడించడం తప్పనిసరికాదని సుప్రీంకోర్టు గతంలో చెప్పినప్పటికీ ఈ సర్వేలో ఆధార్‌తో పాటు కుటుంబ, వ్యక్తిగత వివరాలు సర్వే బృందాలు నమోదు చేయాల్సి ఉంది. అంతేకాకుండా ఆయా వ్యక్తులకు నెలసరి లేక వార్షిక ఆదాయానికి సంబంధించిన పే స్లిప్స్ లేక ఇతర డాక్యుమెంట్లను కూడా ప్రజలు ఇవ్వాల్సి ఉంటుంది. వ్యక్తిగత ఆదాయ వివరాలుతోపాటు వాహనాలు ఉంటే వాటి నెంబర్లు, ఆయా వాహనాలు ఎవరి పేరుతో రిజిస్టర్ అయి ఉన్నాయి? ఒక వేళ కుటుంబ సభ్యులు ఏదైనా పనులు చేస్తుంటే ఎక్కడ పనిచేస్తున్నారు? ఏ సంస్థలో పనిచేస్తున్నారు? వారి ఆదాయానికి సంబంధించిన వివరాలేమిటీ? లాంటి వివరాలు ఈ సర్వేలోనమోదు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో గతంలో హైదరాబాద్ కేంద్రంగా డేటా లీక్ అయ్యిందనే ఆరోపణలు వినిపించాయి. ఈనేపథ్యంలో సర్వేలోనమోదుచేసే వివరాలు ఏ మాత్రం భద్రత,గోప్యతచ ఉంటుందనేఅంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఇలా ఉంటే సీజనల్‌గా వెళ్లివచ్చే వలసకార్మికుల గురించిన వివరాలు నమోదు చేయాల్సి ఉంది. వారు శాశ్వత చిరునామాలో లేని పక్షంలో వారు ప్రస్తుతం ఉన్న చిరునామా? ఏయే పనులు అక్కడ నిర్వహిస్తున్నారనే విషయాలు కూడా సర్వే యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అంతే కాకుండా ఈసర్వేలో ప్రతి ఒక్కరి ఇకెవైసి కూడా చేయాల్సి ఉంటుంది. వీటితో వ్యక్తిగత బేసిక్ ప్రొఫైల్, సోషల్ ప్రొఫైల్, ఎడ్యుకేషన్ అండ్ స్కిల్, ఎంప్లాయిమెంట్, లైవ్‌లీ హుడ్ వివరాలన్ని నమోదు చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా కులాల వారీగా ఏయేకులానికి చెందిన వారు? అందులో ఏ సబ్‌క్యాస్ట్ ఏమిటీ?ప్రస్తుతం ఆ వ్యక్తి ఏమతానికి చెందినవాడనే వివరాలు కూడా నమోదు చేయాలని

సర్వే కాలమ్స్‌లో పేర్కొన్నారు. విద్యార్థులు ఏదైనా కారణంతో డ్రాపవుట్ అయితే ఏ కాలేజీలో అనే వివరాలు కూడా నమోదు చేయాలి. వీటితో పాటు అద్దె ఇళ్లా? లేక సొంత ఇళ్లా? విద్యుత్ వినియోగమెంత? లాంటి వివరాలన్నింటిని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు సర్వే సమయంలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇంతటి కీలకమైన సర్వే అయినప్పటికీ ప్రజల్లో ఈ సర్వే గురించి గ్రామాల్లో దండోరా లేక పత్రికా ప్రకటనలు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ప్రజలు ఎలా రియాక్ట్ అవుతారోననే ఆందోళన సర్వే బృందాల్లో నెలకొనిఉంది.

గోవాడ చెరుకు... సంకిలికే!

- కాటాల వద్ద ఆ ఫ్యాక్టరీ సిబ్బంది
- ధర తగ్గడంతో రైతుల ఆందోళన
- గిట్టుబాటుకాక ఇబ్బందులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గోవాడలోని సుగర్ ఫ్యాక్టరీ మూతపడినట్టేనా ? అంటే అవుననే సమాధానమే వస్తోంది. ఈ ఫ్యాక్టరీపై కూటమి ప్రభుత్వం తన ఎన్నికల హామీని తుంగలో తొక్కింది. ఇక్కడి చక్కెర కర్మాగారాన్ని మూసివేసి, రైతులు పండించిన చెరుకును శ్రీకాకుళం జిల్లాలోని సంకిలి చక్కెర కర్మాగారానికి సరఫరా చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. ఒకప్పుడు లాభాల బాటలో నడిచిన గోవాడ చక్కెర కర్మాగారాన్ని మూసివేయాలన్న తలంపును జీర్ణించుకోలేకపోతున్నారు.

గోవాడ చక్కెర కర్మాగారంలో సుమారు 24 వేల మంది సభ్యులు ఉన్నారు. వీరు పండించిన చెరుకును చక్కెర కర్మాగారం పరిధిలోగల 20 కేంద్రాల ద్వారా సరఫరా చేసేవారు. అప్పుడు గోవాడకు బదులు సంకిలికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. పలు చెరుకు కాటాల ద్వారా చెరుకును సంకిలి చక్కెర కర్మాగార సిబ్బంది సేకరిస్తున్నారు. చెల్లించే ధర విషయంలో వ్యత్యాసం ఉండడంతో రైతులు ఇబ్బందులు పడు తున్నారు. గత ఏడాది గోవాడ చక్కర కర్మాగారం ద్వారా టన్ను ఒక్కంటికి రూ.3151 రూపాయలు ప్రకటించగా, ఈ ఏడాది సంకిలి ఫ్యాక్టరీ వారు మాత్రం రవాణా ఛార్జీలు మినహాయించి రూ.2800 చెల్లిస్తామని తెలిపారు. అది రెండు వారాలకు ఒకసారి మాత్రమే.

గత ఏడాది కంటే ధర తగ్గడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వ్యవసాయ ఖర్చులు పెరగడం, ధర పెరుగుతుందన్న క్రమంలో గోవాడ చక్కెర కర్మాగారం తెరుచుకోకపోవడం వంటి కారణాలతో చెరుకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీంతో సంకిలి యాజమాన్యం అడిగిన ధరకే చెరుకును సరఫరా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు.

10, 11 తేదీల్లో ఫ్లెమింగో పక్షుల పండగ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఫ్లెమింగో ఫెస్టివల్-2026ను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను తక్షణమే ప్రారంభించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్, మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఫ్లెమింగో ఫెస్టివల్-2026 నిర్వహణపై కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, జూ క్యూరేటర్ సెల్వం, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రమణ ప్రసాద్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పులికాట్ సరస్సు పరిసర ప్రాంతాల్లో జనవరి10,11 తేదీల్లో రెండు రోజులు పాటు నిర్వహించబోయే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ఫెస్టివల్‌కు సంబంధించిన మైక్రో ప్లాన్ సిద్ధం చేయడం, తేదీలు ఖరారు చేయడం, కార్యక్రమాలు, పర్యాటక సదుపాయాలు, వేదికల ప్రణాళిక, పులికాట్ -నేలపట్టు, బివి పాల్యం, అటకానితిప్ప, ఇరక్కం ఐలాండ్, ఉబ్బలమడుగు, పెరియపాల్యం తదితర ప్రాంతాలల్లో ఏర్పాట్లు చేయుటపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. అన్ని శాఖలు ప్రణాళికలను సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. అలాగే రాష్ట్ర, జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. వీటికి సంబంధించి పోస్టర్, లోగో, పబ్లిసిటీ, బ్యానర్లు, డిజిటల్ బోర్డు ద్వారా విస్త త ప్రచారం చేసేందుకు ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు.



స్టీల్ కార్మికుల ఆర్థిక సమస్యలు పరిష్కరించాలి

- డైరెక్టర్ ఫైనాన్స్ వినయ్‌కుమార్‌కు వినతి

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖ)

ఏడాదిగా స్టీల్ కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ (ఫైనాన్స్) వినయ్ కుమార్‌ను స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రామస్వామి, జె.అయోధ్యరామ్ కోరారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వినయ్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి నిరంతరాయంగా సాగేందుకు అవసరమైన రా మెటీరియల్ అందుబాటులో ఉండేలా, ఫైనాన్స్ అవరోధాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్టీల్ కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలపై సానుకూలంగా స్పందించి కార్మికులను ఉత్సాహపరిస్తే, వారు మరింత చురుకుగా పనిచేసి ఉత్పాదకతను పెంచేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా కార్మికులకు చెల్లించాల్సిన 355 శాతం బకాయి జీతం, ఈ నెలకు సంబంధించిన 12 శాతం జీతాన్ని వెంటనే చెల్లించాలని కోరారు.



యూనియన్ అధ్యక్షులు యు.రామస్వామి మాట్లాడుతూ, కార్మికులకు హెచ్‌ఆర్‌ఎ చెల్లించకపోవడం, త్రిఫ్ట్ సొసైటీ రికవరీని పునరుద్ధరించడం, ఇఎల్ అమ్ముకునేందుకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఉక్కు నగరంలో నివసిస్తున్న కార్మికుల కరెంటు ఛార్జీలను తగ్గించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. ఈ సమస్యలపైనే హెచ్ జిఎం బినయ్ ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బిఎన్.మధుసూదన్, టివికె.రాజు, బి.మహేష్, ఎ.శ్రీనివాస్, దేముడునాయుడు, శ్రీనివాసరెడ్డి, రామన్న, పవన్, రాజు, వి.మురళి తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల నుంచి విముక్తి కలిగేనా?

- గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్‌లో తాత్కాలిక నివాస కేంద్రం
- సంక్రాంతి నాటికి జిల్లాకు కుంకీ ఏనుగులు

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం జిల్లాను గత కొంతకాలంగా పట్టి పీడిస్తున్న ఏనుగుల బెడద నుంచి మరి కొద్ది నెలల్లో విముక్తి కలగనుందనే వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 12 ఏనుగులు తిరుగుతూ విధ్వంసం సృష్టిస్తున్నాయి. భామిని మండలంలో నాలుగు ఏనుగులు, కొమరాడ, కురుపాం మండలాల్లో మరో ఎనిమిది ఏనుగులు సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఒడిశాలోని లఖేరీ వన్య ప్రాణుల సంరక్షణ కేంద్రం నుంచి తప్పిపోయి జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగులు ఏడేళ్లగా జిల్లాను వెంటాడుతూనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మన్యం ఏజెన్సీ ప్రాంతం వున్నప్పటి నుంచి ఏనుగుల బెడద కనిపిస్తోంది. జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగులు పగటి పూట నిద్రపోతూ రాత్రి వేళల్లో సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తుతున్నాయి. ఏనుగులు గంటకు 62 నుంచి 70 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయి. జిల్లాలో గల ఏనుగులకు అనువైన వాతావరణం, ఆహారం, నీరు పుష్కలంగా లభిస్తుండడంతో ఈ ప్రాంతాన్ని వదిలి పెట్టడం లేదు. మొక్కజొన్న, వరి, అరటి తోటలతో పాటు మర్రి, రావి చెట్ల ఆకులను ఆహారంగా తీసుకుంటాయి. నీరు, ఆహారం కొరత ఏర్పడితే అవి జిల్లాని వీడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ పుష్కలంగా ఆహారానికి కావాల్సిన పంటలు, నీరు దొరుకుతున్న నేపథ్యంలో జిల్లాను వీడని నీడలా వెంటాడుతున్నాయి.

కుంకీల రాకతో ఏనుగుల బెడదకు చెక్

ఏనుగుల బెడదకు కుంకీ ఏనుగులతో చెక్ పెట్టాలనే నిర్ణయానికి అధికారులు వచ్చారు. జిల్లాలో ఉన్న ఏనుగుల బెడద నుంచి విముక్తి పొందాలంటే ప్రభుత్వం ముందు అటవీశాఖ అధికారులు రెండు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఏనుగుల కోసం ప్రత్యేకంగా జోన్ ఏర్పాటు చేయడం లేదా కుంకీ ఏనుగులతో చెక్ పెట్టి జిల్లా నుంచి వేరొక ప్రాంతానికి తరలించడమే మార్గంగా అధికారులు ప్రతిపాదించారు. ఏనుగుల జోన్ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు లేని కారణంగా కుంకీ ఏనుగులతో మచ్చిక చేసుకొని జిల్లా నుంచి ఏనుగులను తరలించడమే ఉత్తమమని అధికారులు భావించారు. ఈ నేపథ్యంలో సీతానగరం మండలం గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో ఏనుగుల కోసం తాత్కాలిక నివాస కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్ భూములు 400 హెక్టార్లలో వున్నాయి. దీనిలో వంద హెక్టార్లలో ఏనుగుల తాత్కాలిక నివాస కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది జనవరి నుంచే పనులు ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రం ఏర్పాటుకు రూ.మూడు కోట్లు నిధులు మంజూరు కావడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ కేంద్రంలో కుంకీ ఏనుగులతో జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులకు శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. తాత్కాలిక నివాస కేంద్రం చుట్టూ సోలార్ విద్యుత్ ఫెన్సింగ్‌తో ట్రెంచ్ ఏర్పాటు చేయడం, నివాసానికి షెడ్ల నిర్మాణం, తాగునీటి కుంటలు, స్నానానికి నీటి కొలనుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అదే విధంగా ఏనుగుల కోసం తాత్కాలిక నివాస కేంద్రంలో ఆహార పంటలు పండిస్తున్నారు. మొక్కజొన్న, ఎలిఫెంట్ గ్రాస్, నేపియర్ గ్రాస్, అరటి, మర్రి, రావి, పనస చెట్లను పెంచుతున్నారు. వచ్చే ఏడాది జనవరి నాటికి జిల్లాకు కుంకీ ఏనుగులు రానున్నాయని ఇటీవల జిల్లా ఇంఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు...డిఆర్‌సి సమావేశంలో ప్రకటించారు. తాత్కాలిక నివాస కేంద్రాన్ని డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్‌తో ప్రారంభిస్తామని చెప్పారు. కుంకీ ఏనుగుల సంరక్షణ, వాటికి శిక్షణ ఇచ్చే మావటీలు, పశువైద్య సిబ్బంది, వన్య ప్రాణుల సంరక్షణ నిపుణుల సమక్షంలో తాత్కాలిక నివాస కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ కేంద్రం లో సిబ్బంది నివాసానికి గదులు, వంట గదులను నిర్మిస్తున్నారు. దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే కర్నాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను తీసుకొచ్చి చిత్తూరు జిల్లా పల్లమనేరులో శిక్షణ ఇస్తున్నారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి కుంకీ ఏనుగుల రాకకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. అంతా అనుకున్న విధంగా జరిగితే జిల్లాలోని ఏనుగలను కర్నూలు జిల్లా శేషాచలం అడవులు లేదా ఒడిశాలోని లఖేరి వన్య ప్రాణుల సంరక్షణ కేంద్రానికి తరలించాలనే యోచనలో వున్నారు.

చివరిదశలో తాత్కాలిక నివాస కేంద్రం పనులు

ఏనుగుల తాత్కాలిక నివాస కేంద్రం ఏర్పాటు పనులు చివరిదశలో ఉన్నాయి. జనవరి 17 నాటికి జిల్లాకు కుంకీలు వస్తాయని భావిస్తున్నాం. కుంకీ ఏనుగులు జిల్లాకు వచ్చిన తర్వాత మొదట భామిని మండలంలోని నాలుగు ఏనుగులతో మచ్చిక చేసి వాటిని తాత్కాలిక నివాస కేంద్రానికి తరలించేందుకు చర్యలు చేపడతాం.

జిఎవిఎస్ ప్రసూన, జిల్లా అటవీశాఖ అధికారి, పార్వతీపురం

నందికొట్కూరులో నిషేధిత ఆల్ఫా జోలం తయారీ కేంద్రంగా నార్కోటిక్ పోలీసులు మంగళవారం గుర్తించారు. ఇటీవల తెలంగాణ ప్రాంతంలో జరిగిన దాడుల్లో నిషేధిత ఆల్ఫాజోలం పదార్థాలు పట్టుకుని విచారించగా నందికొట్కూరులో తయారు చేస్తున్నట్లు గుర్తించి దాడి చేసి పట్టుకున్నారు.

- ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలు

- ప్రతిపక్షాల ఆందోళన మధ్య బిల్లు ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 100 శాతానికి పెంచే బీమా సవరణ బిల్లు (సబ్ కా బీమా సబ్ కా రక్ష)ను ప్రతిపక్షాల నిరసనలను పట్టించుకోకుండా లోక్‌సభ ఆమోదించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టడం, ఆమోదించడం ఒక పూటలోనే జరిగిపోయింది. ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి, అణు విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించడంతోపాటు బీమా రంగంలో ఎఫ్‌డిఐ పరిమితిని 100 శాతానికి పెంచుతున్నారు. సిపిఎం లోక్‌సభ పక్షనేత కె రాధాకృష్ణన్ సహా ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన సవరణలను తిరస్కరించి, ఏకపక్షంగా ఆమోదించింది. బిల్లు చట్టంగా మారితే బీమా రంగంలో విదేశీ గుత్తాధిపత్యాలు భారతదేశంలో పూర్తి స్వేచ్ఛను పొందుతాయి. లాభం ఆధారంగా పనిచేసే విదేశీ కంపెనీల ప్రవేశం ఎల్‌ఐసి వంటి ప్రభుత్వ రంగ బీమా సంస్థలకు, లక్షలాది మంది బీమా ఏజెంట్లకు ముప్పు కలిగిస్తుంది. బీమాయేతర కంపెనీలు బీమా కంపెనీతో విలీనం కావడానికి ఈ బిల్లు అనుమతిస్తుంది. ఛైర్‌పర్సన్, బోర్డు సభ్యుల పదవీకాలం గరిష్టంగా ఐదేళ్లు లేదా 65 ఏళ్ల వయసు వరకు ఉంటుంది. గతంలో బోర్డు సభ్యుల వయోపరిమితి 62 సంవత్సరాల వరకు ఉండేది.

బిల్లును ఉపసంహరించుకోవాలి : కె రాధాకృష్ణన్

చర్చ సందర్భంగా సిపిఎం లోక్‌సభ నేత కె రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. విదేశీ గుత్తాధిపత్య సంస్థలకు ద్వారాలు తెరిచే బీమా సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇది సామాజిక భద్రతకు దూరంగా కార్పొరేట్ ప్రయోజనాల కోసం బీమా రంగాన్ని తెరిచే బిల్లు అని విమర్శించారు. ఈ చర్య ఎల్‌ఐసి, జనరల్ ఇన్సూరెన్స్ వంటి మన ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేస్తుందన్నారు. బీమా రంగంలో పార్లమెంటరీ పర్యవేక్షణ, నియంత్రణ యంత్రాంగాలు నాశనమవుతాయన్నారు. బిల్లుకు ఇచ్చిన 'సబ్ కా బీమా.. సబ్ కీ రక్ష' నినాదం ఆచరణలో అమలయ్యే పరిస్థితి లేదని, అందువల్ల కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని రాధాకృష్ణన్ డిమాండ్ చేశారు.

జగనన్న కాలనీల్లో ఖాళీ స్థలాలపై సర్వే

(మొదటిపేజీ తరువాయి)

ఇళ్ల స్థలాలు కేటాయించగా, ఆరు వేల మంది మాత్రమే ఇల్లు నిర్మించారు. మిగతా స్థలాల్లో కొన్ని కాలనీల్లో గత ప్రభుత్వ హయాంలో మౌలిక సదుపాయాల కల్పన వివిధ దశల్లో ఆగిపోయింది. విద్యుత్ లైన్లు, స్తంభాల నిర్మాణం, తాగునీటి పైపు లైన్లు, లోతట్టు కాలనీలను మెరక చేయడం, కాలనీలకు వెళ్లేందుకు రహదారుల నిర్మాణం వంటి పనులు జరిగాయి. ఇవి కొన్నిచోట్ల పూర్తి కాగా, మరికొన్ని చోట్ల పనులు పలు దశల్లో నిలిచిపోయాయి. గుంటూరు నగరానికి చెందిన 18 వేల మందికి మేడికొండూరు మండలం పేరేచర్ల వద్ద లేఅవుట్‌లో ప్లాట్లు కేటాయించారు. కేవలం 500 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఈ ప్రాంతానికి వెళ్లేందుకు వేలాది మంది విముఖత వ్యక్తం చేశారు. వివిధ ప్రాంతాల్లో నిర్మించిన కాలనీల్లో స్థలాలు కేటాయించినా, అనుకూలంగా లేవని చాలామంది ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదు. మరోవైపు కొత్తగా ఇళ్ల స్థలాల కోసం అధికారులకు దరఖాస్తులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల పరిస్థితి ఏమిటి? ఎంతమంది పొజిషన్‌లో ఉన్నారు? ఎంతమంది ఈ కాలనీలకు రావడానికి సుముఖంగా ఉన్నారు? ఎంతమంది విముఖత వ్యక్తం చేస్తున్నారు? ఎవరికీ కేటాయించకుండా ఖాళీగా ఉన్న స్థలాలు ఎన్ని? అనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఈ విషయంలో రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖల నుంచి పూర్తి స్థాయి సమాచారం రాలేదని, ఈ మూడు శాఖలతో జిల్లాల వారీగా సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గ్రామాలు, పట్టణాల వారీగా వివరాల సేకరణ పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. కొత్తగా పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి ఇంతవరకు ఎటువంటి మార్గదర్శకాలూ జారీ చేయలేదని, ఖాళీ స్థలాలను గుర్తించాలని మాత్రమే చెప్పిందని జిల్లా అధికారులు తెలిపారు. అయితే, ప్రజాప్రతినిధులు మాత్రం చాలా ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న జగనన్న కాలనీల్లోని స్థలాలపై పరిశీలన చేసి కొత్త వారికి స్థలాలు ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం.

విశాఖలో ఏవియేషన్ ఎడ్యుసిటీ

(మొదటిపేజీ తరువాయి)

విమానానికి సంబంధించి దాదాపు వంద రకాల ఉద్యోగావకాశాలు ఏర్పడతాయన్నారు. పౌర విమానయానం అనేది కేవలం ప్రయాణానికి పరిమితం కాకుండా వ్యవసాయం, మౌలిక వసతులు, పరిశ్రమలు, సేవా రంగాలు వంటి అనేక విభాగాలతో అనుసంధానమై ఉంటుందని వివరించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి నెల రోజుల్లో ట్రయల్ రన్స్ ప్రారంభమవుతాయని, జులైలో అధికారికంగా విమానాశ్రయం ప్రారంభం కానుందని తెలిపారు.

రాష్ట్రంలోని యూనివర్సిటీలను ఎడ్యూసిటీలుగా మార్చి, ప్రపంచంలోని ఏ యూనివర్సిటీతోనైనా భాగస్వామ్యం చేసుకునే విధంగా రూపకల్పన చేశామన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ జిఎంఆర్ సంస్థ అధినేతపై ప్రశంసలు కురిపించారు. ఆయన జీవిత ప్రయాణం యువతకు స్ఫూర్తిదాయకమని, పదో తరగతి ఫెయిల్ అయినా తదుపరి మాన్సాస్‌లో చదువు పూర్తి చేసి నేడు ప్రపంచవ్యాప్తంగా విమానాశ్రయాల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఛైర్మన్ జిబిఎస్.రాజు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, విఎంఆర్‌డిఎ కమిషనర్ తేజ్ భరత్, ఉత్తరాంధ్ర ప్రాంత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

'ఉపాధి' కొత్త బిల్లు రాష్ట్రానికి భారం..!



ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

స్వాతంత్ర్యం తరువాత వ్యవసాయ కూలీలకు ఉపాధిని చట్టబద్ధ హామీగా ఇచ్చిన మొట్టమొదటి చట్టం 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం'. మన్మోహన్ సింగ్ నాయకత్వంలో మొదటి యుపిఎ ప్రభుత్వం ఏర్పడిన నాటికి గ్రామీణ భారతం తీవ్ర సంక్షోభంలో ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తోపాటు, మహరాష్ట్ర, బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రైతుల ఆత్మహత్యలు, వ్యవసాయ కూలీల వలసలు భారీగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో వామపక్షాల మీద ఆధారపడిన ఆ ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలులోకి తెచ్చింది. మన రాష్ట్రంలో అనంతపురం జిల్లా నార్పల మండలం బండమీదపల్లి గ్రామంలో నాటి ప్రధాని మన్‌మ్మోహన్‌సింగ్ 2006 ఫిబ్రవరి 2న ఈ పథకాన్ని ప్రారంభించారు. కరువు ప్రాంతాల్లో వలసలను కొద్దిమేరకైన నివారించడానికి, కూలీలు వేతనాలు పెంచుకోవడానికి, అన్నిటికంటే ముఖ్యంగా వ్యవసాయ కూలీల్లో సామాజిక చైతన్యం పెరగడానికి చాలా తోడ్పడింది. ఈ పథకాన్ని మరికొంత సవరణ చేసి చిన్న, మధ్యతరగతి రైతుల భూమిలో రాళ్లు ఏరివేయడం, గట్లు నిర్మించుకోవడం, ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో డ్రైలాండ్ హార్టికల్చర్ ఇందులో చేర్చడంతో ఎస్.సి, ఎస్.టి, బి.సి రైతులకు ఎంతగానో ఉపయోగపడింది. నిత్య కరువు జిల్లాగా వున్న అనంతపురం, రాయలసీమలోని కొన్ని నియోజకవర్గాల్లో ఈ రోజు హార్టికల్చర్ విస్తరించడానికి 'ఉపాధి' చట్టం ప్రధాన కారణం. మన రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కలిపించడంలో ఈ నిధులే కీలకం.

ఇంతటి ప్రాముఖ్యత కలిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి మోడీ ప్రభుత్వం మొదటి నుండి ప్రయత్నిస్తూనే వుంది. నిధులు తగ్గించడం, సకాలంలో రాష్ట్రాలకు నిధులు విడుదల చేయకపోవడంతో అమలు బలహీనపరచింది. ఇప్పుడు ఈ చట్టం మొత్తాన్ని మార్చివేసేందుకు బిల్లును ప్రతిపాదించింది. దీని ప్రకారం ఉపాధి హామీ చట్టంలోని 'హామీ' అనే పదాన్ని తొలగించడం ద్వారా దీని ఊపిరి తీసేసింది. వ్యవసాయ సీజన్‌లో 60 రోజులు ఉపాధి పనులు నిలిపివేయాలని చెప్పడం ద్వారా కూలీలు, రైతుల మధ్య విభజన తీసుకువస్తుంది. రాష్ట్రాల వాటా 40 శాతానికి పెంచడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలపై భారం వేసి ఈ పథకం అమలు కాకుండా చేయాలని నిర్ణయించినట్లు ప్రతిపాదనలు వున్నాయి. కొత్త బిల్లు వల్ల తీవ్రంగా నష్టపోయే గ్రామీణ పేదల గురించి చర్చ జరగకుండా పక్కదారి పట్టించేందుకు ఈ పథకం పేరులోని మహాత్మాగాంధీ పేరును తొలగించారనే విమర్శలు వున్నాయి.

కార్పొరేట్లకు లక్షల కోట్లు రాయితీలు, రుణాల రద్దు చేస్తున్న మోడీ ప్రభుత్వం ఉపాధి కూలీల బిల్లులు మాత్రం సకాలంలో చెల్లించడంలేదు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా రూ. 1340 కోట్లు బకాయిలు వున్నాయి. ఇందులో సుమారు 82 శాతం నాలుగు రాష్ట్రాల్లోనే వున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఉనికికి కీలక మద్ధతుదారుగా వున్న మన రాష్ట్రానికి అత్యధికంగా రూ. 402.93 కోట్లు, ఆ తరువాతి స్థానాల్లో కేరళ రూ. 339.87 కోట్లు, తమిళనాడు రూ. 220.13 కోట్లు పెండింగ్‌లో వున్నాయి. ఇప్పటికే ఈ పరిస్థితి వుంటే రానున్న రోజుల్లో ఈ పథకం అమలు సాధ్యమేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మన రాష్ట్రంలో ఈ చట్టం కింద రిజిస్టర్ అయిన 11 కోట్లమంది కూలీలు, పేదరైతుల్లో 90.54 శాతం మంది క్రియాశీలంగా (యాక్టివ్ వర్కర్స్‌గా) వున్నారు. మన రాష్ట్రానికి ఏటా రూ.10 వేల కోట్లు కేంద్రం నుండి అందుతున్నాయి. కొత్త బిల్లు ప్రకారం 40 శాతం నిధులు అంటే రూ.4 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి వస్తుంది. ఇప్పటికే అప్పుల్లో కూరుకపోయిన మన రాష్ట్రం ఈ భారాన్నీ మోయడం సాధ్యమా? కేంద్రానికి కీలక మద్ధతుదారులుగా వున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు మోడీపై ఒత్తిడి తెచ్చి బిల్లును అడ్డుకుని, రాష్ట్రంలోని వ్యవసాయ కూలీలకు, రాష్ట్రాభివృద్ధికి మద్ధతుగా నిలుస్తారో లేదో చూడాలి.

గాంధీ ఆదర్శాలకు అవమానం : రాహుల్‌గాంధీ

మహాత్మా గాంధీ ఆదర్శాలను కేంద్రం అవమానిస్తోందని లోక్‌సభాపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువత భవిష్యత్తును నాశనం చేసిన మోడీ ప్రభుత్వం.. ఇప్పుడు గ్రామీణ ప్రజలకు కూడా ఉపాధి లేకుండా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మహాత్మా గాంధీ ఆలోచనలు, పేదల హక్కులపై ప్రధాని మోడీకి ముందు నుంచి తీవ్రమైన అయిష్టత ఉంది. గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలనే గాంధీ ఆలోచనకు ఉపాధి హామీ ఓ సజీవ స్వరూపం. ఎన్నో ఏళ్లుగా ఇది లక్షలాది మంది గ్రామీణ ప్రజలకు జీవనాడిగా ఉంది. కోవిడ్ సమయంలో ఈ చట్టం పేదలకు ఆర్థిక భద్రతను ఇచ్చింది. దీన్ని బలహీనపరిచేందుకు కేంద్రం పదేళ్లుగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే దీనిని పూర్తిగా తుడిచిపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు" అని రాహుల్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

కేరళపై ఏటా రూ. 1600 కోట్ల భారం : మంత్రి ఎంబి రాజేశ్

తిరువనంతపురం : ఉద్దేశపూర్వకంగా, దశలవారీగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ)ను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేరళ స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి ఎంబి రాజేశ్ విమర్శించారు. కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త బిల్లు ఉపాధి కల్పించే బాధ్యత నుంచి వైదొలగాలని చూస్తోందని అన్నారు. 40 శాతం వ్యయాన్ని రాష్ట్రాలపైకి బదిలీ చేయడం ద్వారా, కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కటే ఏటా రూ.1600 కోట్లు భరించాల్సి వస్తుందని మంత్రి చెప్పారు. ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన కుటుంబాలకు కనీసం 100 పనిదినాలు కల్పించడం, ఉపాధిని చట్టబద్ధమైన హక్కుగా చేయడం అన్న చట్టం మూల భావనను కొత్త బిల్లులో తొలగించారని అన్నారు. డిమాండ్ ఆధారిత స్వభావం దెబ్బతిందని, ఇకపై ప్రభుత్వ నిర్దేశిత బడ్జెట్, షరతులకు సరిపోతేనే ఉపాధి కల్పిస్తారని, తద్వారా పని కల్పించాలనే కేంద్రం బాధ్యత నుంచి సమర్థవంతంగా వైదొలగుతున్నారని ఆయన అన్నారు. కొత్త చట్టం వ్యయంలో 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపుతూ, నిర్ణయాలు తీసుకోవడంలో ఎలాంటి హక్కులు కల్పించలేదని చెప్పారు. పనిదినాలను వంద నుంచి 125కి పెంచుతామన్న కేంద్రం ప్రకటన 'ఒక డొల్ల వాగ్దానం' అని పేర్కొన్నారు.

వికలాంగుల జీవనోపాధిపై దెబ్బ !

- తక్షణమే కొత్త బిల్లును ఉపసంహరించాలి
- ఎన్‌పిఆర్‌డి సహా పలు వేదికల డిమాండ్

న్యూఢిల్లీ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) స్థానంలో వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) బిల్లు, 2025 -(విబి-జి ఆర్‌ఎఎం జి)ను తీసుకురావాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను జాతీయ వికలాంగుల హక్కుల వేదిక (ఎన్‌పిఆర్‌డి)తో సహా పలు సంస్థలు, సంఘాలు, తీవ్రంగా వ్యతిరేకించాయి. తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశాయి. ఒకపక్క అంగవైకల్యంతో బాధపడేవారు మరోపక్క నిరుద్యోగం, కటిక దారిద్ర్యంతో కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటారని, అలాంటివారికి ఈ పథకం ద్వారా కొద్దిపాటి అవకాశాలనైనా కల్పించేదని ఆ సంఘాలు పేర్కొన్నాయి. పరిమిత స్థాయిలో లభించే ఈ ఉపాధి కూడా గత కొద్ది సంవత్సరాలుగా తీవ్రమైన నిధుల లేమితో ఇబ్బందులను ఎదుర్కొంటోంది. పైగా పనులను తిరస్కరించడం, డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థలు విఫలం కావడం, పని ప్రదేశాల్లో సహేతుకమైన వసతి లేకపోవడం వంటి ఇబ్బందులు పట్టి పీడిస్తూ వచ్చాయని ఎన్‌పిఆర్‌డి సహా సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. 2023-24లో ఈ పథకం కింద 6,38,088మందికి ఉపాధి కల్పించినట్లు రాజ్యసభ ప్రశ్నోత్తరాల ద్వారా తెలిసింది.

ఈ దశలో ఈ చట్టం స్థానంలో వేరేది తీసుకురావాలన్న ఆలోచనతో వికలాంగులైన గ్రామీణ కార్మికుల జీవనోపాధి మరింత దెబ్బతింటుందని వారు పేర్కొన్నారు. తద్వారా వారు మరింత పేదరికంలోకి నెట్టబడతారని అన్నారు. కొన్ని పరిమితులు వున్నా ఈ చట్టం కింద వైకల్యం వున్న వ్యక్తులను ఉపాధికి అర్హమైనవారుగా చట్టబద్ధంగా గుర్తించారు. వారికి అర్హమైన పనులను ఇస్తూ వారికి ఉపాధి రక్షణ కల్పించారు. కానీ కొత్తగా తీసుకువస్తున్న ప్రతిపాదిత బిల్లు ఈ హక్కును నీరుగారుస్తోందని విమర్శించారు. వికలాంగులను మినహాయించడాన్ని కూడా చట్టబద్ధం చేస్తోందన్నారు. తద్వారా వికలాంగుల ఉపాధి ముప్పులో పడుతోందని ఆయా సంస్థలు పేర్కొన్నాయి. వికలాంగుల హక్కుల చట్టం, 2016ను ప్రతిపాదిత బిల్లు ఉల్లంఘిస్తోంది. ఈ పరిస్థితుల్లో తక్షణమే కొత్త బిల్లును ఉపసంహరించాలని ఎన్‌పిఆర్‌డి, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక, తెలంగాణా, పలు రాష్ట్రాల వికలాంగుల హక్కుల సంస్థలు డిమాండ్ చేశాయి. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎను కాపాడేందుకు ఇతర ప్రజాస్వామ్య సంఘాలతోకలిసి పోరాడతామని పేర్కొన్నాయి.

బిబిసిపై రూ.90 వేల కోట్లకు దావా

- మీడియాను బెదిరిస్తున్న ట్రంప్



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ బిబిసిపై మయామి ఫెడరల్ కోర్టులో సోమవారం దావా వేశారు. 2021లో అధ్యక్ష ఎన్నికల అనంతరం క్యాపిటల్ హిల్‌పై జరిగిన దాడి సందర్భంగా ట్రంప్ మాటలను బిబిసి తారుమారు చేసిందని ట్రంప్ ఆరోపించిన సంగతి తెలిసిందే. అయితే దీనికి సంబంధించి తనకు పరువు నష్టం జరిగిందంటూ ట్రంప్ రూ.90,580 కోట్లకు దావా వేశారు. 2024 ఎన్నికలకు ముందు బిబిసి ప్రధాన కరెంట్ అఫైర్స్ ప్రోగ్రామ్ పనోరమాలో ప్రసారం చేసిన ఒక డాక్యుమెంటరీపై ఈ దావా నమోదైంది. దీనిలో ట్రంప్ 2021 జనవరి 6న చేసిన ప్రసంగంలోని రెండు వేర్వేరు భాగాలను కలిపిన ఫుటేజ్‌ని ప్రసారం చేసింది. ఇది జో బైడెన్ ఎన్నికల విజయాన్ని ముందుగానే ప్రకటిస్తుంది. మరోవైపు ఓటమిని అంగీకరించకుండా ట్రంప్ క్యాపిటల్‌పై దాడి చేయాలని మద్దతుదారులను రెచ్చగొట్టినట్లు అందులో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ వీడియోను 2024 ఎన్నికలకు రెండు వారాల ముందు ప్రసారం చేసింది. అధ్యక్ష ఎన్నికల్లో బిబిసి జోక్యం చేసుకుని బైడెన్‌కు మద్దతుగా పని చేసిందని ట్రంప్ ఆరోపించారు. ఈ వివాదం బిబిసిని కుదిపేసింది. దీనికి భాధ్యత వహిస్తూ డైరెక్టర్ జనరల్, న్యూస్ ఎగ్జిక్యూటివ్ రాజీనామా చేయాల్సి వచ్చింది. చట్టపరమైన పరువునష్టం కలిగించారనే వాదనను బిబిసి ఖండించింది. అయితే జరిగిన దానికి క్షమాపణలు కోరుతూ ఛైర్మన్ సమీర్ షా ట్రంప్‌నకు లేఖ కూడా రాశారు. ట్రంప్ తరపున వాదిస్తున్న న్యాయవాదుల బృందం బిబిసి యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా, దురుద్దేశంతోనే ఫేక్ వీడియోను ప్రసారం చేసిందని తద్వారా ఆయన పరువుకు నష్టం కలిగించిందని ఆరోపించారు. రెండోవసారి అమెరికా అధ్యక్షులుగా ఎన్నికైన ట్రంప్ తరచూ మీడియాను టార్గెట్ చేస్తున్నారు. గత సంవత్సరం న్యూయార్క్ టైమ్స్‌పై 15 బిలియన్ల డాలర్ల పరువు నష్టం దావాను ట్రంప్ ప్రభుత్వం దాఖలు చేసింది.ఆ సంస్థలోని నలుగురు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని వేధించింది. వీటితో పాటు కమలా హారిస్‌తో 60 నిమిషాల పాటు ఇంటర్వ్యూ చేసినందుకు సిబిఎస్ న్యూస్‌పై దావా వేశారు. ఎన్నికల పోల్‌ను ప్రకటించినందుకు 'ది డెస్ మోయిన్స్ రిజిస్టర్'పై మరో దావా వేసి ఇబ్బంది పెట్టారు. ట్రంప్ స్నేహితుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు ఉన్న సంబంధాల గురించి నివేదించినందుకు ది వాల్ స్ట్రీట్ జర్నల్, రూపెర్ట్ ముర్డోక్‌లపై 10 బిలియన్ డాలర్లు దావా వేసింది. అలాగే 15 మిలియన్ల డాలర్లను ట్రంప్ అధ్యక్ష ఫౌండేషన్‌కు చెల్లించి ఎబిసి న్యూస్ దావా నుండి బయటపడింది. ఇప్పుడు తాజాగా పరువు నష్టం పేరుతో బిబిసిని బెదిరించడం గమనార్హం.

కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.200.16 లక్షల కోట్లు!

- రాజ్యసభలో ప్రభుత్వ అంచనా వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2025-26 బడ్జెట్ అంచనాల ప్రకారం కేంద్రప్రభుత్వ మొత్తం అప్పు రూ.200.16 లక్షల కోట్లకు పెరుగుతుంది. రాజ్యసభలో సిపిఎం ఎంపి వి శివదాసన్ అడిగిన ప్రశ్నకు ఆర్థిక మంత్రిత్వశాఖ ఇచ్చిన సమాధానంలో ఈ విషయం పేర్కొంది. 2020-21లో మొత్తం కేంద్రం అప్పు రూ.121.86 లక్షల కోట్లు, ఇందులో రూ.115.71 లక్షల కోట్లు దేశీయ అప్పు, రూ.6.15 లక్షల కోట్లు విదేశీ అప్పు ఉంది. 2024-25లో కేంద్ర అప్పు రూ.177.20 లక్షల కోట్లు, దేశీయ అప్పు, రూ.8.74 లక్షల కోట్లు విదేశీ అప్పులు ఉన్నాయి. 2025-26 బడ్జెట్ అంచనాల ప్రకారం, కేంద్రం అప్పు రూ.200.16 లక్షల కోట్లకు మరింత పెరుగు తుందని ఆర్థిక మంత్రిత్వశాఖ సమాధాన ంలో తెలిపింది. జూన్ 30, 2025 వరకు మాత్రమే కేంద్రం రూ.3.72 లక్షల కోట్ల కొత్త దేశీయ రుణాన్ని, రూ.0.23 లక్షల కోట్ల విదేశీ రుణాన్ని తీసుకుంది. ఇటీవల సంవత్సరాల్లో వడ్డీ చెల్లింపులు కూడా పెరిగాయి. 2020-21లో రూ.6.80 లక్షల కోట్ల వడ్డీ చెల్లింపులు 2024-25లో రూ.11.16 లక్షల కోట్లకు పెరిగాయి. విడుదల చేసిన గణాంకాలు కేంద్ర ప్రభుత్వం ఆదాయ సేకరణను బలోపేతం చేయడానికి బదులుగా రుణాలపై ఎక్కువగా ఆధారపడుతున్నట్లు చూపిస్తున్నాయి.

కేరళలో ప్రసూతి మరణాల రేటు అత్యల్పం

కేరళలో ప్రసూతి మరణాల రేటు అత్యల్పంగా ఉందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ ప్రచారానికి సంబంధించి సిపిఎం ఎంపి ఎఎ రహీమ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి అనుప్రియ పాటిల్ ఇచ్చిన సమాధానంలో పేర్కొన్నారు.

2021 నుంచి 2023 వరకు కేరళలో ప్రసూతి మరణాల రేటు కేవలం 30 అని అన్నారు. అదే సమయంలో ప్రసూతి మరణాల రేటు బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్ 141, మధ్యప్రదేశ్ 142, బీహార్ 104, ఒడిశా 153, హర్యానా 81గా ఉంది. కేరళ ప్రభుత్వం ఆరోగ్య రంగంలో చేస్తున్న అభివృద్ధి పనుల ఫలితమే ఈ విజయమని ఎఎ రహీమ్ అన్నారు. తల్లులు, పిల్లల ఆరోగ్య సంరక్షణలో కేరళ.. ఇతర రాష్ట్రాలకు ఒక నమూనా అని ఆయన అన్నారు.

విద్యా కమిషన్ బిల్లుకు జెపిసి ఏర్పాటు

లోక్‌సభ ఉన్నత విద్యా కమిషన్ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి నివేదించింది. బిల్లును జెపిసికి సూచించాలన్న కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సిఫార్సును మూజువాణి ఓటుతో ఆమోదించారు. లోక్‌సభ నుండి 21 మంది ఎంపిలు, రాజ్యసభ నుండి 10 మంది ఎంపిలతో కూడిన ఈ కమిటీ బిల్లును పరిశీలిస్తుంది. బడ్జెట్ సమావేశాల మొదటి అర్ధభాగం చివరి రోజున కమిటీ తన నివేదికను సమర్పిస్తుంది. ఉన్నత విద్యా సంస్థలను రాష్ట్రపతి నియమించిన ఉన్నత విద్యా కమిషన్ నియంత్రణలోకి తీసుకొచ్చే ఈ బిల్లు, కేంద్ర ప్రభుత్వం విద్యా రంగంపై తన పట్టును కఠినతరం చేయడానికి దారితీస్తుందని విమర్శలున్నాయి.

బెంగాల్‌లో 58 లక్షలకు పైగా ఓటర్ల తొలగింపు

- ఎస్‌ఐఆర్‌తో ముసాయిదా జాబితా విడుదల చేసిన ఇసి

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్‌ఐఆర్) పేరుతో 58 లక్షలకు పైగా ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారు. షెడ్యూల్ కంటే ఒక రోజు ముందుగానే ముసాయిదా జాబితాను ఎన్నికల కమిషన్ మంగళవారం ప్రచురించడం గమనార్హం. మృతి చెందడం, వలసలు, గణన ఫారాలు సమర్పించకపోవడం వంటి పలు కారణాలతో 58 లక్షలకు పైగా పేర్లు తొలగించామని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఎస్‌ఐఆర్ ప్రక్రియకు ముందు 7,66,37,529 ఓటర్ల లిస్టులో పేర్లు ఉండగా, తరువాత 7,08,16,631 మంది పేర్లు మాత్రమే ఉన్నాయి. అంటే 58,20,898 మంది పేర్లను తొలగించారు. ముసాయిదా జాబితాను బూత్‌లు వారీగా, తొలగింపునకు గల కారణాలతో సహా పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రధాన అధికారి (సిఇఒ) వెబ్‌సైట్, ఎన్నికల కమిషన్ ఓటర్ పోర్టల్, ఇసిఐఎన్ఇటి అప్లికేషన్‌లో అందుబాటులో ఉంచారు. తొలగించిన ఓటర్ల వివరాలను సిఇఒ వెస్ట్ బెంగాల్ వెబ్‌సైట్‌లో ఉంచారు. తొలగించిన ఓటర్లపై వారం రోజుల్లో విచారణ ప్రక్రియ ప్రారంభమవుతుందని, విచారణ నోటీసుల ముద్రణ, సంబంధిత ఓటర్లకు వాటిని అందించడం, ఇసి డేటాబేస్‌లో డిజిటల్ బ్యాకప్‌ను సృష్టించడం వంటి పనులు జరుగుతాయని అధికారులు తెలిపారు. ఈ ఏడాది జనవరిలో ఉన్న ఓటర్ల జాబితా ప్రకారం ఎస్‌ఐఆర్ ప్రక్రియను నిర్వహించారు. తొలగించిన పేర్లను, తొలగించడానికి కారణాన్ని ప్రత్యేక పోర్టల్ ద్వారా చూడవచ్చు. గణన ఫారాలు సమర్పించని కారణంగా ఎక్కువమంది ఓటర్ల పేర్లు తొలగించినట్లు ఎన్నికల కమిషన్ తెలపటం గమనార్హం. ఒకటి కంటే ఎక్కువ బూత్‌ల్లో పేరు ఉండటం, వలస వెల్లడం, జాడ తెలియక పోవడం, నకిలీ ఓటర్లు.. వంటి కారణాలతోనూ పేర్లు తొలగించినట్లు పేర్కొంది. గతవారంలో సిఇఒ కార్యాలయం విడుదల చేసిన సమాచారం ప్రకారం జాబితాలో 24,16,852 మందిని మరణించారు. 19,88,076 మంది శాశ్వతంగా వలస వెళ్లారు. 12,20,038 మంది అదృశ్యం లేదా వారి రిజిస్టర్డ్ చిరునామాల్లో జాడ కనిపించడం లేదని, మరో 1.38 లక్షల మంది ఓటర్లు నకిలీ ఎంట్రీలుగా గుర్తించారు. మరో 1,83,328 మందిని గుర్తు తెలియని ఓటర్లుగా గుర్తించారు. ఇతర సమస్యల కింద 57 వేల కంటే ఎక్కువ పేర్లను తొలగించారు. మొత్తంగా 58,20,989 మంది పేర్లను తొలగించారు. 2026 జనవరి 15 వరకూ క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. బెంగాల్‌లో నవంబర్ 4న ఎస్‌ఐఆర్ ప్రక్రియ ప్రారంభమై, ఈ నెల 11న ముగిసింది. ముసాయిదా జాబితాలో భారీగా పేర్లను తొలగించడం బిజెపి, ఇసి కుట్ర అని టిఎంసి ఆరోపించింది. సుమారు రెండు కోట్ల మంది ఓటర్లను బెదిరించడానికి, వారి పౌరసత్వాన్ని ప్రశ్నించడానికి చేసిన ప్రయత్నంగా అభివర్ణించింది.

అంత్యక్రియలు నిర్వహించండి : జాబితాలో మరణించినట్లు పేర్కొనడంపై ఓటరు ఆగ్రహం

ముసాయిదా జాబితాలో దంకుని మునిసిపాలిటీ 18వ వార్డుకు చెందిన కౌన్సిలర్ సూర్య మరణించారంటూ జాబితా నుంచి పేరు తొలగించారు. కొల్‌కతా సమీపంలోని శ్మశానవాటికకు వెళ్లి తన అంత్యక్రియలు ఇసి నిర్వహించాలంటూ నిరసన తెలిపారు.

కొత్త అణు చట్టాన్ని ఉపసంహరించాలి

- ప్రజల భద్రతను ప్రమాదంలోకి నెట్టవద్దు
- ఇఇఎఫ్ఐ డిమాండ్

న్యూఢిల్లీ : అణు ఇంధన చట్టం-1962, అణు నష్టపరిహార పౌర బాధ్యత చట్టం-2010 ఈ రెండింటినీ రద్దు చేసి వాటి స్థానంలో ఎస్‌హెచ్‌ఎఎన్‌టిఐ (సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) బిల్, 2025ను కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ చర్య భారతదేశ అణు చక్రపరిధి యంత్రాంగంపై తీవ్రమైన, ప్రమాదకరమైన దాడి అని భారత విద్యుత్ ఉద్యోగుల సమాఖ్య (ఇఇఎఫ్ఐ) పేర్కొంది. కీలకమైన భద్రతా, జవాబుదారీ యంత్రాంగాలను ఈ బిల్లు తొలగిస్తోందని, అత్యంత సున్నితమైన, ప్రమాదకరమైన ఇంధన రంగానికి పెద్ద ఎత్తున ప్రైవేటు, విదేశీ ప్రాతినిధ్యానికి తలుపులు తెరుస్తోందని విమర్శించింది. అణు ఇంధనానికి సంబంధించిన చట్టాలకు మార్పులు చేయడానికి ముందుగా ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించి, పూర్తి స్థాయిలో పారదర్శక రీతిలో ప్రజా విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది. ఇందులో అన్ని వర్గాల ప్రజలు, అలాగే స్వతంత్ర సాంకేతిక నిపుణులు పాల్గొనాలని కోరింది. అనంతరం పార్లమెంటరీ సెలక్ట్ కమిటీని నివేదించాలని కోరింది. ఇందుకు సంబంధించి తీసుకువచ్చే ఏ కొత్త చట్టమైనా నిజమైన స్వతంత్ర అణు భద్రతా అథారిటీని నిర్వచించాలని ఇఇఎఫ్ఐ డిమాండ్ చేసింది. మన దేశ భద్రత, సార్వభౌమాధికారానికే మనం ప్రాధాన్యతనివ్వాలని పేర్కొంది. ప్రైవేటు ప్రాతినిధ్యాన్ని కీలకమైన ఆర్థిక లక్ష్యంగా పేర్కొంటున్న ఈ బిల్లు కార్మికుల రక్షణ యంత్రాంగాన్ని, ఉపాధి భద్రతను బలోపేతం చేసేందుకు ప్రాధాన్యతనివ్వలేదని పేర్కొంది. కాంట్రాక్టర్లు, సరఫరాదారులకు లైసెన్సులిచ్చే క్లాజుల్లో కఠినమైన కార్మిక ప్రమాణాలు లేవని, యూనియన్ గుర్తించిన హక్కులు గురించి ప్రస్తావన లేదని, తప్పనిసరిగా తీసుకోవాల్సిన భద్రతా శిక్షణా నిబంధనలు లేవని ఇఇఎఫ్ఐ పేర్కొంది. ఒకవేళ ఉల్లంఘనలు జరిగితే తీసుకునే చర్యలు, విధించే శిక్షల గురించి కూడా లేదని పేర్కొంది. నిరంకుశమైన ఈ బిల్లును తీవ్రంగా నిరసిస్తూ ఆందోళనలు చేపట్టాల్సిందిగా విద్యుత్ ఉద్యోగులకు, ఇంజనీర్లకు, ప్రజలకు ఇఇఎఫ్ఐ పిలుపునిచ్చింది.



స్టాంపును విడుదల చేస్తున్న వెంకయ్యనాయుడు

బహుముఖ ప్రజ్ఞావంతుడు ఆరుద్ర

- శతజయంతి స్టాంపు విడుదలలో వెంకయ్య నాయుడు

ప్రజాశక్తి ప్రతినిధి - హైదరాబాద్

ఆరుద్ర గొప్ప కవి రచయిత, పరిశోధకుడు, బహుముఖ ప్రజ్ఞావంతుడని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు కొనియాడారు. ఆరుద్ర శతజయంతి సందర్భంగా తపాలా శాఖ విడుదల చేస్తున్న ప్రత్యేక తపాలా బిళ్లను ఒక హోటల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆరుద్ర రచనలనూ, జీవితాన్ని ప్రస్తావిస్తూ - ఇన్ని రంగాల్లో ప్రతిభాపాటవాలుండటం అరుదైన విషయమని అన్నారు. ఆరుద్ర పాటలు సినిమా రంగానికి సాహిత్య విలువ పెంచాయని పేర్కొన్నారు. త్వమేవాహం కావ్యం అందరికీ కొరుకుడు పడకున్నా కూనలమ్మ పదాల వంటివి తెలిగ్గా ప్రాచుర్యంలోకి వచ్చాయని చెప్పారు. ఆరుద్ర హేతువాది అని, యాంత్రికంగా జీవితం గడపకుండా జరిగే విషయాలను విమర్శనాత్మకంగా చూసి ఏది ఎందుకు జరిగేది అర్థం చేసుకోవడమే హేతువాదమని అన్నారు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాల్లాగే ఆరుద్ర జీవితం కృషి కూడా సమగ్రమైనవని నివాళులర్పించారు. ఇద్దరు కలిపి రచనలు చేస్తే జంటకవులు అని అంటున్నట్టే- ఆరుద్ర రామలక్ష్మి దంపతులను కవి జంట అనొచ్చని చమత్కరించారు. రాముడి మీద ఆయన పాటలు రోజూ వినిపిస్తుంటాయని, అయితే రాముడికి సీత ఏమవుతుంది అంటూ ఆయన చేసిన రచన రామాయణంపై పరిశోధనకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రశంసించారు.

ప్రజాశక్తి ప్రచురణపై స్పందన

ఈ సందర్భంగా ప్రజాశక్తి పూర్వ సంపాదకులు తెలకపల్లి రవి... శతజయంతి ప్రచురణగా తీసుకొచ్చిన ఆరుద్ర రచన 'నా జీవితం కమ్యూనిజానికే అంకితం' అతిథులకు అందజేశారు. వెంకయ్యనాయుడు ఆ పుస్తకాన్ని పరిచయం చేశారు. 'ఆయన కమ్యూనిజానికి అంకితం అంటే నేను నా జీవితమంతా కమ్యూనిజానికి వ్యతిరేకంగానే మాట్లాడాను. ఎవరు నమ్మింది వారికి నిజమనిపిస్తుంది. అంతిమంగా నిలిచేదేదో కాలమే తేలుస్తుంది' అని వ్యాఖ్యానించారు. తెలుగు భాషను, సాహిత్యాన్ని కాపాడుకోవడానికి ఆరుద్ర జీవితం స్ఫూర్తినిస్తుందని అన్నారు.ఈ సందర్భం కోసం అమెరికా నుంచి వచ్చిన ఆరుద్ర కుమార్తె కవిత డి.చింతామణి, తమ ఇంట్లో ఎన్నెన్ని పుస్తకాలు వుండేవో, ఏదైనా చదువుకొమ్మంటూ తల్లిదండ్రులు తమను ఎలా ప్రోత్సహించారో వివరించారు. ఆమె కుమారుడు ప్రముఖ ఇంగ్లీషు రచయిత గౌతమ్ చింతామణి, ఆరుద్రపై పిహెచ్‌డి చేసిన సంగయ్య కూడా సభలో మాట్లాడారు. తపాలాశాఖ డైరెక్టర్ జనరల్ కూడా పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టు డా.దుర్గ వడ్లమాని సభను నిర్వహించారు.



మీడియాతో మాట్లాడుతున్న జగన్, పక్కన జోజీనగర్ వాసులు

ఇళ్ల కూల్చివేతలపై సిబిఐ విచారణ

- మాజీ సిఎం జగన్ డిమాండ్
- జోజీనగర్ బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

భవానీపురంలో ఇళ్ల కూల్చివేతలపై సిబిఐ విచారణ జరిపించాలని మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. విజయవాడలోని జోజీ నగర్ కరెంట్ ఆఫీస్ రోడ్డులోని 42 ప్లాట్ల స్థల యజమానులు, ఇళ్ల కూల్చివేతలో నష్టపోయిన బాధిత కుటుంబాలను మంగళవారం జగన్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు తమ గోడును వెళ్లబోసుకున్నాయి. తమకు జరిగిన అన్యాయాన్ని వివరించడంతో పాటు కూల్చివేతలకు సంబంధించిన ఫొటోలను చూపించాయి. ఐదేళ్లగా ఇక్కడే ఉంటున్నామని, తమవన్నీ పట్టా భూములేనని, చట్టపరంగా అనుమతులున్నాయని జగన్‌కు వివరించారు. నగరపాలక సంస్థకు ఇంటి పన్ను, నీటి పన్ను, కరెంట్ బిల్లులు కడుతూ వచ్చామని, తమ ఇళ్లను అన్యాయంగా కూల్చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని, అన్నివిధాల సాయం అందిస్తామని జగన్ వారికి భరోసానిచ్చారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ... సుప్రీం కోర్టు స్టే ఇచ్చినప్పటికీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఇళ్లను కూల్చివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో లోకేష్, కేశినేని చిన్ని, జనసేన కార్పొరేటర్ సోదరుడి ప్రమేయం ఉందని ఆరోపించారు. 42 ప్లాట్లలోని ఇళ్లకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి ఉందని, బ్యాంకులు సైతం ఇళ్లు కట్టుకునేందుకు బాధితలకు హౌస్‌లోన్లు ఇచ్చాయన్నారు. స్థలం ఇంకొకరిదే అయితే కరెంట్, డ్రెయినేజ్ పర్మిషన్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రైవేట్ వ్యక్తులకు మద్దతు ఇచ్చి జెసిబిలతో ఇళ్లు కూల్చేస్తారా అని నిలదీశారు. స్థలం క్రయవిక్రయాలు జరిగే సమయంలో అభ్యంతరాలు ఉంటే చెప్పమని పేపర్ ప్రకటనలు కూడా ఇచ్చారని పేర్కొన్నారు. చంద్రబాబు, లోకేష్, కేశినేని చిన్ని, జనసేన కార్పొరేటర్ అంతా ఒక్కటై కుట్ర చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రుహుల్లా, తలశిల రఘురాం, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్‌టిఆర్ వైసిపి జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, గుంటూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జి పోతిన మహేష్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు, వైసిపి కార్పొరేటర్లు, పార్టీ నేతలు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చారిత్రక పోరాట కాలం

1926-29లో సమ్మెలతో సంఘటితమైన కార్మికులు

భారత కార్మికోద్యమంలో 1926-29 మధ్య కాలం చారిత్రక ప్రాధాన్యత కల్గిన సంఘటనలతో కూడినది. ఈ సమయంలోనే రైల్వే, జనపనార, నూలు బట్టల పరిశ్రమలలో, ఇనుము-ఉక్కు కర్మాగారంలో బ్రహ్మాండమైన సమ్మెలు జరిగాయి. ఈ సమ్మెలన్నింటిని కమ్యూనిస్టులు చేసే కుట్రలుగా చిత్రించడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. నిజానికి ఎడతెగని సమస్యలతో సతమతమవుతున్న కార్మికవర్గం తమ తీవ్ర అసంతప్తిని వెల్లడించడానికి మాత్రమే ఈ సమ్మెలు నిర్వహించింది. సమ్మె పోరాటాలతో సామ్రాజ్యవాద ప్రభుత్వం కార్మికులపై సైన్యాన్ని సైతం ప్రయోగించింది. తుపాకి గుళ్లకు, బాయ్‌నెట్ల తూట్లకు, లాఠీ దెబ్బలకు, అరెస్టులకు, జైలుశిక్షలకు ఏమాత్రం వెరవకుండా వారు పోరు సాగించారు.



దేశంలోని కార్మికులు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న రోజులవి! జీతాలు కనీస అవసరాలు తీర్చుకునేందుకు కూడా చాలకపోవడంతో అప్పుల పాలయ్యారు. కనీస వేతనం వంటి కార్మికుల న్యాయమైన కోర్కెలను తిరస్కరించటం, యూనియన్‌ను గుర్తించడానికి నిరాకరించడం, పని ప్రాంతాల్లో వివక్షలకు తోడు సామ్రాజ్యవాదుల వలస కార్మిక విధానాల వలన పరిస్థితులు మరింత దిగజారడంతో దేశవ్యాప్తంగా బ్రహ్మాండమైన సమ్మె పోరాటాలు చెలరేగాయి. నూలు బట్టల పరిశ్రమలో 110 సమ్మెలు, జనపనార పరిశ్రమలో 19 సమ్మెలు, ఇంజనీరింగ్ పరిశ్రమలో 11 సమ్మెలు, రైల్వేలు, రైల్వేవర్కు షాపుల్లో 9 సమ్మెలు, బొగ్గు గనిలో ఒక సమ్మె జరిగాయి.

బెంగాల్-నాగపూర్ రైల్వేలో ఖరగ్‌పూర్ కార్మికుల సమ్మె

1927లో ఖరగ్‌పూర్ కార్మికులు సాగించిన రెండు దీర్ఘకాల సమ్మె పోరాటాలు ప్రముఖ స్థానం ఆక్రమించాయి. ప్రభుత్వ యంత్రాంగం అనుసరించిన కార్మిక వ్యతిరేక విధానాల వల్లనే కార్మికులు సమ్మెకు పూనుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వం సమ్మెను విచ్ఛినం చేయడానికి భయోత్పాతాన్ని సృష్టించింది. రిట్రెంచ్‌మెంట్ దాడిని తిప్పికొట్టేందుకు ఖరగ్‌పూర్‌లో కార్మికులు మొదటిసారి సమ్మె జరిపారు. కాని రెండవసారి లాకౌట్ ప్రకటించడం ద్వారా యాజమాన్యమే కార్మికులపై సమ్మెను బలవంతంగా రుద్దింది. ప్రభుత్వ యాజమాన్యాలు ప్రతీకారంతో చేస్తున్న దాడులను ప్రతిఘటించడానికి జరిగిన పోరాటంలో ఖరగ్‌పూర్ కార్మికులు ఇంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగని ఐక్యత, ధైర్యం, దృఢసంకల్పం ప్రదర్శించారు.

లీలువాలో ఈస్టిండియా రైల్వే కార్మికుల సమ్మె

కలకత్తా సమీపాన వున్న లీలువా దగ్గర ఈస్టిండియా రైల్వే కార్మికులు 1928 మార్చిలో సమెకు దిగారు. జీతాల పెంపు, మరికొన్ని రాయితీల కోసంఒక వర్క్‌షాపులోని కార్మికులు చేసిన ఈ డిమాండ్లను తిప్పికొట్టేందుకు యాజమాన్యం 'డిస్మిస్'కు పాల్పడంతో సమ్మె క్రమేణా తీవ్ర రూపం దాల్చింది. కార్మికులు సమ్మె ప్రదర్శన తరువాత ఇళ్ళకు తిరిగి వెళుతుండగా పోలీసులు హఠాత్తుగా కాల్పులు జరిపారు. కాల్పులలో ఇద్దరు కార్మికులు చనిపోయారు, పలువురు గాయపడ్డారు. కనీస ఆర్థిక కోర్కెల సాధనకు సాగుతున్న పోరాటాలను అణచడానికి సామ్రాజ్యవాద ప్రభుత్వం ఎంత బహిరంగంగా తన యంత్రాంగాన్ని, సైనిక బలాలను నిర్దాక్షిణ్యంగా, నిరంకుశంగా ఉపయోగించేది కార్మికవర్గం గుర్తించింది.

దక్షిణ భారత రైల్వేలో సమ్మె

తూర్పు ఇండియా రైల్వే సమ్మె తరువాత (1928 జులై 20న) దక్షిణ భారత రైల్వే కార్మికులు సమ్మె చేశారు. కేవలం పది రోజులే జరిగినప్పటికీ ఈ సమ్మె ప్రాధాన్యతను సామ్రాజ్యవాద ప్రభుత్వం పూర్తిగా కొట్టివేయలేకపోయింది. విన్సెంట్ రావెన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రిట్రెంచ్‌మెంట్ చేయడానికి యాజమాన్యం పూనుకొనడంతో ఈ సమ్మె చెలరేగింది. ఈ సమ్మె పర్యవసానంగానే విడివిడిగా పోరాటాలు సాగించడంవలన తరచుగా అపజయాన్నే ఎదుర్కొనవలసి వస్తోందన్న సత్యాన్ని కార్మికవర్గం గుర్తించింది.

గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వేలో సమ్మె

గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వేలో 1930 ఫిబ్రవరి 4న సమ్మె జరిగింది. వేతనాల పెంపు, డిస్మిసల్స్ తదితర కక్ష సాధింపు చర్యల నిలిపివేత, రిట్రెంచ్‌మెంటుకు స్వస్తి చెప్పాలనేవి కార్మికుల ప్రధాన కోర్కెలు. కాని రైల్వే యాజమాన్యం యథావిధిగా సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి భయోత్పాతాన్ని సృష్టించింది. కార్మికులపై పోలీసులను, మిలిటరీని ప్రయోగించింది. లాఠీ చార్జీ, కాల్పుల ఫలితంగా ఇరువురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో 50 మందికి పైగా సమ్మె చేస్తున్న కార్మికులు గాయపడ్డారు. 22,600 మంది కార్మికులు ఈ సమ్మెను క్రమశిక్షణతో, ఒక పద్ధతి ప్రకారం నిర్వహించారు.

జౌళి కార్మికుల ప్రథమ సార్వత్రిక సమ్మె

బొంబాయిలోని నూలుబట్టల పరిశ్రమకు చెందిన కార్మికులు 1928-1929 సంవత్సరాలలో జరిపిన రెండు సార్వత్రిక సమ్మెలు భారత కార్మికోద్యమ చరిత్రలో ప్రముఖ స్థానమాక్ర మించాయి. ఈ సమ్మెలు ఒక పట్టణంలోని ఒకే పరిశ్రమలో జరిగినప్పటికీ, దేశవ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించాయి. మొట్టమొదటి సమ్మె 1928 ఏప్రిల్ 26న ప్రారంభమై దాదాపు ఆరు నెలలపాటు కొనసాగింది.

1929 జులై ప్రప్రథమ సార్వత్రిక సమ్మె

పని గంటలను పొడిగించడానికి వ్యతిరేకంగా జూట్ కార్మికులు సార్వత్రిక సమ్మె జరిపారు. బెంగాల్‌లోని జూట్ మిల్లు కార్మికులు సాగించిన ఈ సార్వత్రిక సమ్మె పోరాటం కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలోనే కాక, కార్మికవర్గాన్ని సుసంఘటితం చేయడంలో ఒక విశిష్టతను సంతరించుకున్నది. వివిధ మతాలు, జాతులు, భాషలకు చెందిన కార్మికులు సంఘటితమై సాగించిన ఈ వీరోచిత పోరాటం భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం చరిత్రలోనే మరువలేనిది.

టాటా ఇనుము-ఉక్కు కర్మాగారంలో సమ్మె

పద్దెనిమిది వేలమంది టాటా ఇనుము ఉక్కు కర్మాగారం కార్మికులు జరిపిన సుదీర్ఘ పోరాటమిది. 1928 ఏప్రిల్ 18న ప్రారంభమై ఆరు నెలలు సాగిన ఈ సమ్మె అనేక గుణపాఠాలు నేర్పింది. ఇది ఒకవైపు కార్మికుల అచంచలమైన పట్టుదల, ధైర్యసాహసాలను వెల్లడించగా మరొకవైపు భారత బడా పెట్టుబడిదారుల పట్ల జాతీయ నాయకుల వైఖరి వెల్లడైంది. సంస్కరణవాద నాయకులు ఎంతటి విశ్వాస ఘాతుకానికి, నైచ్యానికి ఒడిగట్టేది స్పష్టమయ్యాయి.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్



లేబర్‌కోడ్‌లు
అసత్య ప్రచారాలు ...వాస్తవాలు

కేంద్ర ప్రభుత్వం ఏం చెబుతోంది?-1	వాస్తవం
లేబర్ కోడ్ అమలు వల్ల ఇన్‌స్పెక్టర్ -కమ్- ఫెసిలిటేటర్ విధానంతో పారదర్శకత వస్తుంది	• ఫిర్యాదు ఆధారిత తనిఖీలు ముగిసిపోయాయి. • నిబంధనలు పాటిస్తున్నట్లు వారికి వారే సర్టిఫికేట్లు ఇచ్చుకోవడానికి యజమానులకు అనుమతి. దీంతో నిబంధనలు యదేచ్ఛగా ఉల్లంఘించే అకాశం

కార్మికోద్యమ యోధులు



కెఎల్ నరసింహం
1916-1967

కర్లపాలెం లక్ష్మీ నరసింహం కార్మికోద్యమానికి అంకితమై పనిచేశారు. కెఎల్ నరసింహంగా ప్రసిద్ధులైన ఈయన రైల్వే, టుబాకో, విద్యుత్ కార్మికోద్యమాలను రాష్ట్రంలో నిర్మించారు.9.5.1967న ఆయన మరణించారు.

ఉధృతంగా ప్రెస్ వర్కర్స్ పోరాటాలు

రాష్ట్రంలోని కార్మికోద్యమం తొలినాళ్లలో ప్రెస్ వర్కర్స్ పోరాటాలు ఉధృతంగా సాగాయి. కూలీ రక్షణ సమితుల చొరవతో వివిధ ప్రాంతాల్లో తొలుత ప్రెస్ వర్కర్ల సంఘాలు ఏర్పాటయ్యాయి. అప్పటికే జాతీయ స్థాయిలో జరుగుతున్న పోరాటాలతో స్ఫూర్తి పొందిన రాష్ట్రంలోని ప్రెస్ వర్కర్లు అనేక ఆందోళనలు నిర్వహించారు. ఒక దశలో ప్రెస్ వర్కర్ల ఆందోళన జరగని జిల్లా అంటూ దాదాపుగా రాష్ట్రంలో లేని పరిస్థితి ఏర్పడింది. 1935 నవంబర్ 2,3 తేదీలలో వం౦౦బా౦౦౦లో రెండవ మహాసభ జరిగింది. దీనికి పుచ్చలపల్లి సుందరయ్య, హాజరయ్యారు.



గుంటూరుతో ప్రారంభం

ప్రెస్‌వర్కర్ల అఖిల భారత తొలిమహాసభ 1934లో జరిగితే, ఆ తరువాత ఏడాదిలోనే గుంటూరులో సంఘం ఏర్పడింది. 1935 మే 26న కూలీ రక్షణ సమితి ఆధ్వర్యంలో గుంటూరు ప్రెస్‌వర్కర్ల సమావేశం జరిగింది. జూన్2న గద్దె వెంకటరాయుడు, ఉదయగిరి సుబ్బారావు అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రెస్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటైంది. రాష్ట్రంలో ఏర్పడిన తొలి ప్రెస్ వర్కర్స్ యూనియన్ ఇది! 1938 జూన్‌లో జీతం మొత్తాన్ని విడతల వారీగా కాకుండా ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఓంకార్ ప్రెస్‌లో కార్మికులు ఆందోళన చేశారు. తెనాలిలో ఫ్యాక్టరీ యాక్ట్‌ను అమలు చేయడానికి ప్రెస్ యజమాన్యాలు నిరాకరించేవి . ఆ చట్ట పరిధి నుండి తప్పించుకోవడానికి కార్మికుల సంఖ్యను తగ్గించి చూపేవి. కొందరు ఆ చట్ట పరిధిలోకి రాకుండాఉండేలా కార్మికులను తగ్గించే నియమించుకునేవారు. ఈ విధానాలకు నిరసనగా 1938లో ఏప్రిల్‌లో బైండింగ్ షాపుల్లోని కార్మికులు సమ్మెకు దిగారు. తెనాలి లక్ష్మీ ప్రెస్ వర్కర్స్ చేసిన సమ్మె సుదీర్ఘ కాలం కొనసాగి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఫ్యాక్టరీ యాక్టు కింద రిజిస్టర్ అయిన లక్ష్మీ ప్రెస్ ఆ చట్టానికి విరుద్ధంగా షరతులు రూపొందించి అమలు చేయడానికి ప్రయత్నించారు. దీనికి కార్మికులు అంగీకరించకపోవడంతో 40 మందిని పనుల నుండి తొలగించారు. ఈ తొలగింపును నిరసిస్తూ 1939 మార్చి 11వ తేదిన సమ్మె ప్రారంభమైంది. మార్చి 12వ తేదిన తెనాలి పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. 28 రోజుల పాటు ఈ సమ్మె కొనసాగింది. వీరికి మద్దతుగా తెనాలిలోని ఇతర ప్రెస్‌లలోని కార్మికులందరూ ఒక్కరోజు సమ్మె నిర్వహించారు.రాష్ట్రమంతా వివిధ ప్రాంతాల్లో సంఘీభావ సభలు జరిగాయి. గుంటూరు, విజయవాడల్లో విరాళాలు పోగుచేసి ఇచ్చారు.

ఇతర ప్రాంతాల్లో

విజయవాడలో 'బెజవాడ ప్రెస్ వర్కర్స్ యూనియన్' ఆధ్వర్యంలో పోరాటాలు జరిగాయి. 1937లో ఆంధ్రగ్రంధాలయ ప్రెస్‌ను మూసివేయడంలో నాటి కార్మిక శాఖ మంత్రి జోక్యం చేసుకోవాల్సివచ్చింది. విజయనగం జిల్లాలో 1939 నాటికి యూనియన్ ఏర్పడింది. ఏలూరులో ప్రెస్ వర్కర్ల యూనియన్‌కు పోటీగా యజమానులు 'ప్రింటర్స్ అసోసియేషన్'ను ప్రారంభించారు. కార్మికులపై షరతులతో దాడికి దిగారు. వీటిని కార్మికులు ప్రతిఘటించారు. కర్నూలులో 1939లో యూనియన్ ఏర్పాటైంది. దీనిని విచ్ఛినం చేయడానికి యజమానులు పోటీ సంఘాన్ని ఏర్పాటు చేయాలని ప్రయత్నించినా ఫలితమివ్వలేదు. అనంతపురంలో 1939 ఆగస్టులో, నెల్లూరులో 1939 జనవరి 29న ప్రెస్ వర్కర్స్ యూనియన్‌లు ఏర్పాటైనాయి.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

భ్రమల కలలు

సైబర్‌సిటీలు..ఎఐ హబ్‌లు
కలల వలలతో కపట పాలకులు
శ్రమ లేకుండా పుట్టేస్తారా?
భ్రమలు కలలతో నెట్టేస్తారా?



శ్రమ .. సిరి

కొండలు పగలేసినం
బండలనే పిండినం
మా నెత్తురు కంకరగా
ప్రాజెక్టులు కట్టినం
శ్రమ ఎవడిదిరో
సిరి ఎవడిదిరో

కష్ట జీవులు

నీ ఒంట్లో ప్రతి రక్తంబొట్టు
దోపిడి దొంగల సంపద పెట్టు
కష్టజీవులంతా కడితే జట్టు
పరాన్న భుక్కుల కట్టు

సంక్రాంతికి 'పరాశక్తి'



శ్రీలీల నటించిన 'పరాశక్తి' సినిమా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. శివకార్తికేయన్ ప్రధానపాత్రలో వస్తోన్న ఈ చిత్రం ఆయన కెరీర్‌లో 25వ ప్రాజెక్ట్. ఇందులో రవి మోహన్, అథర్వ మురళి కీలక పాత్రలో కనిపించనున్నారు. సుధా కొంగర దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తన పాత్ర గురించి శ్రీలీల ఒక ఇంటర్వ్యూలో ఇలా మాట్లాడారు. 'నిలదొక్కుకోవడానికి కొన్ని సినిమాలు చేస్తాం. కానీ ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోవాలంటే కొన్ని చిత్రాలు చేయాలి. ఇన్నాళ్లు నేను ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికే సినిమాలు చేశాను. కానీ మొదటిసారి ప్రేక్షకుల మనసులో నిలిచిపోయే ప్రాజెక్ట్‌తో రాబోతున్నాను. నా సినిమాలన్ని ఒకెత్తు అయితే.. 'పరాశక్తి' మాత్రం ఒకెత్తు. 60లో జరిగే కథగా రాబోతుంది. నా పాత్రను సుధా కొంగర అద్భుతంగా డిజైన్ చేశారు. పాతకాలం హీరోయిన్లను చూసిన ఫీలింగ్ నా పాత్రను చూస్తే కలుగుతుంది. నటిగా నన్ను మరో మెట్టు పైన నిలబెట్టే సినిమా 'పరాశక్తి' అని భావిస్తున్నా' అని చెప్పారు.

త్వరలోనే 'జోనా' ప్రారంభం



'త్వరలో నేను తెరకెక్కించబోతున్న వెబ్‌సిరీస్ 'జోనా'. స్క్రిప్ట్ వర్కు ఇప్పటికే పూర్తయ్యింది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభమవుతుంది. గతంలో నేను చేసిన ఇగ్నో, రోధన వంటి షార్ట్ ఫిలిమ్స్ మంచి ఆదరణ పొందాయి. సినిమారంగంలోని వివిధ విభాగాల్లో పనిచేశా. ఇప్పటికే అపారమైన అనుభవాన్ని పొందా. జోనా సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించాలనే ప్రయత్నంలో ఉన్నా. సినీరంగంలో ఉన్న నేనున్న అందరి మంచి -చెడులను ఆక్షాంక్షించేలా కృషిచేస్తున్నా. ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ (ఐఎఫ్ఎంఎ) ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల జయప్రదానికి నా వంతుగా కృషిచేస్తున్నా. అలాగే నాకు వెనుక నుండి సపోర్ట్ చేస్తున్న సినిమా డైరక్టర్, ఎపి ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ చైర్మన్, ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ అక్కమ్మ గారి సూర్యనారాయణలకు ప్రత్యేక ధన్యవాదాలు. ఇంకా నాకు పులగం రామచంద్రారెడ్డి, దిలీప్ హెచ్ఆర్, మలిపెద్ది రవళి, నేట్టి అనిల్‌బాబు, మల్లపాటి రామలక్ష్మి, బిమ్మిబాల, జివిఎల్ లక్ష్మీ పద్మ, ఉమామహేశ్వరి, శివకుమార్ సినీ పరిశ్రమలో మంచి సహకారాన్ని అందిస్తున్నందుకు అభినందనలు. నటీనటులు, కార్మికులు, నిర్మాతలు, దర్శకులంతా ఐక్యంగా ఉండి ఆంధ్రాలో తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధికి ప్రయత్నిస్తున్నాం. ఆ దిశగా జరిగే కృషిలో నేనూ భాగస్వామి అయినందుకు చాలా ఆనందంగా ఉంది' అని ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ (ఐఎఫ్ఎంఎ) రాష్ట్ర చాప్టర్ జాయింట్ సెక్రటరీ బాదుల్లా అన్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌లో అతిథుల చేతులమీదుగా 'జోనా' టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



'బోర్డర్ 2' టీజర్ విడుదల

1997లో రిలీజైన 'బోర్డర్' చిత్రానికి సీక్వెల్‌గా 'బోర్డర్ 2' తెరకెక్కించారు. సన్నీ డియోల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దొసాంజ్ తదితరులు ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించారు. తాజాగా ఈ చిత్రం నుండి టీజర్ రిలీజ్ చేశారు. 2026 జనవరి 23న ఈ సినిమాని థియేటర్లలో రిలీజ్ చేయనున్నారు. తొలి పార్ట్‌కి జెపి దత్తా దర్శకత్వం వహించగా.. రెండో భాగాన్ని అనురాగ్ సింగ్ తీశారు. 1971లో జరిగిన ఇండో-పాక్ యుద్ధం నేపథ్య కథతోనే ఈ సినిమాని కూడా తెరకెక్కించారు. ఇందులో వరుణ్ ఆర్మీ, దిల్జీత్ ఎయిర్‌ఫోర్స్, అహన్ శెట్టి నేవీ సైనికులుగా కనిపించనున్నారు.

జనవరి 1న ఉపేంద్ర '45'



శివ రాజ్‌కుమార్ ఉపేంద్ర ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న మల్టీస్టారర్ చిత్రం '45' (45). ఈ సినిమా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ఈ సినిమా నుండి ట్రైలర్ విడుదలైంది. ఈ చిత్రంలో రాజ్ బి. శెట్టి కూడా ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఉపేంద్ర గత చిత్రాల మాదిరిగానే ఇందులోనూ ఒక డిఫరెంట్, ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనున్నట్లు సమాచారం. తెలుగు ప్రేక్షకుల కోసం ఈ చిత్రాన్ని వారం ఆలస్యంగా, జనవరి 1న కొత్త సంవత్సరం కానుకగా విడుదల చేయనున్నారు.


మాదక ద్రవ్యాల ప్రమాదాన్ని తెలిపేలా 'వెస్టన్ లవ్'

సమాజంలో రుగ్మతగా మారిన మాదక ద్రవ్యాల సమస్యను పట్టిచూపిన 'వెస్టన్ లవ్' సినిమా ఖచ్చితంగా ప్రేక్షకాదరణ పొందుతుంది. గతంలో ఎక్కడో మాటుగా జరిగే మాదక ద్రవ్యాలు సేవనం ఇప్పుడు మన ప్రాంతం, వీధుల్లోకి, ఇళ్లల్లోకి వరకూ పాకింది. ఇది భవిష్యత్తు తరాలకు పెనుప్రమాదం. ఇదే విషయాన్ని మా సినిమాలో ప్రస్తావించాం. రెండు తెలుగు రాష్ట్రాల్లోని థియేటర్లలో త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయబోతున్నాం. మంచి కాపీ, ప్రింట్ చాలా బాగా వచ్చింది. ఖచ్చితంగా ఈ సినిమా మంచిగా ప్రేక్షకాదరణ పొందుతుందని నమ్ముతున్నాం' అని నిర్మాతలు ఎంఆర్ కాకర్ల, రావి సౌజన్య అన్నారు. వారాహి ఆర్ట్స్ అండ్ శక్తి క్రియేషన్స్ బ్యానర్‌పై 'కాకర్ల ఎంఆర్' కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'వెస్టన్ లవ్'. వెంకట్ బొబ్బా సమర్పణలో కథానాయకుడిగా రావి రామ్‌చరణ్, కథానాయికగా మాహి ప్రధాన తారాగణంగానూ, విష్ణుశ్రీ, సత్యఈషా, పవన్, సుమన్, అశోక్‌కుమార్, రవిప్రకాష్ ఇతర పాత్రల్లో నటించారు. సినిమాటోగ్రఫీ పిఎల్‌కె రెడ్డి, సంగీతం ప్రమోద్ పులిగిల్ల, ఎడిటర్‌గా నందమూరి హరి. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో మంగళవారం సాయంత్రం ప్రివ్యూ షోను చిత్ర యూనిట్ ఏర్పాటుచేయగా పలువురు ప్రముఖులు వీక్షించారు. అనంతరం మీడియా సమావేశంలో చిత్ర యూనిట్ ప్రతినిధులతో కలిసి ఎంఆర్ కాకకర్ల, రావి సౌజన్య చిత్ర విశేషాలను వివరించారు.



కుర్రాళ్లు కేక

- రూ.14.20కోట్లు చొప్పున ప్రశాంత్, కార్తీక్ చెన్నై చెంతకు
- రికార్డు ధర పలికిన గ్రీన్
- రూ.25.20కోట్లకు కోల్‌కతా సొంతం
- ముగిసిన ఐపిఎల్ 2026 మినీ వేలం





అబుదాబి: ఇండియన్ ప్రిమియర్ లీగ్ (ఐపిఎల్) సీజన్-2026 మినీ వేలంలో దేశవాళీ క్రికెటర్లు ప్రశాంత్ వీర్, కార్తీక్ శర్మలను దక్కించు కొనేందుకు అన్ని ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి. మంగళవారం జరిగిన వేలంలో 19ఏళ్ల ఉత్తరప్రదేశ్ కుర్రాడు ప్రశాంత్ వీర్, రాజస్తాన్‌కు చెందిన 19ఏళ్ల కార్తీక్ శర్మలను చెన్నై సూపర్ కింగ్స్ కైవసం చేసుకుంది. ఒక్కొక్కరికిపై ఏకంగా రూ.14.20 కోట్లు చొప్పున అత్యధిక నగదు వెచ్చించి కొనుగోలు చేసింది. ఇక ఆస్ట్రేలియాకు చెందిన కేమరాన్ గ్రీన్ ఈసారి జరిగిన మినీ వేలంలో అత్యధిక ధర పలికిన ఆటగానిగా నిలిచాడు. అతడిని కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.25.20కోట్లకు కొనుగోలు చేయగా.. గత సీజన్‌లో అత్యధిక ధరకు అమ్ముడుపోయిన వెంకటేశ్ అయ్యర్‌ను రూ.7కోట్లకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దక్కించుకుంది. మినీ వేలం రేసులో నిలిచిన 390మంది ఆటగాళ్లలో అన్ని ఫ్రాంచైజీలు కలిసి 77మంది ఆటగాళ్లను కొనుగోలు చేశాయి. వీరిలో 29మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. 10 ఫ్రాంచైజీలు కలిసి 77మంది ఆటగాళ్ల కొనుగోలుకు రూ.215.45కోట్లు ఖర్చు చేశాయి.

జాక్‌పాట్ కొట్టిన గ్రీన్..

ఐపిఎల్ వేలం చరిత్రలోనే సరికొత్త రికార్డు నమోదైంది. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కేమరాన్ గ్రీన్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్(కెకెఆర్) ఏకంగా రూ.25.20 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో ఐపిఎల్ వేలం చరిత్రలో అత్యంత ఖరీదైన విదేశీ ఆటగాడిగా గ్రీన్ నిలిచాడు. అయితే, వేలంలో రికార్డు ధర పలికినప్పటికీ, అతనికి ఐపిఎల్ కొత్త నిబంధన ప్రకారం రూ.18 కోట్లు మాత్రమే అందనుంది. దీంతో గ్రీన్.. తన సహచర ఆటగాడు మిచెల్ స్టార్క్ (రూ.24.75 కోట్లు, 2024లో కేకేఆర్) రికార్డును అధిగమించాడు. ఐపిఎల్ చరిత్రలో ఓవరాల్‌గా అత్యంత ఖరీదైన ఆటగాళ్ల జాబితాలో రిషబ్ పంత్ (రూ. 27కోట్లు), శ్రేయస్ అయ్యర్ (రూ. 26.75 కోట్లు) తర్వాత గ్రీన్ మూడో స్థానంలో నిలిచాడు. గ్రీన్ 2023లో ముంబయి ఇండియన్స్ తరపున ఐపిఎల్‌లోకి అడుగుపెట్టాడు. ఆ తర్వాత 2024 సీజన్‌లో ట్రేడింగ్ ద్వారా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబీ) తరపున ఆడాడు. గత సీజన్‌లో 13 మ్యాచ్‌లలో 255 పరుగులు చేయడంతో పాటు 10 వికెట్లు పడగొట్టాడు.

యువ క్రికెటర్లనే నమ్ముకున్న చెన్నై...

దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటుతున్న యువ క్రికెటర్లపై చెన్నై సూపర్ కింగ్స్ కోట్లు కుమ్మరించింది. ఉత్తరప్రదేశ్ కుర్రాడు ప్రశాంత్ వీర్, రాజస్తాన్ కుర్రాడు కార్తీక్ శర్మ ఒక్కొక్కరిపై ఏకంగా రూ.14.20 కోట్లు కుమ్మరించి చెన్నై సూపర్‌కింగ్స్ వేలంలో కొనుగోలు చేసింది. లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటరైన ప్రశాంత్ వీర్ రూ.30 లక్షలతో వేలంలో రేసులో నిలిచాడు. ప్రశాంత్ ఉత్తరప్రదేశ్ టి20లో 155.34 స్ట్రయిక్ రేటుతో 320పరుగులు సాధించాడు. బంతితోనూ రాణించి 8 వికెట్లు లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్. ఇక సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 112పరుగులు, 9 వికెట్లు పడగొట్టాడు. 19 ఏళ్ల రాజస్తాన్‌కు చెందిన వికెట్ కీపర్, బ్యాటర్ కార్తీక్ 12 టి20ల్లో 162.93 స్ట్రయిక్‌రేటుతో 334 పరుగులు సాధించాడు. ఇతడిని దక్కించుకొనేందుకు కోల్‌కతా నైట్‌రైడర్స్ చివరి వరకు పోటీపడింది. కానీ చివరకు చెన్నై రూ.14.20 కోట్లకు దక్కించుకుంది.

స్టార్ ఆటగాళ్లకు నిరాశే..

మినీ వేలంలో అన్ని ఫ్రాంచైజీలు యువ క్రికెటర్లను దక్కించుకొనేందుకు పోటీపడగా.. స్టార్ ఆటగాళ్లు, సీనియర్ ఆటగాళ్ల కొనుగోలుకు ఏ ఫ్రాంచైజీ పెద్దగా ఆసక్తి చూపలేదు. వీరిలో జాక్ ఫ్రేజర్, డేవాన్ కాన్వే, స్పెన్సర్ జాన్సన్, ఫజావుల్లా ఫారూఖీ, తీక్షణ, తస్కిన్ అహ్మద్, ముజీబ్-ఉల్-రెహ్మాన్, అట్కిన్సన్, ముల్డర్, దీపక్ హుడా, లోమ్రోర్, సీన్ అబాట్, డారీ మిఛెల్, దుశన్ శనక, లారెన్స్, నాథన్ స్మిత్, శ్రీకర్ భరత్, గుర్బాజ్, బెయిర్‌స్టో, జేమీ స్మిత్, సిమ్రన్‌జీత్ సింగ్, కరణ్ శర్మ, సకారియా, మురుగన్ అశ్విన్, అన్మోల్‌ప్రీత్ సింగ్, యశ్ ధుల్‌లను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయలేదు.

అభిగ్యన్ రికార్డు డబుల్ సెంచరీ

అండర్-19 ఆసియాకప్



దుబాయ్: అండర్-19 ఆసియాకప్ క్రికెట్ టోర్నీలో 17ఏళ్ల భారత వికెట్ కీపర్, బ్యాటర్ అభిగ్యన్ అభిషేక్ కుందు రికార్డు డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. మలేషియా అండర్-19 జట్టుతో మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో అభిగ్యన్ అభిగ్యన్ కేవలం 125 బంతుల్లో 17ఫోర్లు, 9సిక్సర్ల సాయంతో అజేయంగా 209 పరుగులతో రాణించాడు. దీంతో అండర్-19 ఆసియాకప్ టోర్నీలో డబుల్ సెంచరీ కొట్టిన తొలి భారత బ్యాటర్‌గా అభిగ్యన్ రికార్డుపుటల్లోకెక్కాడు. మలేషియాతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు ఏకంగా 315 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అభిగ్యన్‌కి తోడు త్రివేది(90), వైభవ్ సూర్యవంశీ(50; 26బంతుల్లో 5ఫోర్లు, 3సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించడంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 408 పరుగుల భారీస్కోర్ నమోదు చేయగా.. ఛేదనలో మలేషియా జట్టు 32.1ఓవర్లలో 93పరుగులకే కుప్పకూలింది. దీంతో గ్రూప్-ఎ నుంచి భారత్, పాకిస్తాన్ అండర్-19 జట్లు సెమీస్‌కు చేరాయి. గ్రూప్-బినుంచి శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు 4పాయింట్లతో టాప్-2లో నిలువగా.. బుధవారం ఈ రెండు జట్ల మధ్య జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచిన జట్టు గ్రూప్-టాప్‌గా నిలువ నుంది. 2వ స్థానంలో నిలిచిన జట్టుతో శుక్రవారం జరిగే సెమీస్ భారతజట్టు తలపడ నుంది.

యూత్ వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లు

1. వాన్ షాల్క్‌విక్(దక్షిణాఫ్రికా) : 215(జింబాబ్వేపై, 2025)
2. అభిజ్ఞాన్ కుందు(భారత్) : 209(నాటౌట్); మలేషియాపై, 2025)
3. హసిత్ బోయగోడ(శ్రీలంక) : 191(కెన్యాపై, 2018)

ఆంధ్ర గెలుపు... హైదరాబాద్ ఓటమి
సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ ఫైనల్‌కు జార్ఖండ్, హర్యానా

ముంబయి: సయ్యద్ ముస్తాక్ అలీ టి20 ఫైనల్‌కు జార్ఖండ్, హర్యానా జట్లు ప్రవేశించాయి. మంగళవారం జరిగిన నిర్ణయాత్మక మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు పటిష్ట జార్ఖండ్‌ను ఓడించినా.. మెరుగైన రన్‌రేట్‌తో జార్ఖండ్ ఫైనల్‌కు చేరగా.. గ్రూప్-ఎలో హైదరాబాద్ జట్టు అనూహ్యంగా 124 పరుగుల తేడాతో హర్యానా చేతిలో ఓటమి పాలైంది. దీంతో హర్యానా జట్టు గ్రూప్ టాపర్‌గా ఫైనల్‌కు చేరింది. డివై పాటిల్ స్టేడియంలో మంగళవారం జరిగిన మూడో, చివరి సూపర్ లీగ్ ఆంధ్ర జట్టు 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 203 పరుగులు చేయగా.. జార్ఖండ్‌ను జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 194పరుగులకే పరిమితం చేసింది. జార్ఖండ్ జట్టు మెరుగైన రన్‌రేట్‌పై ఫైనల్‌కు చేరింది. ఇక హైదరాబాద్ హర్యానా నిర్దేశించిన 247పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 16.1 ఓవర్లలో 122 పరుగులకే కుప్పకూలింది. గురువారం హర్యానా, జార్ఖండ్‌ల మధ్య టైటిల్ పోరు జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68